www.visalaandhra.com

బుధవారం
15-10-2025

హైదరాబాద్ ప్రచురణ

సంపుటి : 10, సంచిక : 24
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

విశాలాంధ్ర

స్థాపితం : 1952

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

వెనిజులాలో కూలిన గని: 14 మంది మృతి

కారకస్: దక్షిణ వెనిజులా, ఎల్ కలావో మున్సిపాలిటీ పరిధిలోని బంగారు గని కుప్పకూలి 14 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. భారీ వర్షాల కారణంగా గని కూలినట్లు అధికారులు తెలిపారు. చాలా మంది చిక్కుకుపోయారని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని జాతీయ విపత్తు నివారణ వ్యవస్థ తెలిపింది. అత్యవసర బృందాలు సహాయ చర్యల్లో నిమగ్నమైనట్లు వెల్లడించింది. 14 మృతదేహాలను మూడు వేర్వేరు సొరంగాల నుంచి వెలికి తీసినట్లు తెలిపింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని, అనేక మంది చిక్కుకొని ఉండటంతో మృతులు పెరగవచ్చని వెల్లడించింది.

ఆంధ్రా పర్వతారోహకుడి అరుదైన ఘనత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు చెందిన పర్వతారోహకుడు భరత్ తమ్మినేని అరుదైన ఘనత సాధించారు. ప్రపంచంలోనే ఎత్తైన 14 శిఖరాల్లో ఒకటైన చైనాలో దాదాపు 8,188 మీటర్ల మౌంట్ చో ఒయు పర్వతాన్ని అధిరోహించారు. ఇప్పటికే ఎనిమిది అత్యంత ఎత్తైన పర్వతాలను అధిరోహించగా, మౌంట్ చో ఒయు ఎక్కి తొమ్మిది శిఖరాలు అధిరోహించిన మొదటి భారతీయుడిగా నిలిచాడు. భరత్ సెప్టెంబర్ 30న చైనాలోని చో ఒయు బేస్ క్యాంప్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో ప్రతికూల వాతావరణం, భారీ హిమపాతం

- మిగతా 2 లో

తెలంగాణ రైజింగ్ విజన్-2047 సర్వే

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణా రాష్ట్రాన్ని రానున్న రోజుల్లో అభివృద్ధి, సంక్షేమ రంగంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ విజన్-2047 డాక్యుమెంట్‌ను రూపొందిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందిస్తున్న ఈ విజన్ 2047 డాక్యుమెంట్ తయారీలో ప్రతి ఒక్క పౌరుడు భాగస్వామ్యం పొందేలా సిటిజన్ సర్వే చేపట్టారు. అక్టోబరు 10న ప్రారంభమయిన ఈ సర్వేలో రాష్ట్ర ప్రజలు, ఎన్ఆర్ఐలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. ఈ తెలంగాణ రైజింగ్ విజన్-2047 సర్వేలో రాష్ట్రంలోని ప్రతీ ఉద్యోగి

- మిగతా 2 లో

మాగంటి సునీతకు బీఫామ్ అందజేత

విశాలాంధ్ర-హైదరాబాద్: జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాగంటి సునీత గోపీనాథ్‌కు ఆ పార్టీ అధినేత కేసీఆర్ బీఫామ్ అందజేశారు. ఎన్నికల ఖర్చు నిమిత్తం పార్టీ తరఫున 40 లక్షల రూపాయలు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో దివంగత మాగంటి గోపీనాథ్ కూతుళ్లు, కుమారుడు, మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్ రావు తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇదీ లోకం!

నా భూములకేటీ కాదుగా!?

బీసీ రిజర్వేషన్లపై సుప్రీంలో ఎస్ఎల్పీ

- చారిత్రక నిర్ణయానికి బీజేపీ, బీఆర్ఎస్ వ్యతిరేకం
- గురువారం విచారణకు వచ్చే అవకాశం
- న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో మహేష్ గౌడ్ భేటీ

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికల కోసం తీసుకువచ్చిన బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన జీవో నంబరు 9పై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో తెలంగాణ ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. గురువారం విచారణకు రావచ్చని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో 40 పేజీలతో పిటిషన్ వేశామని, ప్రభుత్వం ఇచ్చిన జీవోను యథాతథంగా అమలు చేయాలనే ఆలోచనలో ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చారిత్రక నిర్ణయం తీసుకుందని, ఓబీసీల జీవితాలు బాగుపడాలని చిత్తశుద్ధితో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాలకు అడుగడుగునా బీజేపీ, బీఆర్ఎస్ వ్యతిరేకిస్తున్నాయని విమర్శించారు. వెనక్కి తగ్గకుండా తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల జీవోపై పూర్తి వివరాలతో హైకోర్టులో వాదించినప్పటికీ... జీవో నంబరు-9 పై స్టే విధిస్తూ, పాత విధానంలో ఎన్నికలకు వెళ్లాలని ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. హైకోర్టు ఇచ్చిన తీర్పు బాధాకరమన్నారు. హైకోర్టు ఇచ్చిన స్టేను, ఆర్డర్‌ను సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశామని తెలిపారు. ఈ విషయంలో సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో

- మిగతా 2 లో

బీహార్ ఎన్డీఏలో ముసలం

సీట్ల పంపకంపై బీజేపీ సహా భాగస్వామ్య పార్టీల్లో తీవ్ర అసంతృప్తి

పట్నా: బీహార్ శాసనసభ ఎన్నికలకు సంబంధించి భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సర్దుబాటుపై ఎన్డీఏ తుది ప్రకటన చేసినప్పటికీ ఆయా పార్టీల నడుమ పేచీలు తెగడం లేదు. తొలి విడత ఎన్నికల నామినేషన్లకు వచ్చే శుక్రవారం ఆఖరి రోజు. అంతకు ముందుగా సీట్ల సర్దుబాటు ఓ కొలిక్కి వస్తుందా రాదా అన్న అనుమానాలు పెరుగుతున్నాయి.

సీట్ల పంపిణీలో గుజరాత్ లాబీ (నాయకుల) పెత్తనాన్ని గిరిరాజ్ సింగ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బీజేపీ మిత్రపక్షాల నాయకులు ఉపేంద్ర కుష్వాహ్, జితిన్ రాం మాంఝి, చివరకు ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గిరిరాజ్ సింగ్ ఆగ్రహించడం అంటే బీజేపీలోనే అసంతృప్తి వెల్లుబుకుతోంది అనుకోవాలి. చివరకు బీహార్ శాసనసభ స్పీకర్ నంద కిశోర్ యాదవ్ సీటు కూడా గల్లంతైంది. ఢిల్లీలో కూర్చుని టికెట్లు కేటాయిస్తే సరిపోతుందని బీజేపీ అగ్ర నాయకులు భావించారు. కానీ బీహార్ రాజకీయాలు భిన్నమైనవని వారు గ్రహించలేదు. మహారాష్ట్రలో, ఉత్తరప్రదేశ్ లో సీట్లు కేటాయించినట్టే బీహార్ లో కూడా చేయగలమని బీజేపీ అధిష్ఠానం భావించింది.

బీజేపీ నాయకులు రాజీవ్ ప్రతాప్ రూడీ, ఆర్.కె.సింగ్, నిత్యానంద రాయ్ కూడా అసంతృప్తితోనే ఉన్నారు. వీరి అసమ్మతిని బీజేపీ అధిష్ఠానం గ్రహించలేకపోయింది. సీట్ల పంపిణీకి ముందు మిత్రపక్షాల అభిప్రాయం తెలుసుకునే ప్రయత్నం బీజేపీ అగ్ర నాయకులు చేసినట్టు లేదు. మంగల్

- మిగతా 2 లో

18న గ్రూప్-2 ఉద్యోగ నియామకపత్రాలు

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికయిన గ్రూప్-2 అభ్యర్థులకు ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు. 18 తేదీ సాయంత్రం శిల్పకళా వేదికలో నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత ఉన్నతాధికారులతో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం సీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రూప్-2 ద్వారా ఎంపికయిన 783 మంది అభ్యర్థులకు ముఖ్యమంత్రి నియామక పత్రాలు అందిస్తారని తెలిపారు. వీరిలో దాదాపు 16 శాఖలకు చెందిన అభ్యర్థులు ఉన్నారని. ఈ కార్యక్రమానికి మంత్రులందరినీ ఆహ్వానిస్తున్నామన్నారు. ఎంపికయిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనా కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి అభ్యర్థితో పాటు వారి కుటుంబ సభ్యులను సాయంత్రం 4 గంటల లోపు శిల్పకళా వేదికలో అనుమతించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నియామకాల్లో అత్యధికంగా, సాధారణ పరిపాలన, రెవెన్యూ, వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సైజ్ శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన వారే అధికంగా ఉన్నందున రెవెన్యూ, హోం, జీఏడీ కార్యదర్శులు ఈ కార్యక్రమ నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. నియామక పత్రాలు పొందే అభ్యర్థులు రాబోయే 30 సంవత్సరాలలో సర్వీసులో ఉంటారని, వీరికి ప్రభుత్వ సర్వీస్ పట్ల ఉన్నత భావన కలిగేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని, అందుకు తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, ప్రత్యేక

- మిగతా 2 లో

ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లాలి

- కేంద్రం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఆమోదించాలి
- రాస్తారోకోను విజయవంతం చేయాలి... బీసీ జేఏసీ బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



విశాలాంధ్ర-హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కాలయాపన చేస్తున్న బీజేపీ ద్వంద వైఖరిపై ఈ నెల 15న బీసీ హక్కుల సాధన సమితి అధ్వర్యంలో జిల్లా, మండల కేంద్రాల్లో తలపెట్టిన రాస్తారోకో, నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. అదేవిధంగా బీసీ సంఘాల జేఏసీ అక్టోబరు 18న ఇచ్చిన రాష్ట్ర బంద్ పిలుపునకు సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని తెలిపారు. ఈ బంద్‌లో సీపీఐ కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే విషయంలో ద్వంద వైఖరి అవలంభిస్తోందని, ఇప్పటికయినా బీసీల రిజర్వేషన్‌ను అంశాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూలులో చేర్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని అఖిలపక్ష పార్టీలన్నిటిని ఢిల్లీకి తీసుకు వెళ్లాలని కోరారు. శాసన సభ సాక్షిగా బీజేపీ శాసన సభ్యులు సైతం 42 శాతం

- మిగతా 2 లో

సమాఖ్య వ్యవస్థకు విఘాతం

ఈడీపై సుప్రీం తీవ్ర ఆగ్రహం

న్యూఢిల్లీ: తమిళనాడు మద్యం కుంభకోణం ఆరోపణలపై దర్యాప్తు జరుపుతోన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)పై సర్వోన్నత న్యాయస్థానం మరోసారి అసహనం వ్యక్తం చేసింది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న రాష్ట్ర పోలీసుల హక్కులు లాగేసుకోవడం లేదా అని ప్రశ్నించింది. సమాఖ్య వ్యవస్థ సంగతేమిటని మరోసారి నిలదీసింది. 'రాష్ట్ర పోలీసుల హక్కులను ఉల్లంఘించడం లేదా? మీకు అనుమానం వచ్చినప్పుడల్లా మీ సొంతంగా దర్యాప్తు చేస్తారా? సమాఖ్య వ్యవస్థకు ఏమైంది? ఈ కేసుపై రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు చేయడం లేదా? శాంతి భద్రతలను ఎవరు నియంత్రిస్తారు. గత ఆరేళ్లలో ఈడీకి సంబంధించి ఎన్నో కేసులు చూశాను. మళ్లీ నేనేం చెప్పదలచుకోలేదు' అని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. తమిళనాడులో మద్యం రిటైలర్ 'టాస్మాక్'లో అవకతవకలకు సంబంధించి రాష్ట్ర పోలీసులు, అవినీతి నిరోధక శాఖ నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ మనీలాండరింగ్

- మిగతా 2 లో

మావోయిస్టు అగ్రనేత మల్లోజుల లొంగుబాటు

విశాలాంధ్ర-చింతూరు: మావోయిస్టు అగ్రనేత, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాలరావు అలియాస్ సోను, అలియాస్ భూపతి పోలీసుల ఎదుట లొంగిపోయారు. 60 మంది మావోయిస్టులతో కలిసి ఆయన మహారాష్ట్రలోని గడ్చిరోలి పోలీసులకు సోమవారం రాత్రి లొంగిపోయినట్లు మంగళవారం అధికార వర్గాలు వెల్లడించాయి. లొంగిపోయిన వారిలో కేంద్ర కమిటీ సభ్యుడు, మావోయిస్ట్ పార్టీ డివిజన్ కమిటీకి చెందిన 10 మంది సభ్యులు ఉన్నారు. హుద్రి గ్రామం నుంచి వీరందరూ పోలీస్ వాహనాల్లో గడ్చిరోలి పోలీస్ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. 54 ఆయుధాలను అప్పగించారు. వేణుగోపాల్ అలియాస్ భూపతి అలియాస్ సోను మావోయిస్టు పార్టీలో అత్యంత ప్రభావవంతమైన వ్యూహకర్తలలో ఒకరుగా ఉన్నారు. మహారాష్ట్ర-చత్తీస్‌గఢ్ సరిహద్దులో ప్లాటూన్ కార్యకలాపాలను చాలాకాలంగా పర్యవేక్షించాడని అధికార వర్గాలు తెలిపాయి. ఈ సంవత్సరం ప్రారంభంలో, భూపతి భార్య తారక్క కూడా లొంగిపోయారు. ఆమె మావోయిస్టు ఉద్యమ దండకారణ్య ప్రత్యేక జోనల్ కమిటీ సభ్యురాలిగా వ్యవహరించారు. 1970లో మల్లోజుల మావోయిస్టు పీపుల్స్ గ్రూప్‌లో చేరారు. మావోయిస్టు అగ్రనేత మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్ జీకి ఈయన సోదరుడు. పార్టీ విధివిధానాల రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన మల్లోజుల తలపై రూ.ఆరు కోట్లకు పైగా నజరానా ఉంది. ఇటీవలే కాల్పుల విరమణ, శాంతి చర్చల పేరుతో ఈయన అభయ్ పేరుతో కరపత్రాలు విడుదల చేశారు. కాగా మల్లోజుల లొంగుబాటుపై చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి

- మిగతా 2 లో

బీఆర్ఎస్ ఆరోపణల్లో నిజం లేదు

విచారణ జరిపిన ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్

విశాలాంధ్ర-హైదరాబాద్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని కొన్ని ఇంటి నంబర్ల మీద భారీ సంఖ్యలో ఓట్లు నమోదు అయ్యాయంటూ భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నేతలు చేసిన ఆరోపణలపై హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి (డీఈవో) ఆర్వీ కర్ణన్ స్పష్టత ఇచ్చారు. ఈ వ్యవహారంపై జరిపిన విచారణలో ఓటర్ల జాబితాలో ఎలాంటి అక్రమాలు జరగలేదని, బీఆర్ఎస్ నేతలు ఆరోపించిన చిరునామాలు బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లకు చెందినవని తేలిందని వివరించారు. ఒకే ఇంటి నంబర్‌పై ఎక్కువ ఫ్లాట్లు ఉండటంతో ఓటర్ల సంఖ్య అధికంగా కనిపించిందని తెలిపారు. 8-3-231/బి/118 చిరునామాలో 50 మంది, 8-3-231/బి/119లో 10 మంది, 8-3-231/బి/164లో 8 మంది, 8-3-231/బి/160లో 43 మంది ఓటర్లు ఉన్నారని, వారంతా అక్కడి ఫ్లాట్లలో

- మిగతా 2 లో

ప్రైవేటు బ్యాంకుల జాతీయీకరణ

ఏఐబీఈఏ డిమాండ్

2లో

ఎస్సీ వర్గీకరణతో సామాజిక న్యాయం

అన్ని వర్గాలకు సముచితంగా విద్యావకాశాలు

మంత్రి దామోదర్ రాజనర్సింహ

విశాలాంధ్ర-హైదరాబాద్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణతో విద్యావకాశాల్లో సామాజిక న్యాయం సాధ్యపడిందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఇంతకాలం ప్రొఫెషనల్ కోర్సుల్లో నామమాత్రంగా ఉన్న వర్గాలకు, రిజర్వేషన్ల వర్గీకరణతో ఈ ఏడాది సముచిత ప్రాధాన్యం లభించిందన్నారు. ఎస్సీల్లో అత్యంత వెనుకబడిన కులాలకు చెందిన పిల్లలకు కూడా ఈ ఏడాది మెడికల్, ఇంజినీరింగ్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో సముచిత సంఖ్యలో సీట్లు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎస్సీ కులాలను మూడు గ్రూపులుగా విభజిస్తూ ప్రభుత్వం రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ రిజర్వేషన్ల ప్రకారమే ఈ ఏడాది ఇంజినీరింగ్, మెడికల్ తదితర కోర్సుల సీట్లను భర్తీ చేశారు. ఈ మేరకు మంగళవారం ఇంజినీరింగ్, మెడికల్ తదితర కోర్సుల్లో ఆయా వర్గాల విద్యార్థులకు వచ్చిన సీట్లు, ఇతర అంశాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి బావురి, మెహతర్, మాంగ్, బేడ బుడగ జంగం, మన్నె, కొలుపులవాండ్లు తదితర అత్యంత వెనుకబడిన కులాల పిల్లలకు ప్రభుత్వ మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో సీట్లు వచ్చాయని అధికారులు మంత్రికి వివరించారు. ఎంబీబీఎస్‌లో ఎస్సీ గ్రూప్ 1లో ఉన్న కులాల పిల్లలకు 41 సీట్లు, ఎస్సీ గ్రూప్ 2లో ఉన్న కులాల పిల్లలకు 561 సీట్లు, ఎస్సీ గ్రూప్ 3లో ఉన్న కులాల పిల్లలకు 324 సీట్లు వచ్చాయని అధికారులు తెలిపారు. ఇంజినీరింగ్‌లో

- మిగతా 2 లో

అమెరికా వర్సెస్ చైనా

కార్గోలపై పరస్పరం ఫీజుల ప్రకటన-సముద్ర వాణిజ్యంపై ప్రభావం

వాషింగ్టన్/బీజింగ్: అమెరికా, చైనా మధ్య వాణిజ్య పోరు మళ్లీ భగ్గుమన్నది.ట్రంప్ ప్రభుత్వం సుంకాలతో రెచ్చిపోతుండటంతో జిన్‌పింగ్ సర్కారు దీటుగా బదులిస్తోంది. బీజింగ్‌పై అదనంగా 100శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరోమారు పెరిగాయి. తాజాగా వాణిజ్య నౌకలపై పరస్పరం ప్రత్యేక ఫీజులను రెండు దేశాలు మంగళవారం నుంచి అమల్లోకి తెచ్చాయి. అమెరికా నౌకలు, ఆ దేశ జెండాలతో వచ్చే ఓడల నుంచి ప్రత్యేక చార్జీలు వసూలు చేస్తున్నట్లు చైనా తెలిపింది. తమ నౌకలకు మినహాయింపు ఉంటుందని పేర్కొంది. అటు అమెరికా కూడా ఇదే తరహాలో చైనా నౌకలు, ఓడల నుంచి ఫీజుల వసూళ్లు ప్రారంభించింది. ట్రంప్ వైఖరిని చైనా తప్పుపట్టింది. తమ పోరాటం తుది వరకు సాగుతుందని తేల్చిచెప్పింది. స్పష్టమైన వైఖరితో ముందుకెళుతున్నట్లు తెలిపింది. యుద్ధం కోరుకోవడం లేదు కానీ దీటుగా బదులిస్తామని... చర్చలకు వస్తామంటే తమ ద్వారాలు తెరిచేవుంటాయని ఆ దేశ వాణిజ్య శాఖ వెల్లడించింది. అమెరికా తాజా ఫీజులతో చైనాకు చెందిన కంటైనర్ క్యారియర్ కాస్కోపై ఎక్కువగా ప్రభావం పడుతుంది. 2026 నుంచి 3.2 బిలియన్ మేర భారం పెరుగుతుందన్న అంచనా ఉంది. చైనా ఫీజులతో అమెరికా కంటైనర్ షిప్పులు, క్రూడ్ ట్యాంకులు 11 శాతం, 13 శాతం చొప్పున చెల్లించుకోవాల్సి ఉంటుందని జెరెఫ్రీస్ విశ్లేషకుడు ఒమర్ నొక్త వెల్లడించారు. ఢీ అంటే ఢీ అంటున్న ఈ రెండు ఆర్థిక వ్యవస్థల వైఖరి మారిటైమ్ ట్యాక్సేషన్‌ను ఒత్తిడికి గురిచేస్తుందని, దీంతో అంతర్జాతీయ రవాణాపై పడుతుందని ఏథెన్స్‌కు చెందిన ఎక్లూజివ్ షిప్ బ్రోకర్స్ హెచ్చరించింది. మరోవైపు అరుదైన ఖనిజాల ఎగుమతిపై చైనా ఆంక్షలతో నవంబరు నుంచి 100 శాతం అదనపు సుంకాలను ట్రంప్ ప్రకటించిన విషయం విదితమే.

అట్టుడికిన మడగాస్కర్

- జెన్‌జీ ఆందోళనలకు సైనిక మద్దతు
- కూలిన ప్రభుత్వం
- దేశం వీడిన అధ్యక్షుడు రాజోలినా
- ప్రాణాలు కాపాడుకునేందుకని వివరణ

అంటననారివో: బంగ్లాదేశ్, నేపాల్ తరహాలో మడగాస్కర్‌లో యువతరం తిరుగుబాటు చేసింది. సమస్యలపై గొంతెత్తింది. వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపింది. సైనిక మద్దతు లభించడంతో జెన్‌జీ ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. దీంతో మడగాస్కర్‌లోని ఆండ్రీ రాజోలినా ప్రభుత్వం కుప్పకూలింది. దీంతో అధ్యక్షుడు వెంటనే ఫ్రాన్స్ సైనిక విమానంలో దేశం నుంచి తప్పించుకున్నారు. విద్యుత్, నీటి సరఫరాలో కొరత, ద్రవ్యోల్బణం వంటి వాటితో రగలిన అసంతృప్తిజ్వాలతో ఆఫ్రికాలోని ద్వీప దేశమైన మడగాస్కర్ అట్టుడికిపోయింది. జెన్ జీ ఆందోళనలు మిన్నంటాయి. తొలుత శాంతియుతంగా జరిగినా, తర్వాత హింసాత్మకంగా మారాయి. రాజధాని అంటననారివోలో పరిస్థితి ఉద్రిక్తమైంది. అల్లర్లలో ఆస్తి, ప్రాణ నష్టం జరిగింది. 22 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. ఆందోళనకారులకు ఉన్నతస్థాయి సైనిక విభాగం 'సీఏపీఎస్ఏటీ' మద్దతివ్వడంతో అధ్యక్షుడు ఆదివారం దేశాన్ని వీడినట్లు అధ్యక్ష కార్యాలయం సిబ్బంది ద్వారా తెలిసిందని ఒక ప్రతిపక్ష నాయకుడు తెలిపారు. సెప్టెంబరు 25 నుంచి మడగాస్కర్‌లో జెన్ జీ ఆందోళనలు పెద్దఎత్తున జరిగాయి. ఇదిలావుంటే, తన ప్రాణాలను కాపాడుకోవడం కోసం సురక్షిత ప్రాంతానికి వెళ్లినట్లు అధ్యక్షుడు రాజోలినా వెల్లడించారు. ప్రజాందోళనకు సైనికుల మద్దతు క్రమంలో ప్రభుత్వంపై జరిగిన తిరుగుబాటు కారణంగా దేశాన్ని విడిచి వెళ్లినట్లు చెప్పుకున్నారు. గుర్తుతెలియని ప్రాంతం నుంచి సోమవారం రాత్రి టీవీ మాధ్యమంగా జాతిని ఉద్దేశించి మాట్లాడుతూ దేశాన్ని వీడిచి పెట్టి వెళ్లినట్లు అధ్యక్షుడు తెలిపారు కానీ రాజీనామా చేసినట్లు ప్రకటించలేదు. అధ్యక్షుడి అధికారిక ఫేస్‌బుక్ ఖాతా ద్వారా ఆయన ప్రసంగం ప్రసారం చేశారు. సమస్యల పరిష్కారానికి చర్చలకు రావాలని, రాజ్యాంగాన్ని గౌరవించాలని మడగాస్కర్ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

నార్వే, ఆస్ట్రేలియా ఎంబసీల మూసివేత

బుర్కినా ఫాసో, జింబాబ్వేలో నూతన కార్యాలయాలు వెనిజులా ప్రకటన

కారకస్/ఓస్లో: వెనిజులా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నార్వే, ఆస్ట్రేలియాలోని తమ దౌత్య కార్యాలయాలు మూసివేసింది. అలాగే బుర్కినా ఫాసో, జింబాబ్వేలో కొత్త కార్యక్రమాలు ప్రారంభించనున్నది. అమెరికాతో పెరుగుతున్న ఉద్రిక్తల దృష్ట్యా విదేశాంగ సేవల పునర్వ్యవస్థీకరణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు మదురో ప్రభుత్వం ప్రకటించింది. దౌత్య మిషన్ల ద్వారా నార్వే, ఆస్ట్రేలియాలోని వెనిజులా ప్రజలకు సేవలు అందిస్తామని తెలిపింది. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని పేర్కొంది. కాగా తమ దౌత్య కార్యాలయాలు మూసివేయడంపై నార్వే విదేశాంగ శాఖకు వెనిజులా నోటీసు ఇచ్చింది. అందులో కారణాలు పేర్కొనలేదు. వెనిజులా రాజధాని కారకస్‌లో నార్వేకు దౌత్య కార్యాలయం లేదు. కొలంబియాలోని రాయబార కార్యాలయం ద్వారా స్థానిక వ్యవహారాలు చూసుకుంటోంది. తాజా పరిణామంపై నార్వే విదేశాంగ శాఖ స్పందిస్తూ కలిసి పనిచేయాలని, చర్చలు జరపాలని అనుకున్నాం కానీ ఇది దురదృష్టకరం' అని అన్నారు. నోబెల్ పురస్కారం తమ దేశ ప్రభుత్వం తీసుకునే స్వతంత్ర నిర్ణయమని పేర్కొంది. సంబంధిత కమిటీ అన్ని వ్యవహారాలు చూస్తుందని తెలిపింది. వెనిజులా తమ దౌత్య కార్యాలయాలు మూసివేయడంతో తమకు ఎటువంటి సంబంధం లేదని నార్వే నోబెల్ కమిటీ కార్యదర్శి హార్పవికెన్ పేర్కొన్నారు. వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాడోకు నోబెల్ శాంతి పురస్కారాన్ని ప్రకటించిన కొద్ది రోజుల్లోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఆమె తన పురస్కారాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అంకితమివ్వడం విదితమే.

సమాఖ్య వ్యవస్థకు విఘాతం

(మొదటిపేజీ తరువాయి)

కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. మార్చిలో ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో సోదాలు జరిపింది. మే నెలలో సంబంధిత అధికారుల ఇళ్లల్లోనూ తనిఖీలు చేసింది. చివరకు ఈ వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరుకుంది. విచారణ చేపట్టిన ధర్మాసనం... ఈడీ అన్ని హద్దులు దాటుతోందని, సమాఖ్య పాలన భావనను ఉల్లంఘిస్తోందని ఆక్షేపించింది. టాస్మాక్‌పై జరుగుతున్న మనీలాండరింగ్ దర్యాప్తుపై స్టే విధించగా... తాజాగా విచారణ పునఃప్రారంభించింది. ఈ నేపథ్యంలో సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం మరోసారి ఈడీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది.

కలప, ఫర్నీచర్‌పై ట్రంప్ సుంకాలు అమల్లోకి

కెనడా, వియత్నాంపై అధిక ప్రభావం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో విరుచుకుపడుతున్నారు. తాజాగా కలపపై సుంకాన్ని అమల్లోకి తెచ్చారు. కిచెన్ కేబినెట్లు, ఫర్నిచర్‌పై 25 శాతం విధించారు. ఈ సుంకాలు మంగళవారం అమల్లోకి వచ్చాయి. అమెరికా పరిశ్రమలకు ఊతం... దేశ భద్రతకు హామీ కోసమే సుంకాలన్నది ట్రంప్ ప్రభుత్వ వాదన. వచ్చే జనవరి నుంచి ఫర్నీచర్‌పై 30 శాతానికి, కిచెన్ కేబినెట్లు, వానిటీలపై 50 శాతానికి సుంకాలు పెరుగుతాయి. బ్రిటన్ నుంచి దిగుమతి చేసుకునే కలప, ఉత్పత్తులపై సుంకం 10 శాతానికి పరిమితం కాగా యూరోపియన్ యూనియన్, జపాన్ నుంచి దిగుమతులపై 15 శాతం అమలవుతుంది. తాజా సుంకాలతో కెనడా, వియత్నంపై ప్రభావం అధికంగా ఉండనుంది. అమెరికాకు అతిపెద్ద కలప సరఫరాదారుగా కెనడా ఉంది. కెనడాపై ఈ సుంకాన్ని అమెరికా 45 శాతం వరకు పెంచింది. దీంతో ఉత్తర అమెరికా విపణి ఒత్తిడికి గురవుతుందనిబీసీ లంబర్ ట్రేడ్ కౌన్సిల్ హెచ్చరించింది. అమెరికాకు ఫర్నీచర్ దిగుమతిదారు దేశాల్లో చైనా, వియత్నాం, మెక్సికో ఉన్నాయి. చైనా నుంచి 27 శాతం, వియత్నాం, మెక్సికో నుంచి చెరో 20 శాతం మేర ఫర్నీచర్‌ను అమెరికా దిగుమతి చేసుకుంటుంది. అమెరికాకు ఎగుమతులపై 10 శాతం సుంకంతో వియత్నంపై తీవ్ర ప్రభావం పడుతోంది. చైనాపై 4 శాతం, మెక్సికోపై 2.5 శాతం మేర భారం పెరుగుతుందని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి.

ప్రైవేటు బ్యాంకుల జాతీయీకరణ

విశాలాంధ్ర-హైదరాబాద్: దేశ ఆర్థికాభివృద్ధికి, జాతీయ సంపద, ప్రజాధనం పరిరక్షణ కోసం ప్రైవేటు బ్యాంకులన్నింటినీ జాతీయీకరణ చేయాలని ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) జాతీయ కార్యదర్శి బీఎస్ రాంబాబు డిమాండ్ చేశారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా నాటి పాలకులు బ్యాంకులను జాతీయీకరణ చేయగా, నేడు జాతీయ బ్యాంకుల ప్రైవేటీకరణ జరుగుతోందని విమర్శించారు. కార్పొరేట్ బినామీలు లక్షల కోట్ల రూపాయల ప్రజా సంపదను దోచుకునే పరిస్థితులు పాలకులు కల్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రైవేటు రంగ బ్యాంకు యూనియన్ల సెల్ పిలుపు మేరకు ప్రైవేటు బ్యాంకుల ఉద్యోగులు మంగళవారం హైదరాబాద్, గన్ ఫౌండ్రీ, చిరాగ్ అలీ లైన్ కరూర్ వైశ్యా బ్యాంక్ డివిషనల్ కార్యాలయం వద్ద ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థను మోదీ ప్రభుత్వం ధ్వంసం చేస్తున్నదని రాంబాబు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి ప్రైవేటు బ్యాంకులను జాతీయీకరణ చేయాలని, అవసరమైన మేరకు రెగ్యులర్ క్లరికల్, సబ్ స్టాఫ్ కేడర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఫెడరల్ బ్యాంకు ఉద్యోగులకు వేధింపులను ఖండించారు. సీఎస్‌బీ సాధ్యమైనంత తొందరగా వేతన సవరణ చేయాలని, అన్ని ప్రైవేటు బ్యాంకుల పెన్షనర్లకు పరిహారం వర్తింపజేయాలని కోరారు. నైనిటాల్ బ్యాంక్ విక్రయాన్ని నిలుపుదల చేసి, దానిని బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనం చేయాలని కేంద్ర ప్రభుత్వంతో పాటు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)ను రాంబాబు డిమాండ్ చేశారు. ప్రైవేటు బ్యాంకుల్లోని సీ టూ సీ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సీబీడీటీ మినహాయింపుతో పింఛన్ నిధి ఏర్పాటు చేయాలని రాంబాబు డిమాండ్ చేశారు. ప్రదర్శనలో ఏపీటీఎస్ బ్యాంకు ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు టి. రవీంద్రనాథ్, ఉప ప్రధాన కార్యదర్శి సమద్ ఖాన్, కార్యదర్శులు శైలేంద్ర, వినోద్, నల్లపు రెడ్డి, ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్ యూనియన్స్ సెల్ ప్రధాన కార్యదర్శి మధుసుదన్, కరూర్ వైశ్యా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సాయి శంకర్, ఫెడరల్ బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కర్నాటక బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీహార్ ఎన్డీఏలో ముసలం

(మొదటిపేజీ తరువాయి)

పాండే, దిలీప్ జైస్వాల్, సమ్రాట్ చౌదరీని సంతృప్తి పరిస్తే బీహార్ లో అంతా సజావుగా జరుగుతుందని బీజేపీ నాయకత్వం భావించింది. కానీ ఈ ఊహ తలకిందులైంది. ఎల్జేపీ నాయకుడు చిరాగ్ పాశ్వాన్ అలిగితే ఆయనను సముదాయించవలసి వచ్చింది. కాగా, నితీశ్ కుమార్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఇద్దరు మంత్రులు రాజీనామా చేశారంటున్నారు. జేడీయూ ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. బ్రహ్మపూర్ నియోజకవర్గం బీజేపీకి బలమైంది అయినప్పుడు మిత్ర పక్షాలకు ఎలా కేటాయిస్తారని గిరిరాజ్ సింగ్ ప్రశ్నిస్తున్నారు. దీనివల్ల బీజేపీ కార్యకర్తల ఆత్మ స్థైర్యం దెబ్బ తింటుందని గిరి రాజ్ అంటున్నారు. జేడీయూకు బలమున్న సీట్లు మిత్రపక్షాలకు ఇస్తే తాము రాజీనామా చేస్తామని ఆ పార్టీ నాయకులు హెచ్చరిస్తున్నారు. మొత్తం మీద ఎవరు ఏ స్థానం నుంచి పోటీ చేస్తారో తెలియని పరిస్థితి ఉంది. జితిన్ రాం మాంఝి, చిరాగ్ పాశ్వాన్ పార్టీలలో కూడా అసమ్మతి సెగలు రేగుతున్నాయి. చివరకు ఎన్డీఏలోని ఐదు పార్టీలలోనూ గందరగోళం కొనసాగుతోంది. కొన్ని సీట్లలో ఈ అయిదు పార్టీలకూ తగినంత బలం ఉండొచ్చు. పోటీ చేయాలనుకునే వారు దండిగానే ఉంటారు. కార్యకర్తలు ఉంటారు. నినాదాలు ఇచ్చే వారూ ఉంటారు. వారి మనోభావాలను అర్థం చేసుకోకుండా కూటమిలోని అయిదు పార్టీలలో ఒక పార్టీకి సీటు కేటాయిస్తే మిగతా పార్టీలలో అసంతృప్తి సహజం. తమ పార్టీకి బలమున్న స్థానం బీజేపీకి కేటాయిస్తే తాము ప్రచారం చేయబోమని జేడీయూ కార్యకర్తలు మొరాయిస్తున్నారు. గిరిరాజ్ సింగ్ జనబలం ఉన్న నాయకుడు. ఆయన తిరుగుబాటు చేస్తే బీజేపీకే నష్టం. ఆయన ముఖ్యమంత్రి పదవి మీద ఆశ పెట్టుకున్న వారు. బీజేపీ నాయకత్వం తమ వాదన వినకుండానే సీట్ల పంపిణీ చేసేసిందన్న భావన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలలో ఉంది. అసమ్మతి కుంపట్లను ఆర్పడానికి అమిత్ షా మాటి మాటికి బీహార్ రావలసి వస్తోంది.

తొలి ఏఐ డేటా హబ్

- అమెరికా తరువాత విశాఖలోనే అతిపెద్ద డేటా సెంటర్
- సీఎం, కేంద్ర మంత్రుల సమక్షంలో ప్రకటించిన గూగుల్
- ఏపీకి ఇది సరికొత్త అధ్యాయమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

గూగుల్ నుంచి 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించే విషయంలో ఆంధ్రప్రదేశ్ సువర్ణ అధ్యాయం లిఖించింది. ప్రపంచాన్ని శాసిస్తున్న డేటా, ఏఐ లాంటి రంగాల్లో విశాఖ నగరం కేంద్ర బిందువు కానుంది. ప్రపంచ ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్... విశాఖ వేదికగా భారీగా పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. అమెరికా వెలుపల అతిపెద్ద ఏఐ డేటా హబ్ ను విశాలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. ఈమేరకు దిల్లీలో జరిగిన భారత్ ఏఐ శక్తి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఏఐ డేటా హబ్ ఏర్పాటు కోసం రానున్న ఐదేళ్ల కాలంలో 15 బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టనున్నట్లు గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ ప్రకటించారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... వచ్చే ఐదేళ్లలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టాలని గూగుల్ నిర్ణయించడం సంతోషం కలిగిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ భారీ పెట్టుబడి భారత డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ లో ఒక కొత్త అధ్యాయం. దేశంలో మొదటి గిగావాట్-స్కేల్ డేటా సెంటర్ విశాఖకు రావటం ఏపీకి గర్వకారణం. రియల్ టైమ్ డేటా, హిస్టారికల్ డేటాల సాయంతో వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు ఆస్కారం ఉంది. ఇతర దేశాలతో పోలిస్తే టెక్నాలజీని భారత్ వేగంగా అందిపుచ్చుకుంటుంది. ఏపీలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను ప్రతి కుటుంబానికీ దగ్గర చేసేలా ప్రయత్నిస్తాం. హైటెక్ సిటీ నిర్మాణంతో హైదరాబాద్ దశ మారింది. ఇప్పుడు విశాఖలో ఏఐ డేటా హబ్ రాకతో ఏపీ దశ మారుతుంది. ప్రధాని మోదీ టెక్నాలజీని వేగంగా అందిపుచ్చుకుంటారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు గురించి చెప్పగానే ఆయన వచ్చే ఏడాది ఫిబ్రవరిలో గ్లోబల్ ఏఐ కాన్ఫరెన్సు నిర్వహించే విషయమై ఆలోచన చేశారన్నారు. ఈ డేటా సెంటర్ ఏర్పాటుకు సహకరించిన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, నిర్మలా సీతారామన్ లకు ధన్యవాదాలు తెలిపారు. ఇంతటి భారీ పెట్టుబడిని ఏపీకి తీసుకురావటంలో ప్రధాన పాత్ర పోషించిన ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

ఏపీకి అతిపెద్ద గూగుల్ ఏఐ డేటా హబ్

విశాఖలో ఏఐ డేటా హబ్ ఏర్పాటు చేయబోతున్నట్లు గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. గిగావాట్ స్కేల్ కంప్యూటింగ్ కెపాసిటీ, సబ్ సీ గేట్ వే సహా భారీ స్థాయి ఎనర్జీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు కోసం 15 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు తెలిపారు. దేశ ప్రగతిలో విశాఖ ఏఐ డేటా సెంటర్ కీలకంగా మారబోతున్నట్లు సుందర్ పిచాయ్ స్పష్టం చేశారు. ఈ విషయంపై ప్రధాని మోదీతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. ఈ ట్వీట్ పై స్పందించిన ప్రధాని మోదీ విశాఖ నగరంలో గూగుల్ ఏఐ డేటా హబ్ ద్వారా టెక్నాలజీ అందరికీ చేరువవుతుందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా భారత నిర్మాణంలో ఈ ఐటీ మౌలిక సదుపాయం కీలకంగా మారుతుందని స్పష్టం చేశారు. ఇక భారత్ ఏఐ శక్తి పేరిట నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రులు ఈ ప్రాజెక్టుతో వివిధ రంగాలకు అవసరమైన సేవలు అందుతాయన్నారు. ఈ ప్రాజెక్టు అత్యంత వేగంగా అమల్లోకి రావటం దేశ ప్రగతిలో అత్యంత కీలకమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. విజనరీ నేతలు ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లాంటి వారి ఆలోచనలు తీసుకువచ్చిన విధానాల వల్ల ఈ ప్రాజెక్టు సాకారం అయిందన్నారు. ప్రోగ్రెసివ్ పాలసీలు, నిర్ణయాల్లో డైనమిజం వల్లే ఇది సాధ్యమని, కేంద్రంలోనూ, ఆంధ్రప్రదేశ్ లోనూ ఈ తరహా సుపరిపాలన ఉందని తెలిపారు. టెక్నాలజీకి ఎక్కువగా ప్రాధాన్యమిచ్చే ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాలు దేశప్రగతిలో కీలక భూమిక పోషిస్తున్నాయని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. దేశంలో డేటా సెంటర్ పాలసీ ద్వారా ఈ తరహా డేటా సెంటర్లు ఏర్పాటు అవుతున్నాయని అన్నారు. ఏఐ డేటా హబ్ ఏర్పాటుతో గ్లోబల్ కనెక్టివిటీ హబ్ గా విశాఖ మారుతుందని గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ వ్యాఖ్యానించారు. ఈ డేటా సెంటర్ ద్వారా వివిధ సంస్థలకు సరైన అవకాశాలు లభిస్తాయని అన్నారు.

ఎస్సీ వర్గీకరణతో సామాజిక న్యాయం

(మొదటిపేజీ తరువాయి)

ఎస్సీ గ్రూప్ 1లో ఉన్న కులాల పిల్లలకు 378 సీట్లు, ఎస్సీ గ్రూప్ 2లో ఉన్న కులాల పిల్లలకు 8,246 సీట్లు, ఎస్సీ గ్రూప్ 3లో ఉన్న కులాల పిల్లలకు 5,466 సీట్లు వచ్చాయని వెల్లడించారు. ఫార్మసీలో ఎస్సీ గ్రూప్ 1లో ఉన్న కులాల పిల్లలకు 60 సీట్లు, ఎస్సీ గ్రూప్ 2లో ఉన్న కులాల పిల్లలకు 1,603 సీట్లు, ఎస్సీ గ్రూప్ 3లో ఉన్న కులాల పిల్లలకు 898 సీట్లు వచ్చాయన్నారు. గ్రూప్ 2, గ్రూప్ 3 కులాల పిల్లలు తమకు రిజర్వ్ చేసిన సీట్లతో పాటు ఓపెన్ కేటగిరీలోనూ పెద్ద సంఖ్యలో సీట్లు సాధించారని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాల అభివృద్ధి విద్యతోనే సాధ్యం అవుతుందని తమ ప్రభుత్వం నమ్ముతోందన్నారు. ఇందుకు అనుగుణంగానే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, కుల గణన, బీసీ రిజర్వేషన్ల పెంపు వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. రిజర్వేషన్ల వర్గీకరణ లక్ష్యం సంపూర్ణంగా నెరవేరాలంటే మెడికల్, ఇంజినీరింగ్ ప్రవేశాల్లో సీట్లు పొందిన ఎస్సీ కులాల విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రాప్ అవుట్ అవకుండా చూసుకోవాలని విద్యాశాఖ అధికారులకు మంత్రి సూచించారు. అత్యంత వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన పిల్లలు ఆర్థిక ఇబ్బందులు, ఇంగ్లీష్ భాష రాకపోవడం వంటి సమస్యలతో ఆత్మన్యూనత భావానికి లోనయ్యే ప్రమాదం ఉందని, ఇది డ్రాప్ అవుట్స్‌కు దారి తీస్తుందని మంత్రి హెచ్చరించారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఇతర నైపుణ్యాలు నేర్పించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఈ సమావేశంలో విద్యా శాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా, సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన, ఉస్మానియా విశ్వవిద్యాలయం వీసీ కుమార్, జేఎన్‌టీయూ వీసీ కిషన్ కుమార్ రెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా పర్వతారోహకుడి అరుదైన ఘనత

(మొదటిపేజీ తరువాయి)

కారణంగా పర్వతాన్ని ఎక్కే ప్రయత్నాలు విరమించుకోవాల్సి వచ్చింది. దీంతో ఆయన అక్కడే ఉన్నారు. మంగళవారం ఉదయం 6.55 గంటలకు ట్రెక్కింగ్ ప్రారంభించి, 8.55 గంటలకు మౌంట్ చో ఒయు శిఖరాన్ని చేరుకున్నారు. భరత్ 2017లో మౌంట్ ఎవరెస్ట్, సెప్టెంబర్ 2018లో మౌంట్ మనస్లు, మే 2019లో మౌంట్ లోట్సే, మార్చి 2022లో అన్నపూర్ణ, ఏప్రిల్ 2022లో కాంచన్‌జంగా, మే 2023లో మకాలు, అక్టోబర్ 2024లో శిశాపాంగ్మా, ఏప్రిల్ 2025లో మౌంట్ ధౌలగిరి వంటి 8వేల మీటర్లకుపైగా ఎత్తైన శిఖరాలను అధిరోహించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 14 శిఖరాల్లో తొమ్మిదింటిని విజయవంతంగా అధిరోహించి రికార్డు నెలకొల్పారు.

గ్రూప్-2 ఉద్యోగ నియామకపత్రాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శులు బెనహర్ మహేష్ దత్ ఎక్కా, రిజ్వి, సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శులు లోకేష్ కుమార్, టీకే శ్రీదేవి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక తదితర అధికారులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై సుప్రీంలో ఎస్ఎల్పీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేకంగా సమావేశమయ్యానట్లు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం వేసిన ఎస్ఎల్పీ గురువారం జాబితా అయ్యే అవకాశం ఉందని, సుప్రీం కోర్టులో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామని అన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో రెండు చట్టాలు చేసినప్పుడు అన్ని పార్టీలూ ఏకమై మద్దతు పలికాయన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఇప్పుడు మాట మార్చి వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు.

మావోయిస్టు అగ్రనేత మల్లోజుల లొంగుబాటు

(మొదటిపేజీ తరువాయి)

విష్ణు దేవ్ సాయి స్పందించారు. '2026 మార్చి 31 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని నిర్మూలించాలనే లక్ష్యం నెరవేరుతుందని, చత్తీస్‌గఢ్ అంతటా ముఖ్యంగా బస్తర్ ప్రాంతంలో వేగవంతమైన అభివృద్ధి జరుగుతుందని నేను ఆశిస్తున్నాను' అని అన్నారు. చత్తీస్‌గఢ్ ఉపముఖ్యమంత్రి విజయ్‌శర్మ మాట్లాడుతూ మావోయిస్టు నేతలు జనజీవన స్రవంతిలో కలవడాన్ని స్వాగతిస్తున్నామని, అలా చేయకుంటే సాయుధ దళాలు సరైన పద్ధతిలో జవాబిస్తాయని విజయ్‌శర్మ పేర్కొన్నారు. నక్సలిజం అంతం కావాలని బస్తర్ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారని వివరించారు.

మల్లోజుల లేఖను వ్యతిరేకించిన హిడ్మా, దేవ్‌జీ!

ఆయుధాలు వదిలేసి శాంతి చర్చలకు వెళ్లాలని ఈ ఏడాది సెప్టెంబరులో మల్లోజుల ఓ లేఖను విడుదల చేశారు. అందుకు మావోయిస్టు పార్టీ నార్త్ బస్తర్ డివిజన్ కమిటీ కూడా మద్దతిచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మల్లోజులు విడుదల చేసిన లేఖను హిడ్మా, దేవ్‌జీ వ్యతిరేకించినట్లు సమాచారం. ఈ క్రమంలో ఇంతకాలం పార్టీ చేసిన తప్పులకు, ఉద్యమం ఓడిపోకుండా కాపాడలేకపోయినందుకు బాధ్యత వహిస్తూ పొలిట్ బ్యూరో సభ్యుడిగా క్షమాపణలు కోరుతున్నానని పేర్కొంటూ మరో లేఖను విడుదల చేశారు. అందులో "ఇంత నష్టానికి, ఇన్ని బలిదానాలకు దారితీసిన విప్లవోద్యమ బాధ్యతల్లో కొనసాగడానికి తాను అర్హుడిని కాదని భావిస్తున్నా. ప్రస్తుతం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఈ నిర్ణయం సరైంది కాదని భావించవచ్చు. కానీ పరిస్థితులు దీన్ని అనివార్యం చేశాయి. వందల మంది మావోయిస్టులను కోల్పోతున్న పరిస్థితుల్లో మిగిలిన వారినైనా కాపాడుకోవాలి. విప్లవోద్యమాన్ని విజయవంతంగా నడిపించడానికి బహిరంగంగా ప్రజల్లోకి వెళ్లడం తప్ప మరో దారి లేదు" అని మల్లోజుల తన లేఖలో తెలిపారు.

కర్రెగుట్టలో భారీ డంప్ స్వాధీనం



చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా కర్రెగుట్టలోని ఓ ప్రాంతంలో మావోయిస్టుల భారీ డంప్‌ను భద్రతా బలగాలు గుర్తించాయి. ఇటీవల తడపల కొండల్లో ఏర్పాటుచేసిన ఎఫ్‌వోబీ (ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్) క్యాంపు నుంచి కోబ్రా 206, సీఆర్పీఎఫ్ 229, 153, బెటాలియన్ల నేతృత్వంలో కర్రెగుట్ట ప్రాంతంలోని కొండల్లో ఆపరేషన్ చేపట్టాయి. ఈ సందర్భంగా మావోయిస్టుల రహస్య స్థావరాన్ని బలగాలు గుర్తించాయి. అక్కడి నుంచి 51 లైవ్ బీజీఎల్ (బ్యారెల్ గ్రెనైడ్ లాంచర్లు), 100 బండిల్స్ హెచ్‌డీ అల్యూమినియం వైరు, 50 స్టీలు పైపులు, 20 ఇనుప షీట్లు, 48 ఇనుప ప్లేట్లు, పెద్ద మొత్తంలో విద్యుత్ వైర్లు, బీజీఎల్ తయారీ సామగ్రి, 5 ఐఈడీ (ఇంప్రూవ్ వైజ్డ్ ఎక్స్ ప్లోజివ్ డివైస్)లను స్వాధీనం చేసుకున్నారు. ఐఈడీలను బీడీఎస్ (బాంబు డిస్పోజల్ స్క్వాడ్) బృందం అక్కడికక్కడే నిర్వీర్యం చేసింది. మావోయిస్టులు దాచి ఉంచిన ఈ సామగ్రిని స్వాధీనం చేసుకోవడంతో వారి భారీ కుట్ర విఫలమైనట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఈ ఘటన తర్వాత కర్రెగుట్ట ప్రాంతంలో ఆపరేషన్ భద్రతా బలగాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి.

తెలంగాణ రైజింగ్ విజన్-2047 సర్వే

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొని తమ విలువైన సలహాలు, సూచనలు అందించాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం సర్క్యులర్ జారీ చేసింది. ఈ నెల 25 వరకు జరిగే విజన్-2047 సర్వేలో అందరు ఉద్యోగులు పాల్గొనడంతో పాటు ఈ సర్వే లింక్‌ను, క్యూ ఆర్‌కోడ్‌ను తమ తమ కార్యాలయాల్లో ప్రదర్శించడంతో పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జారీ చేసిన ఆ సర్క్యులర్‌లో ఆదేశించారు. ఈ సర్వేలో పాల్గొనేందుకుగాను http www.telangana.gov.in/telanganarising అనే లింక్ ద్వారా పాల్గొనాలని ఒక ప్రకటనలో తెలియజేశారు.

బీఆర్ఎస్ ఆరోపణల్లో నిజం లేదు

(మొదటిపేజీ తరువాయి)

నివసిస్తున్నవారేనని స్పష్టం చేశారు. ఈ ఓటర్లందరి పేర్లు 2023 నుంచే జాబితాలో ఉన్నాయని, వారు గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో తమ ఓటు హక్కును కూడా వినియోగించుకు న్నారని ఆర్వీ కర్ణన్ పేర్కొన్నారు. సరైన చిరునామాల ఆధారంగానే వారికి ఓటరు గుర్తింపు కార్డులు జారీ చేశామని, ఇటీవలి నెలల్లో ఈ చిరునామాలపై కొత్తగా ఒక్క ఓటు నమోదు కాలేదని, బీఆర్ఎస్ నేతలు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని తేలిందన్నారు.

ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లాలి

(మొదటిపేజీ తరువాయి)

బీసీలకు రిజర్వేషన్ కల్పించే విషయంలో మద్దతు ఇచ్చి ఇప్పుడు గవర్నర్ వద్ద పెండింగ్‌లో పెట్టిచ్చి అడ్డుకుంటున్నారని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే విషయంలో సీపీఐ పోరాడుతుందని, హైకోర్టు కేసులో ఇంప్లీడ్ అయిందని కూనంనేని అన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటా : ఎర్రబెల్లి

విశాలాంధ్ర తొర్రూర్ : వివిధ కారణాల చేత మృతి చెందిన మృతుల కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం జిల్లాలోని తొర్రూర్ మున్సిపాలిటీ 14వ వార్డుకు చెందిన తొర్రూరు పట్టణ పార్టీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ రామగిరి నవీన్‌తల్లి , అలాగే శ్రీరామ ప్రింటర్స్ యజమాని రాము మాతృమూర్తి వేమిశెట్టి భాగ్యలక్ష్మి , బయన వెంకట రామ నరసయ్య ,ఆరో వార్డు కి చెందిన మంగళ పెల్లి బాలాజీ తండ్రి మంగళపెల్లి కిష్టయ్య, మంగళంపల్లి ప్రసాద్ ,యాకయ్య, రవిల తండ్రి మంగళంపల్లి చిన్న వీరయ్య, రెండో వార్డుకు చెందిన లెక్కల సత్తెమ్మ ఇటీవల పరమపదించగా మంగళవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారిని అన్ని విధాలుగా అండగా ఉంటానని మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో 14 వ వార్డు మాజీ కౌన్సిలర్ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, తొరుర్ మండల మాజీ ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, మాజీ జెడ్పిటిసి మంగళంపల్లి శ్రీనివాస్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నలమాస ప్రమోద్, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, పట్టణ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమాండ్ల ప్రదీప్ రెడ్డి, కాలూ నాయక్ ధరావత్ జై సింగ్, కర్నే నాగరాజు,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నలమాస ప్రమోద్, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు రాయిశెట్టి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యంవున్న అభ్యర్థిని ప్రతిపాదించాలి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్: కాంగ్రెస్ పార్టీనీ మరింత బలోపేతం చేయగల సామర్థ్యం ఉన్న అభ్యర్థిని ప్రతిపాదించాలని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. డిసిసి అధ్యక్షుడి ఎన్నిక కోసం అధిష్టానం చేపట్టిన సంఘటన్ సృజన్ అభియాన్ - తెలంగాణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పార్టీని సంస్థగత పునర్నిర్మాణంలో భాగంగా నూతన డీసీసీ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియను పార్టీ ప్రారంభించిందని పేర్కొన్నారు. పార్టీనీ మరింత బలోపేతం చేయగల సామర్థ్యం ఉన్న అభ్యర్థిని ప్రతిపాదించాలన్నారు. ఈ సందర్భంగా అబ్జర్వర్లు మీడియా సమక్షంలో డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తు ఫారమ్‌ను విడుదల చేశారు. ఆతర్వాత అబ్జర్వర్లు స్థానిక నాయకులతో ముఖాముఖిగా చర్చించి, డీసీసీ అధ్యక్ష పదవికి ఆసక్తి గల అభ్యర్థుల అభిప్రాయాలు, సూచనలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ అబ్జర్వర్ దేబాసిస్ పట్నాయక్,టీపీసీసీ ప్రధాన అబ్జర్వర్ మరియు షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్, స్థానిక మహబూబాబాద్ శాసనసభ్యులు డా మురళి నాయక్ , జిల్లా భరత్ చంద్రా రెడ్డి,టీపీసీసీ ప్రతినిధులు ఎం.డి. అవేజ్,ఇందిరా రావు, మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, తదితర నాయకులు, పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: ధాన్యం సేకరణలో అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు తప్పవని కలెక్టర్ రాహుల్ రాజ్ హెచ్చరించారు. రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. జిల్లాలో 498 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామని, అందులో 430 వరి కొనుగోలు కేంద్రాలు ఇప్పటికే మొదలయ్యాయన్నారు. 10 కేంద్రాలకు వరి ధాన్యం రావడం మొదలైందన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని, బాగా ఆరబెట్టిన, శుభ్రపర్చిన ధాన్యం మిల్లులకు పంపాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మఇండ్లను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ధాన్యం సేకరణకు కంట్రోల్ రూంను కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. ధాన్యం సేకరణకు ఏదైనా సమస్యలు, అవసరాలు, సూచన ఉన్నట్లయితే కంట్రోల్ రూమ్ నెంబర్ 9281103685 ను సంప్రదించవచ్చని తెలిపారు. అదనపు కలెక్టర్ నగేష్, నిత్యానందం, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం తీసుకురండి: కలెక్టర్

విశాలాంధ్ర-నల్లగొండ బ్యూరో : రైతులు నాణ్యతా ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి సహకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. మంగళవారం ఆమె కనగల్ మండలం, దోరేపల్లి లో ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.దోరేపల్లి కొనుగోలు కేంద్రానికి పెద్ద మొత్తంలో ధాన్యం వచ్చేందుకు అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రానికి విశాలమైన స్థలాన్ని చూడాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు వారి కళ్ళంలోనే ధాన్యాన్ని ఆరబెట్టి ఎలాంటి తాలు, తరుగు లేకుండా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, తద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని కోరారు.రైతులు అకాల వర్షాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వర్ష సూచన ఉన్నందున ప్రతిరోజు ధాన్యంపై టార్పాలిన్‌లు కప్పి ఉంచాలని తెలిపారు. తగినంత తేమశాతం వచ్చిన తర్వాతనే ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్వాహకులు ప్రతిరోజు తేమ శాతం వివరాలను రిజిస్టర్లో నమోదు చేయాలని ఆదేశించారు. సీరియల్ నెంబర్ ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని, తేమ ఎక్కువగా లేకుండా ధాన్యాన్ని కొనాలని నిర్వాహకులకు సూచించారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి ,ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశం, తహసిల్దార్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు : కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : కొత్తగూడెం నియోజకవర్గ రహదారుల అభివృద్ధి కోసం రూ. 10.62 కోట్లు మంజూరైనట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. గత నిధులతో ముఖ్య రహదారులు, అంతర్గత రోడ్లు ప్రజలకు అందుబాటులోకి రాగా మరికొన్ని రహదారులు నిర్మాణ దశల్లో వున్నాయన్నారు. నియోజకవర్గంలోని పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో ఈ నిధులతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం జరగనుందని చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామీణ రాధారుల నిర్మాణంపై ప్రేత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. గడిచిన ఇరవై నెలల కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో యనబైశాతం మేర రోడ్ల నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. తాజాగా విడుదలైన రూ.10.62కోట్లతో మిగిలిన పనులు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామన్నారు. త్వరలో శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కూనంనేని తెలిపారు.

గర్భస్థ శిశు హత్యలపై కూపి లాగుతున్న అధికారులు

Visalandhra EFFECT విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : కొందరు డాక్టర్లు ఖమ్మం నగరంలో గర్భస్థ శిశు హత్యలకు వెనకాడడం లేదని అంశంపై మంగళవారం విశాలాంధ్రలో 'ఆగని భ్రూణ హత్యలు' అనే శీర్షికతో ప్రచురితమైన ప్రత్యేక కథనం నగరంలో కలకలం రేపింది. నగరంలో ప్రముఖ వైద్యులు ఐఎంఏ నాయకులకు ఒక వైద్యురాలు, ఇంకా మరి కొందరు వైద్యులు ఫోన్లు చేసి విశాలాంధ్రలో వచ్చిన కథనంపై చర్చించారు. అదేవిధంగా విశాలాంధ్ర కథనంలో పేర్కొన్న అంశాల ఆధారంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గర్భస్థ శిశు హత్యలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా డబ్బు కోసం అక్రమంగా సిజరిన్ చేసి లేదా వేరే పద్ధతుల్లో కడుపులోని పిండాన్ని తీసేయడం వంటివి కొందరు డాక్టర్లు నగరంలో చేస్తున్నారనే ప్రచారం బలంగా జరుగుతుంది. అయితే అటువంటివి చేసే సమయంలో అధికారులకు, చట్టానికి దొరకకుండా కడుపులో పిండాన్ని తీసి వేయించుకునే తల్లిదండ్రుల నుంచి లెటర్ రాయించుకోవడం, వీడియో తీసుకోవడం వంటివి చేస్తున్న సదరు దురా శ పరు లైన ఆసుపత్రుల వారు ఎవరొచ్చినా తమకు భయం లేదులే అనే భావనతో ఉంటున్నారు. అయితే విశాలాంధ్ర కథనం అటువంటి వారిలో అలజడి పుట్టించింది. తప్పు జరిగిన చోట తప్పించుకోవడానికి అన్ని ఆధారాలు పెట్టుకున్నప్పటికీ , ఎక్కడో ఒకచోట ఇన్వెస్టిగేషన్ చేసే వారికి జరిగిన తప్పు తెలిసిపోక మానదు. వెంటనే కాకపోయినా ,కొంత సమయం తరువాతనైనా జరిగిన తప్పులు బయటపడతాయి. ఇప్పటికే లింగ నిర్ధారణ చేసే కొందరిపై నిఘా వేసి పట్టుకున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు. పత్రికల్లో మీడియా కాధనాల్లో వచ్చే అంశాల ఆధారంగా గుట్టు చప్పుడు కాకుండా నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారిని గుర్తించేందుకు నిఘా విభాగం తన పని తాను చేస్తూనే ఉంటుంది. యుహాత్మకంగా తప్పు తెలియకుండా రక్షణ కవచాలుగా వీడియోలు తల్లితండ్రుల నుండి లెటర్లు రాయించుకున్నప్పటికీ ఏదో ఒక సందర్భంలో నిజాలు నెగ్గు తేలకుండా ఉండటం కష్టం.

జిల్లా అధ్యక్షుడి ఎంపికపై అభిప్రాయ సేకరణ

విశాలాంధ్ర - ఖమ్మం : ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుని (డీసీసీ) ఎంపిక ప్రక్రియ వేగం పుంజుకుంది. ఏఐసీసీ ఆదేశాల మేరకు, పీసీసీ సూచనల ప్రకారం మంగళవారం అభిప్రాయ సేకరణ సమావేశాలు నిర్వహించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ... జిల్లాలో అందరికీ ఆమోదయోగ్యమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఈ సమావేశాలు చురుగ్గా సాగాయి. ఉదయం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డిపల్లిలో ఉన్న అమ్మ ఫంక్షన్ హాల్లో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ, తిరుమలాయపాలెం మండలాల బ్లాక్ కాంగ్రెస్ నాయకులతో ప్రత్యేక సమావేశం జరిగింది. పార్టీ భవిష్యత్ దిశ, క్రమశిక్షణ, నాయకత్వం అవసరాలపై నాయకులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. మధ్యాహ్నం కూసుమంచి మండల కేంద్రంలోని ఎస్.ఆర్. ఫంక్షన్ హాల్లో నేలకొండపల్లి, కూసుమంచి మండలాలకు చెందిన బ్లాక్ కాంగ్రెస్ ముఖ్య నాయకులతో మరో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఏఐసీసీ అబ్జర్వర్ మహేంద్రనీ, పీసీసీ అబ్జర్వర్లు పాల్గొని నాయకులతో సమీక్షించారు. ఈ సమావేశాల్లో ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్య విధానమే అంతిమ లక్ష్యం

విశాలాంధ్ర - కొత్తగూడెం : 1936 ఆగస్టు 12 న ఉత్తరప్రదేశ్లోని లక్నో లోని బెనారస్ విశ్వవిద్యాలయం పొత్తిళ్ళలో పిడికిలి బిగించి దేశ స్వతంత్రం కోసం ఆనాడు విద్యార్థుల్ని, యువకుల్ని ఏకం చేసి త్యాగలర్పించిన అఖిల భారత విద్యార్థి సమాఖ్యకు (ఏఐఎస్ఎఫ్) 90 ఏళ్ళు పూర్తి చేసుకున్న నేపథ్యముందని అసంఘం జిల్లా కార్యదర్శి వరకు అజిత్ అన్నారు. ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన ఇలాంటి సంఘంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. శాస్త్రీయ విద్యా విధానమే అంతిమ లక్ష్యంగా పోరాడుతున్న ఏఐఎస్ఎఫ్ విద్య వ్యాపారీకరణను వ్యతిరేకిస్తుందన్నారు. మంగళవారం అజిత్ ఆధ్వర్యంలో సభ్యత నమోదు కార్యక్రమలో భాగంగా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులతోపాటు సమాజ స్థితిగతులను గమనిస్తూ విద్యా విధానాలు లోపాలపై దేశ భవిష్యత్తు కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చదువు కునే ప్రతి వక్క విద్యార్థి ఏఐఎస్ఎఫ్ సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాల పై విద్యార్థులు సంఘటితం కావాలన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా నాయకులు గుండాల సుజన్, మాణిక్యాల వినయ్, కళ్యాణి, నవిత, వందన పాల్గొన్నారు.

సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్‌ను కలిసిన ప్రవీణ్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సింగరేణి సంస్థ డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రును తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిసారు. మంగళవారం కొత్తగూడెంలోని డైరెక్టర్ కార్యాలయంలో పాను కలిసి పూలగుచ్చం అందించారు. ఈ సందర్భంగా రేణిగుంట్ల ప్రవీణ్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రవీణ్ మాట్లాడుతూ సింగరేణిలో ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన సమస్యలపై ఈనెల 23, 24 ,25న మూడు రోజులు ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు కలిసి రీజినల్ వైజ్‌గా సింగరేణిలో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆ మీటింగ్‌కు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం అందించనున్నట్లు తెలిపారు. డైరెక్టర్ ను కలిసిన వారిలో సింగరేణి కాలరీసు ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రెటరీ అంతోటి నాగేశ్వరరావు, ట్రెజరర్ జిమ్మిడి మల్లేష్, నాయకులు బందెల విజేందర్ తదితరులు ఉన్నారు.

ప్రైవేటుకు ధీటుగా విద్యా బోధన : కలెక్టర్

విశాలాంధ్ర,బ్యూరో,నిర్మల్ జిల్లా : జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రైవేటు బడులకు ధీటుగా నాణ్యమైన విద్యాబోధన అందుతోందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం నర్సాపూర్ (జి) మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పాఠశాల పరిస్థితులను పరిశీలించారు. తరగతి గదులను పరిశీలిస్తూ విద్యార్థులతో ముఖాముఖీ మాట్లాడారు. విద్యార్థులు యూనిఫాం, నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు అందుకున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఉపాధ్యాయుల దృష్టికి తేవాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటివరకు పూర్తయిన సిలబస్‌పై సమీక్ష చేశారు. సామాన్య శాస్త్ర పాఠానికి సంబంధించిన పటాలను బోర్డుపై గీయించి, విద్యార్థుల అవగాహన స్థాయిని అంచనా వేశారు. బోర్డు పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. పరీక్షలపై భయపడకుండా స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. పదవ తరగతి ప్రతి విద్యార్థి జీవితంలో కీలక మలుపని, క్రమశిక్షణతో కష్టపడి చదివితే ఉన్నత స్థానాలను సాధించవచ్చు అని కలెక్టర్ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. విద్యార్థుల హాజరు శాతం, సిలబస్ పురోగతి, బోధన నాణ్యతపై వివరాలు కలెక్టర్ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు ఉపాధ్యాయులు, విద్యార్థులు పూర్తి హాజరు నమోదు కావాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక ప్రణాళికలతో వారిని మెరుగుపరచాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో నేర్చుకునేలా చూడాలని అన్నారు. సిలబస్‌ను నిర్ణీత సమయంలో పూర్తి చేయడంతో పాటు, పునరావృత పరీక్షల ద్వారా విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కేజీబీవీ విద్యార్థిని ప్లక్ష స్వయంగా వేసిన కలెక్టర్ చిత్రపటాన్ని అందించగా, ఆమె ప్రతిభను కలెక్టర్ అభినందించారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి డి. భోజన్న, మండల ప్రత్యేక అధికారి అంజి ప్రసాద్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ పుష్పలత, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.2.96 కోట్లతో కళాశాల మరమ్మతులు

విశాలాంధ్ర కారేపల్లి : ఖమ్మం జిల్లాలోని 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు కోట్ల 96 లక్షల రూపాయల వ్యయంతో చిన్నమధ్య తరహా మరమ్మతు పనులను చేపడు తున్నట్లు జిల్లా ఇంటర్మీడి యట్ విద్యాశాఖ అధికారి(డీఐఈఓ)కె.రవిబాబు తెలిపారు. మంగళవారం సింగరేణి మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్(ఫేస్ రికగ్నైజ్ సైన్) ద్వారా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల హాజరు శాతం గతం కంటే పెరిగిందన్నారు. అదేవిధంగా హెచ్ఆర్ఎంఎస్,సీసీ కెమెరాలను అమర్చడం ద్వారా కళాశాల సిబ్బంది విధి నిర్వహణ పనితీరును రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యాశాఖ సంచాలకులు కంట్రోల్ రూమ్ లో పర్యవేక్షించడం జరుగుతుందన్నారు.ప్రతి కళాశాలలో సైన్స్ గ్రూప్ విద్యార్థులకు ఎంసెట్ కోచింగ్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా ఖాన్ అకాడమీ ద్వారా ఇంటర్మీడియట్ పూర్తి చేసిన తర్వాత విద్యార్థులు పైచదువులను ఏ విధంగా ఎంచుకుంటే ఏం లాభం చేకూర్తుందనే అంశంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతి శనివారం క్రీడలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులకు చదువుతోపాటు అదనపు యాక్టివిటీస్‌ను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా కళాశాల భవనాలలో నెలకొన్న వివిధ రకాల మరమ్మత్తు పనులను చేపడుతున్నట్లు వెల్లడించారు. అంతకుముందు కళాశాలలో జరుగుతున్న మరమ్మత్తు పనులను పరిశీలించారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపల్ ఎస్ విజయకుమారి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ జయమ్మ, అధ్యాపక సిబ్బంది వున్నారు.

ఆరుగురు మావోయిస్టుల లొంగుబాటు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : దాదాపు ఏడాది కాలంగా మావోయిస్టు పార్టీ నాయకులు, దళ సభ్యుల లొంగుబాట్ల పరంపర కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా ఏడాది కాలం నుంచి జిల్లా పోలీసుల ఎదుట వందలాదిమంది మావోయిస్టులు లొంగిపోవడం గమనార్హం. మంగళవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎదుట మావోయిస్టు సభ్యులు ఆరుగురు లొంగిపోయారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ వివరాలను వెల్లడించారు. జిల్లా పోలీసులు 81, 141 సిఆర్పిఎఫ్ టెబాలియన్ అధికారులు ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కొరకు నిర్వహిస్తున్న 'ఆపరేషన్ చేయూతో' మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. లొంగిపోయిన సభ్యులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ కల్పిస్తున్న సదుపాయల గురించి ఆకర్షితులై చాలామంది లొంగిపోతున్నట్లు చెప్పారు. మంగళవారం లొంగిపోయిన వారిలో పార్టీ సభ్యులు ముగ్గురు కాగా ఇద్దరు మిలీశియా, ఒకరు సి ఎన్ యం ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన 6 గురు మావోయిస్టులకు ఒక్కొక్కరికి రూ 25 వేల చొప్పున 1,50,000 అందించినట్లు ఎస్పీ వెల్లడించారు. తరువాత వారి ర్యాంకుల అనుగుణంగా మరింత ఆర్థిక సహాయం చేయనున్నట్లు తెలిపారు.

పోలీస్ అధికారులకు ప్రతిభ పురష్కారాలు

విశాలాంధ్ర ఖమ్మం క్రైమ్ : 2024 -25 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం మరియు నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీసు సేవా పతకాలలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అందించిన అత్యుత్తమ సేవలకు గాను పలువురు పోలీస్ సిబ్బందికి పతకాలు లభించాయి. పతకాలు పొందిన వారిలో అడిషనల్ డీసీపీ ప్రసాద్ రావు, టౌన్ ఏసీపీ రమణమూర్తి, సిసిఆర్బీ ఏసీపీ సాంబరాజుతో పాటు పోలీస్ సిబ్బంది వున్నారు. మహోన్నత సేవ పతకం (01) ఉత్తమ సేవ పతకం (05) సేవ పతకం (64) ఉత్కృష్ట పతకాలు (12) సాధించారు. ఈ నేపథ్యంలో మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా 82 మంది పోలీస్ సిబ్బందికి పతకాలు అందజేసి అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏ ఆర్ ఏసీపీ నర్సయ్య, ఆర్ఐ కామరాజు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడు అరెస్టు

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: మెదక్ జిల్లాలో సంచలనం సృష్టించిన మహిళ హత్య కేసును పోలీసులు చేదించారు. గతంలో హత్యలు, దొంగతనాలు చేసిన నేరస్తుడే ఈ హత్య చేసినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిందితుడిని అరెస్టు చేసినట్లు వివరాలు వెల్లడించారు. ఈనెల 10న మెదక్ జిల్లా కొల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మూడో బ్రిడ్జి సమీపంలో వెంచర్ వద్ద అత్యాచారం చేసి బండరాయితో గాయపడిన గిరిజన మహిళను 11న గుర్తించి 100కు సమాచారం ఇవ్వగా కుల్చారం పోలీసులు మెదక్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయింది. నిందితుని ఆచూకీ కోసం ఎస్పీ శ్రీనివాసరావు ఇద్దరు డిఎస్పీలు, ముగ్గురు సీఐలు, ఏడుగురు ఎస్ఐలతో పాటు సిసిఎస్ బృందం, ఐడి పార్టీతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీ పుటేజ్ ఆధారంగా నిందితుడిని గుర్తింవి చర్చి వద్ద పట్టుకున్నారు. నిందితుడు సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం ఆంబోజీగూడ తండాకు చెందిన మెగావత్ ఫకీరా నాయక్‌గా గుర్తించారు. విచారించగా బట్టలు విప్పేసి చీర, లంగాతో కట్టేసి మాన భంగం చేసి రాయితో తలపై బలంగా కొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. ఆమె ఒంటిపై ఉన్న ముక్కు పుడక దోచుకొని పారిపోయాడు. కేసును చేదించిన ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సీఐ జార్జీ, కృష్ణమూర్తి, ఎస్ఐ అహ్మద్ మోహియుద్దీన్, సిబ్బందికి ప్రశంసా పత్రాలు, నగదు అవార్డులు ఎస్పీ అందజేశారు. నిందితుడు ఫాకీరా నాయక్ గతంలో ఓ మహిళను పరిచయం చేసుకొని రెప్ చేసి చంపాడు. అల్లాదుర్గంలో 4, పాపన్నపేట, మెదక్ టౌన్, మెదక్ రూరల్ పీఎస్‌లో ఒక్కో కేసు ఉంది. రెండు రోజుల క్రితం ఓ కేసులో జీవిత ఖైదు, రూ.15 వేల జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

వలస ఆదివాసీలపై అధికారుల దాడులు ఆపాలని ధర్నా

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: ములుగు జిల్లాలో వున్న వలస ఆదివాసి గ్రామాలపై ఫారెస్ట్ అధికారుల దాడులు ఆపాలని, దాడులకు పాల్పడిన అధికారులపై ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేయాలని కోరుతూ, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఐటీడీఏ ముందు ధర్నా నిర్వహించి, డిడి, ఏటకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జెజ్జరీ దామోదర్, ములుగు జిల్లా అధ్యక్షులు దుర్గి చిరంజీవి మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి వలస ఆదివాసి గ్రామాలపై ఫారెస్ట్ అధికారులు గత రెండు నెలల నుంచి దాడులు చేస్తూ వారి ఇళ్ళను కూల్చివేసి వారిపై భౌతికంగా దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. మంగపేట మండలం శాంతినగర్ గ్రామంలో రెండుసార్లు వారి ఇళ్ళను కూల్చివేసి, దాడికి పాల్పడంతో మనస్థాపానికి చెందిన సోయం సురేష్ అనే గ్రామస్తుడు పురుగుల మందు సేవించి ఆత్మ హత్యాయత్యానికి పాల్పడినట్లు తెలిపారు. అదేవిధంగా ఏటూరునాగారం, కన్నాయిగూడెం మంగపేట, తాడ్వాయి మండలాల్లో పలు గ్రామాల్లో సాగులో ఉన్నటువంటి పోడు భూములలో ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంగా కందకాలు త్రవ్వుతున్నారని, వెంటనే ఫారెస్ట్ అధికారులు వలస ఆదివాసి గ్రామాలపై దాడులు ఆపాలని, సాగులో వున్న భూములలో కందకాలు తవ్వడం నిలిపివేయాలని, ఆదివాసులపై దాడులకు పాల్పడిన అరెస్టు అధికారులపై ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు పూనం నగేష్ కుర్సం చిరంజీవి, ఊకే ప్రభాకర్,కోరం చిరంజీవి, తోలం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో: జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్, సంక్షేమ వసతి విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతి సబ్జెక్టులో కనీసం 70 శాతం మార్కులు సాధించాలన్న లక్ష్యంతో సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు.మంగళవారం సూర్యాపేటలోని కలెక్టర్ కార్యాలయంలో ఆయన సంక్షేమ, విద్యాశాఖ, కేజీబీవీ అధికారులతో సమావేశం నిర్వహించారు.తదుపరి ఆయన మాట్లాడుతూ, రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలలో ఎప్పుడైనా ఆకస్మిక తనిఖీలు జరుగుతాయని, ఆ సమయంలో సిబ్బంది విధుల్లో లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది సమయానికి విధులకు హాజరవుతూ, హాజరు వివరాలు, విద్యార్థుల హాజరు వివరాలు ప్రతి రోజు సమర్పించాలని ఆదేశించారు. పాఠశాలలకు గుడ్లు, పాలు, చికెన్, వంట సామాగ్రి సమయానికి చేరాయా లేదా అధికారులు తనిఖీ చేయాలని, విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించాలని కలెక్టర్ చెప్పారు. విద్యార్థులకు మంచి సౌకర్యాలు, నాణ్యమైన భోజనం అందించడంతో పాటు వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి ఫలితాలు సాధించేలా సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ అన్నారు.ఈ సమావేశంలో ఎస్‌టీ, ఎస్‌సీ, బీసీ, మైనార్టీ సంక్షేమ అధికారులు శంకర్, దయానంద రాణి, నరసింహారావు, శ్రీనివాస్ నాయక్, డీఈఓ అశోక్, జిసిడిఓ పూలన్, టీజీఈడబ్ల్యూఐడిసిఈ రమేష్, డిసిఓలు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణాపై చర్యలు

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా సంబంధిత శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని టి.జి.ఎం.డి.సి. మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల ప్రాజెక్టు అధికారి పి.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక మాఫియా కొనసాగుతుందని, అధికారులు నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తున్నారని సామాజిక మాధ్యమాలలో వస్తున్న అవాస్తవ కథనాలలో ఎలాంటి నిజం లేదని తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో ఇసుక అక్రమ రవాణా జరగకుండా విస్తృత తనిఖీలు చేపట్టడంతో పాటు సరిహద్దుల వద్ద ప్రత్యేక నిఘా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం సామాజిక మాధ్యమాలలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇసుక రవాణా పారదర్శకంగా లబ్ధిదారులకు అందుతుందని, ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. అసంబద్ధమైన, అవాస్తవ ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని తెలిపారు.

42% బీసీ రిజర్వేషన్ల అమలుకు పోరాడాలి: రమేష్

విశాలాంధ్ర-వనపర్తి : రాష్ట్రంలో 42% బీసీ రిజర్వేషన్లు మనకు బీసీ సంఘాలు మద్దతుదారులు పోరాడాలని సీపీఐ పట్టణ కార్యదర్శి జే రమేష్ కోరారు. వనపర్తి సీపీఐ ఆఫీసులో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జనాభాను లెక్కించి దాని ప్రకారమే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ జీవో తెచ్చారని దాన్ని కొట్టివేయటం బాధాకరమన్నారు. సిపిఐ బీసీలకు 42% రిజర్వేషన్కు మద్దతు ఇస్తూ కోర్టు కేసులో ఇంప్లీడ్ అయిందని బిజెపి, టీఆర్ఎస్ ఎందుకు ఇంప్లీడ్ కాలేదని ప్రశ్నించారు. బిజెపి అసెంబ్లీ చేసిన 42% రిజర్వేషన్ బిల్లును ఆమోదించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. టిఆర్ఎస్ కూడా బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పనిచేస్తుందన్నారు. బిజెపి బీఆర్ఎస్ పెదవులపై బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలుపుతూ లోపల అమలు కాకుండా కుట్రలు చేస్తున్నాయన్నారు. రేపు బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్రవ్యాప్తంగా 42 శాతం రిజర్వేషన్లకు మద్దతుగా కోర్ట్ స్టేట్ వ్యతిరేకంగా జిల్లా మండల కేంద్రాల్లో ఆందోళనలు చేపడుతుందన్నారు. వనపర్తి లో జరిగే ఆందోళనకు సిపిఐ మద్దతు ఇచ్చి పాల్గొంటుందన్నారు. పార్టీలకతీతంగా జిల్లాలో బీసీ సంఘాలు మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పట్టణ నేతలు చిన్న కుర్మయ్య జయమ్మ వంశీ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

శాంతి కపోతం పయనమెటు?

రెండేళ్లుగా అగ్నిగుండమై మండిన పశ్చిమాసియాలో శాంతి కపోతం ఎగిరింది. చరిత్రాత్మక గజా శాంతి ఒప్పందంపై ప్రపంచ నేతలు సంతకాలు చేసి, గజాకు ఊపిరిపోశారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తోపాటు ఈజిప్టు, ఖతార్, టర్కీ దేశాల అధినేతలు సైతం సంతకాలు చేసి నవోదయానికి తెరతీశారు. ప్రపంచ రాజకీయ పరిణామాల్లో ఇది గొప్పదే. కాదనలేని సత్యం. ట్రంప్ ఒకడుగు ముందుకేసి మూడో ప్రపంచ యుద్ధం ఇక జరగబోదని, పవిత్రభూమిలో సూర్యుడు ఉదయించాడని, బీబీ (ఇజ్రాయిల్ అధ్యక్షుడు నెతన్యాహు ముద్దుపేరు) చొరవ అద్భుతమంటూ పలికిన గంటన్నర శాంతి ప్రవచనం ఇంకా గొప్పది. వినేవాడు ఎర్రినాగన్న అయితే ఎన్నయినా చెప్పొచ్చని ట్రంప్ చేసి చూపించారు. అతని నటనాచాతుర్యానికి నోబెల్ పురస్కారమేమోగానీ, ఆస్కార్ అవార్డు మాత్రం ఇచ్చి తీరాల్సిందే. హమాస్ బందీలుగా ఉన్న 20 మందిని అప్పగించేయడం, ఇస్రాయెల్ హింసోన్మాదంలో ఇరుక్కుపోయిన 1900 మంది పలస్తీనా ఖైదీలను విడిచిపెట్టేయడం శుభసూచకమే. ఇంత జరిగినా, ఎన్నో సందేహాల తెరలమాటున రాజకీయ కుట్రలు నీడల మాదిరిగా తారాడుతున్నాయి. అందుకే ఈ శాంతి కపోతం పయనం ఎటువైపు? ఎంతదూరం? అనేది ఒకింత అనుమానమే. ఈ శాంతి ఒప్పందం ఎన్నో ప్రశ్నలకు సమాధానాలివ్వలేకపోయింది. మధ్యవర్తిత్వం నడిపిన ఖతార్, ఈజిప్టులను ప్రశంసించాల్సి వచ్చినప్పటికీ, సంతకాల కార్యక్రమానికి నెతన్యాహు గైర్హాజరుకావడంతో ఈ ఒప్పందం వెనుక ఆయనకు సంపూర్ణ అంగీకారం ఉందని చెప్పడం కష్టమే అవుతుంది. పలస్తీనా అథారిటీ (పీఏ) అధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్, టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్, ఇతర ముస్లిం నాయకులు హాజరైనందువల్లనే నెతన్యాహు ఎగ్గొట్టారని ఆరోపణలు విన్పిస్తున్నాయి. యూదు సెలవు దినం కారణంగానే రాలేకపోయినట్లు చెపుతున్న మాట సాకు మాత్రమే. విశ్వశాంతి పేరిట కన్పిస్తున్న విషపు నవ్వుల వెనుక ఇంకెన్ని ఆయిలు ఒప్పందాలు, ఆయుధ ఒడంబడికలు ఉన్నాయోనన్న అనుమానం రాకతప్పదు. ఇస్రాయెల్–హమాస్ యుద్ధం 2023 అక్టోబర్ 7 నుంచి కొనసాగుతున్నది. పలస్తీనియన్లలో భారీ ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగింది. ఈ యుద్ధం ఆరంభమైనప్పటి నుంచి 2025 అక్టోబర్ 3 వరకు, గజాలో 67,000 మందికి పైగా పలస్తీనియన్లు మరణించినట్లు గజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ నివేదికలు, ఇతర అంచనాలు సూచిస్తున్నాయి. గాయపడిన వారి సంఖ్య 1,69,000 పైగా ఉన్నట్లు నివేదిక. మరణించిన వారిలో ఎక్కువ మంది పౌరులే ఉన్నారు. ముఖ్యంగా పిల్లలు, మహిళలు అధిక సంఖ్యలో ఉన్నారని నివేదికలు చెబుతున్నాయి. శిథిలాల కింద నేటికీ వేలాది మృతదేహాలు ఉన్నాయని, వాస్తవ మరణాల సంఖ్య మరింత ఎక్కువగా ఉండవచ్చని అంచనా. గజా స్ట్రిప్‌లో జరిగిన నష్టం మాటలకందనిది. గజాలోని 70% కి పైగా నివాస భవనాలు పూర్తిగా లేదా పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ఆసుపత్రులు, పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, నీటిపారుదల వ్యవస్థలు, ఇతర కీలక మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 94% ఆసుపత్రులు నేలమట్టమయ్యాయి. రెండేళ్లుగా ఏ ఒక్క పౌరునికీ చికిత్స చేయడానికి ఒక ఇంజక్షన్ గానీ, ఒక మాత్ర గానీ దొరకలేదంటే గజాపై ఇస్రాయెల్ మారణహోమం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. 87% పాఠశాలలు, అన్ని విశ్వవిద్యాలయాలు ధ్వంసమయ్యాయి. ఈ ప్రాంతంలో చదువు అనే శబ్దమే లేకుండా పోయింది. 23 లక్షల మంది జనాభా ఉన్న గజాలో ఎక్కువ మంది నిరాశ్రయులయ్యారు. ఆహారం, నీరు, మందులు అందక తీవ్రమైన ఆకలి సంక్షోభం, అంటువ్యాధులు వ్యాప్తి చెందాయి. పోషకాహార లోపం కారణంగా కూడా వందలాది మంది మరణించారు. అతిపెద్ద మానవతా సంక్షోభానికి ఇది నిలువుటద్దం. గజా పునర్నిర్మాణం ఏనాటికి జరిగేను? ఈ విధ్వంసకాండలో అసలు నేరస్థులు డోనాల్డ్ ట్రంప్, నెతన్యాహూలే. శిథిలాల కింద నలిగిపోయిన కళేబరాలను చూస్తూ వీరిద్దరు చేసిన వికటాట్టహాసాన్ని సగటు గజా పౌరుడు మర్చిపోలేడు.

ఇస్రాయెల్ పార్లమెంటులో ట్రంప్ ప్రసంగిస్తుండగా వామపక్ష సభ్యులు అడ్డుకొని నిరసన తెలపడం ఒకింత పెద్దన్నకు దిగ్భ్రాంతి కలిగించింది. వామపక్ష హడాష్ పార్టీ ఎంపీలు ఊఫర్ కాసిఫ్, ఐమన్ ఒడే ప్రభృతులు 'మారణహోమం చేసి, శాంతివచనాలు చెపుతారా?' 'పలస్తీనాను గుర్తించాల్సిందే' అంటూ నినాదాలు చేయడంతో కంగుతిన్న ట్రంప్ తన ప్రసంగాన్ని ఆపేయక తప్పలేదు. చివరకు పార్లమెంటు భద్రతా సిబ్బంది వామపక్ష సభ్యులను బయటకు గెంటివేశారు. న్యాయం కోసం చేసిన వారి నివేదన అరణ్యరోదనే. పలస్తీనా స్వతంత్ర దేశంగా ఆవిర్భవించినప్పుడే అసలుసిసలు శాంతి నెలకొన్నట్లు అవుతుందన్న వారి వాదనలో తప్పేముంది? ఈ ప్రాంతంలో నిజమైన శాంతి, అభివృద్ధి సుసాధ్యం కావాలంటే, రక్తసిక్త నెతన్యాహు ప్రభుత్వం మట్టి కరవాల్సిందే, అమెరికా ఆయుధ ఆధిపత్యాన్ని తరిమికొట్టాల్సిందే. ఇస్రాయెల్, హమాస్ పరస్పరం బందీలను విడుదల చేసే క్రమంలో ఇస్రాయెల్ జైలులో అన్నపానాలు లేక మగ్గిపోయిన పలస్తీనా ఖైదీలు చిక్కిశల్యమై దర్శనమివ్వగా, హమాస్ వద్ద బందీలుగా ఉన్న 20 మంది ఇస్రాయెల్ ఖైదీలు మరింత కండపుష్టితో అగుపించడం విచిత్రం. ఇస్రాయెల్ దాష్టీకానికి పలస్తీనా పౌరులు ఏ స్థాయిలో బలయ్యారో ఈ దృశ్యాలు కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి. ఓవైపు శాంతి బావుటాలు ఎగురుతుండగా, మరోవైపు, జైల్లో ఉన్న తమ వారి విడుదల కోసం ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లోని ఓఫర్ జైలు సమీపంలో ఎదురుచూస్తున్న పలస్తీనా బంధువులు, పాత్రికేయులపై ఇస్రాయెల్ దళాలు విరుచుకుపడిన తీరు జుగుప్సాకరం. ఇవన్నీ చూస్తుంటే, శాశ్వత శాంతికి ట్రంప్ సూచించిన 20 సూత్రాల ప్యాకేజీని ఎవరైనా నమ్ముతారా? పలస్తీనా స్వతంత్ర దేశంగా అవతరిస్తేనే అసలైన శాంతి సందేశాన్ని ప్రపంచానికి పంపించినట్లు అవుతుంది. పలస్తీనా ప్రజలకు దురాక్రమణ, అణిచివేత, సామ్రాజ్యవాద ఆధిపత్యం నుంచి విముక్తి కలిగినప్పుడే నిజమైన ఉపశమనం. పశ్చిమాసియా సంక్షోభానికి శాశ్వత పరిష్కారం లభించాలంటే, ఈ ప్రాంతం నుంచి అమెరికా ప్రేరేపిత ఇస్రాయెల్ దళాలు తక్షణమే ఉపసంహరించుకోవాలి. 1967 నాటి సరిహద్దులతో జెరూసలెం రాజధానిగా పలస్తీనా దేశాన్ని గుర్తించాలి. పలస్తీనాకు అంతర్జాతీయ సమాజం అండగా నిలవాలి, సహాయం అందించాలి. పలస్తీనా కమ్యూనిస్టుపార్టీ ఆకాంక్ష కూడా అదే!

అనుకోని అసమానత!

వివాహం సహజం, అనివార్యం. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు కష్టసాధ్యం. లింగ అసమానత ఊహించనిరీతిలో పెరిగిపోవడమే దీనికి ప్రధాన కారణం. జననాల రేటు తీవ్రంగా క్షీణిస్తుండగా, మరణాల రేటు కాస్త పెరుగుతున్నదని సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ రిపోర్ట్–2023 చెపుతున్నది. ఈ నివేదికను ఈ మధ్యనే విడుదల చేశారు. జనన లింగ నిష్పత్తి (ఎస్ఆర్‌బీ) అనే సూచీ ఒకటుంటుంది. జనాభాలో ఆడ, మగ మధ్య నిష్పత్తికి ఇది కొలబద్ధ. పెళ్లిళ్ల వ్యవస్థపై ఇది కచ్చితంగా ప్రభావం చూపుతుంది. ఈ నిష్పత్తి ఒకానొక సమయాల్లో పురుషులు, మహిళల మధ్య హక్కుల యుద్ధానికి కూడా దారితీస్తుంది. ఉదాహరణకు, 2023 వ సంవత్సరంలో అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రతి 1000 మంది మగాళ్లకు 1,085 మంది మహిళలు జన్మించారు. అంటే వీరి మధ్య వివాహాలు జరిగితే, ఇంకా 85 మంది మహిళలు అవివాహితులుగానే మిగిలిపోతారన్నమాట! అదే ఏడాది, నాగాలాండ్‌లో ప్రతి 1000 మంది పురుషులకు 1,007 మంది మహిళలు, గోవాలో 973 మంది మహిళలు, త్రిపురలో 972, లదాఖ్‌లో 972 మంది మహిళలు ఉండగా, గుజరాత్‌లో ప్రతి వెయ్యిమంది పురుషులకు 910 మంది మహిళలు, మహారాష్ట్రలో 909, తెలంగాణలో 906, బీహార్‌లో 900, జార్ఖండ్‌లో 899 మంది మహిళలు ఉన్నారు. తెలుగురాష్ట్రాల విషయంలో ఆంధ్రప్రదేశ్‌లో ఈ నిష్పత్తి పెద్దగా ప్రభావం చూపకపోయినా, తెలంగాణలో మాత్రం పెళ్లి చేసుకుందామంటే అమ్మాయిలు దొరకడం లేదన్న వాదన ఉంది. అది నిజమే. తెలంగాణలో ప్రతి వెయ్యి మంది మగాళ్లకు 906 మంది మహిళల మేరకు మాత్రమే లింగ నిష్పత్తి ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి 1,000 మంది బాలురకు 938 మంది బాలికలు జన్మించారు. భ్రూణహత్యలు జరుగుతున్నందునే, 'ఆడపుట్టుక'పై అలసత్వం పెరిగిపోయిం దని స్పష్టంగా తెలుస్తోంది. తెలంగాణలో గర్భస్థ శిశు హత్యలు అధికమవుతు న్నాయన్న వాదనకు ఇది అద్దం పడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఒక సామాజికవర్గం రెండు మూడు దశాబ్దాల క్రితం ఆడశిశు జననంపై నిరాసక్తత ప్రదర్శించినట్లు ఆరోపణలు వచ్చాయి. అది నిజం కావచ్చు, కాకపోవచ్చు. కానీ అదే సామాజికవర్గం గత కొన్ని

సంవత్సరాలుగా తమ కులానికి చెందిన ఆడపిల్లల కొరత కారణంగా ఇతర కులాలకు చెందిన ఆడపిల్లలను వివాహం చేసుకునే పనిలో పడింది. ఈ మధ్యకాలంలో కులాంతర వివాహాలు అనివార్యంగా మారుతున్నాయి. బహుశా దశాబ్దాల క్రితం నాటి పాపాలు ఇప్పుడు వెంటాడుతూ ఉండవచ్చు. తెలంగాణలోనూ రెండు సామాజిక వర్గాలకు ఇదే పరిస్థితి ఎదురవుతున్నది.

సామాజిక వర్గాలను పక్కనబెడితే, సహజంగానే ఆడపిల్లల జననం తగ్గడం ఈ సమాజంలో ఒక ప్రమాదకర హేతువు. శిశు హక్కుల హననం భయానక రీతిలో జరుగుతుందనడానికి ఇదొక నిదర్శనం. ఆడ–మగ తేడాను పక్కనబెడితే, ఈ రోజుల్లో అసలు పిల్లలే పుట్టడం అతికష్టంగా మారిపో యింది. మారిన వాతావరణ పరిస్థితులు, మనిషి తినే తిండి, జీవనశైలి కారణంగా జననాల రేటు తగ్గుతూ వస్తోంది. పిల్లలు పుట్టని దంపతుల సంఖ్య పెరిగిపోతున్నది. వీరంతా ఫెర్టిలిటీ సెంటర్లపై ఆధారపడాల్సి వస్తున్నది. అందువల్లనే గల్లీకొక ఫెర్టిలిటీ సెంటర్ పుట్టుకొస్తున్నది. జననాల రేటు తగ్గుతూ ఉండగా, మరణాల రేటు పెరుగుతూ వస్తోంది. 2022 లో దేశంలో మరణాలు 86.5 లక్షలు ఉండగా, 2023 లో 86.6 లక్షలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల జనన, మరణాల రేట్ల విషయానికొస్తే, తెలంగాణలో జాతీయ సగటుతో పోలిస్తే జననాల రేటు తక్కువగా ఉంది. 2020 లో ప్రతి 1,000 మంది జనాభాకు సుమారు 16.4 జననాలు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ కంటే కాస్త తక్కువగా ఉంది. 2020లో ప్రతి 1,000 మంది జనాభాకు సుమారు 15.7 జననాలు నమోదయ్యాయి. చారిత్రక పోకడను పరిశీలిస్తే, 2014 నుంచి తెలంగాణలో జననాల రేటు ఎక్కువగా, ఆంధ్రప్రదేశ్‌లో మరణాల రేటు అధికంగా నమోదవుతున్నట్లు 2020 నమూనా రిజిస్ట్రేషన్ లెక్కలు సూచిస్తున్నాయి. ఏపీలో జాతీయ సగటుతో పోలిస్తే మరణాల రేటు ఎక్కువగా ఉంది. 2020 లో ప్రతి 1,000 మంది జనాభాకు సుమారు 6.3 మరణాలు నమోదయ్యాయి. తెలంగాణలో ఆంధ్రప్రదేశ్ కంటే కాస్త తక్కువగా ఉంది. 2020లో ప్రతి 1,000 మంది జనాభాకు సుమారు 6.0 మరణాలు నమోదయ్యాయి. 2023 నివేదిక ప్రకారం శిశు మరణాల రేటు పెరుగుతోంది. అంటే ప్రతి 1,000 సజీవ జననాలకు ఒక సంవత్సరం లోపు చనిపోయే శిశువుల సంఖ్య తెలంగాణలో 18 (జాతీయ సగటు 25 కంటే తక్కువ), ఆంధ్రప్రదేశ్‌లో 19 (జాతీయ సగటు 25 కంటే తక్కువ) ఉంది. ఈ వివరాలు అధికారిక నివేదికలైన నమూనా రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్), ఎకనామిక్ సర్వే ఆధారంగా ఇచ్చినవే. ఏపీలో ఒక్క శ్రీకాకుళం జిల్లాలో మాత్రమే పురుషుల కన్నా ఆడపిల్లల జననాల సంఖ్య ఎక్కువగా ఉంది. మిగిలిన జిల్లాల్లో అటుఇటుగా ప్రతికూల గణాంకాలే కన్పిస్తున్నాయి.

ఆడపిల్లల జననాల సంఖ్య తగ్గుముఖం పట్టడం ఒక సామాజిక సవాల్‌గా పరిణమించబోతున్నది. లింగ వివక్ష కారణంగానే ఈ పరిణామం సంభవించిందనేది స్పష్టం. 2022లో 2.32 కోట్ల జననాలు నమోదుకాగా, 2023లో 2.52 కోట్ల జననాలు నమోదయ్యాయి. మరణాలతో పోలిస్తే, ఈ పెరుగుదల పెద్ద తేడా కాదని సీఆర్ఎస్ రిపోర్ట్ చెపుతోంది. కరోనా కారణంగా, 2020లో 81.2 లక్షలు, 2021లో 102.2 లక్షల మంది మరణించారు. కొవిడ్ తర్వాత మరణాల సంఖ్య పెరుగుతూనే ఉంది. జననాల సంఖ్య ప్రభావం పెద్దగా కన్పించడం లేదు. ఇది మానవ వనరుల సంక్షోభానికి దారితీయవచ్చని భావిస్తున్నారు. దేశంలో పురుషుల సంఖ్య పెరుగుతూ వస్తే, అతి తీవ్ర అసమతుల్యతకు దారితీస్తుంది. ఇది ఇంకొక ప్రమాదకర ధోరణి. ఇది అనుకోని అసమానతగా భావిస్తున్నా, ఇందులో మానవ తప్పిదమే ఉన్నట్లు సామాజిక విశ్లేషకులు చెపుతున్నారు. వివక్షత లేని ప్రపంచం కావాలంటే, గర్భస్థ శిశు మరణాల సంఖ్య తగ్గాలి. అది జరగాలంటే, లింగ సమానత్వంపై అవగాహన పెరగాలి. లేకుంటే, సామాజిక సంక్షోభం తప్పదు!

కుల మతాల బలానికి ఆర్ఎస్ఎస్ కంకణం


డి.రాజా
సీపీఐ ప్రధాన కార్యదర్శి

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ), రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) 1925 లో స్థాపించారు.. సీపీఐ కాన్పూర్‌లో, ఆర్ఎస్ఎస్ నాగ్‌పూర్‌లో ఆవిర్భవించాయి. కానీ, ఉద్దేశం, సిద్ధాంతం, చారిత్రక పాత్ర విషయంలో రెండూ భిన్నమైనవి. సీపీఐ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం నుంచి ఉద్భవించి, భారతదేశ కార్మిక వర్గం, రైతాంగం, కుల,మతాలకు అతీతంగా సామ్రాజ్యవాదానికి, అణచివేతకు వ్యతిరేకంగా చైతన్యం పొందింది. ఇది స్వాతంత్ర్యోద్యమంలో సహజ భాగస్వామిగా ఉంటూ కేవలం రాజకీయ స్వాతంత్ర్యమే కాకుండా సామాజిక, ఆర్థిక పరివర్తనను డిమాండ్ చేసింది. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు కేబీ హెగ్డేవార్, తరువాత దాని సిద్ధాంతకర్త ఎంఎస్ గోల్వాల్కర్ స్వాతంత్ర్యోద్యమాన్ని 'రాజకీయ' పరమైనదని కొట్టిపారేశారు. దానికి బదులుగా మతపరమైన ప్రత్యేకత, కఠినమైన సామాజిక నిచ్చెనమెట్లతో కూడిన జాతిని నిర్మించడంపై దృష్టి సారించారు. అదే సమయంలో కమ్యూనిస్టులు స్వాతంత్ర్యం కోసం ప్రజలను సమీకరించడంతో పాటు, ఆ మహత్తర పోరాటంలో అనేక మంది జైలు పాలవడం, అమరులవడం జరిగింది. ఆర్ఎస్ఎస్ మాత్రం రహస్యంగా డ్రిల్స్ నిర్వహిస్తూ, కుల వ్యత్యాసా లను బలోపేతం చేయడం, వలసవాద పరిపాలన యంత్రాంగానికి విధేయతను చాటడంలో నిమగ్నమైంది.

1930 లలో కార్మిక సమ్మెలు మొదలు తెలంగాణ, తెభాగ పోరాటాలు వరకు, పున్నప్ర వాయలార్ తిరుగుబాటు నుంచి 1940 లలో విద్యార్థి ఉద్యమాల వరకు సీపీఐ శ్రేణులు ప్రధాన జాతీయ ఉద్యమాలలో భాగస్వాములు అయ్యాయి. కేవలం అధికార బదలాయింపునకే పరిమితం కాకుండా, దోపిడీ, అసమానతల నిర్మూలన కోసం పోరాడాయి.

మరోవైపు ఆర్ఎస్ఎస్ దేశ విమోచనకు సంబంధించిన ప్రతి కీలక సమయంలో కనిపించక పోవడమే కాకుండా, బహుళత్వ, ప్రజాస్వామిక భారతదేశం అనే భావన పట్ల తిరస్కార భావంతో ఉండేది. అదేకాకుండా, భారతదేశ వైవిధ్యాన్ని బలంగా కాకుండా బలహీనతగా సంఘ్ చూసేది. మతపరమైన అస్తిత్వం పట్ల దాని వ్యామోహం విభజించి, పాలించు అనే వలసవాద వ్యూహానికి అనుకూలించింది. అంతేకాకుండా ఆధునికత, సమానత్వం, సామాజిక న్యాయం భావనలు తమకు ప్రమాదమనే ఉన్నత కులాల ఆందోళనలను, సామాజిక మార్పు పట్ల దాని భయాన్ని ప్రతిబింబించింది.

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగం, దాని చారిత్రక పునరావిష్కరణపై జరిగిన కసరత్తును సూచిస్తుంది. ఆయన ఆర్ఎస్ఎస్‌కు 'దేశభక్తి, సేవ' ఘనతను కట్టబెడుతూ, స్వయం సేవకులు విభజన సమయంలో కాందీశీకులకు నిర్విరామంగా సేవ చేశారని చెప్పారు. వాస్తవమేమిటంటే, 1940 ప్రాంతంలో ప్రత్యేకించి పంజాబ్, జమ్మూలలో విభజన మంటలను రాజేసిన కారణాలలో ఆర్ఎస్ఎస్ ప్రచారం, విద్వేష సిద్ధాంతాలు కూడా ఉన్నాయి. ఆ సంస్థ సాహిత్యం, ఉపన్యాసాలు ముస్లింలను దేశద్రోహులుగా వర్ణించాయి. అవి అనుమానస్పద, ప్రతీకార వాతావరణాన్ని సృష్టించాయి. ఉపఖండంలో అతి పెద్ద విషాదాలలో ఒకటైన మతపరమైన సమీకరణలో దాని పాత్రను కప్పిపుచ్చడంలో భాగంగానే మానవ సేవ అనే కొత్తముఖం తొడిగారు. చైనా యుద్ధంలో చేసిన సేవలకు గుర్తింపుగా 1963 లో జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు ఆర్ఎస్ఎస్‌ను జవహర్‌లాల్ నెహ్రూ ఆహ్వానించారనే మరో దీర్ఘకాలిక అబద్ధపు ప్రచారాన్ని మోదీ పునశ్చరణ చేశారు. నిజానికి 1963 పరేడ్‌లో ఎంపీలు, పాఠశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, కార్మిక సంఘాలను కూడా భాగస్వామ్యం చేశారు. అందులో భాగంగా ఆర్ఎస్ఎస్ అనుబంధ భారతీయ మజ్దూర్ సంఘ్ పరేడ్‌లో పాల్గొన్న సందర్భంలో వారితో ఆర్ఎస్ఎస్ శ్రేణులు అందులో పాల్గొనే అవకాశం ఉంది. అంతే తప్ప ఆర్ఎస్ఎస్‌ను 'ఆహ్వానించలేదు'. శతవత్సర ప్రసంగంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సైతం ఇదే పద్ధతిని అనుసరించి అర్ధసత్యాలను చెప్పారు. ఆయన 'స్వదేశీ', 'స్వీయ ప్రకాశం', 'ఐక్యత' గురించి మాట్లాడారు. కానీ, ఐక్యత పట్ల ఆయన దృష్టికోణం వెలివేయడంపై నిర్మితమైంది. ఇదే భగవత్ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన వర్గాల రిజర్వేషన్‌లపై సమీక్ష జరగాలని అన్నారు. జాతీయ ఐక్యత గురించి మాట్లాడే ఆర్ఎస్ఎస్ కులాలు, స్త్రీ, పురుషుల మధ్య, ఆధిపత్య శక్తులు అధికారం లేని వారి మధ్య నిచ్చెనమెట్ల వ్యవస్థకు బలమైన మద్దతుదారు. దాని మహిళా విభాగం రాష్ట్రీయ సేవికా సమితి సైతం పురుషాధిక్య సంస్థ పితృత్వ నేతృత్వంలో కొనసాగుతుంది. ఆర్ఎస్ఎస్ ఉద్దేశంలో 'ఐక్యత' అంటే ప్రతి ఒక్కరూ అగ్రకులాల హిందూ పురుష ఆధికత్యను అంగీకరించడమే. సామరస్యం, సేవకోసం ఆర్ఎస్ఎస్ పని చేసిందనే భగవత్ ఉద్ఘాటన, దాని సొంత పత్రాల ముందే నిలవలేకపోయింది. సంఘ్ మూల గ్రంథాలలో ఒకటైన గోల్వాల్కర్ రచించిన 'బంచ్ ఆఫ్ థాట్స్' లో ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులను దేశంలో మూడు అంతర్గత శతృవులుగా గుర్తించారు. ఈ వైఖరి నుంచి ఆర్ఎస్ఎస్ ఎన్నడూ వైదొలగలేదు. తన పునాదులను బలోపేతం చేసుకునేందుకు 'అంతర్గత శతృవుల'ను గుర్తించడాన్ని అది కొనసాగిస్తూనే ఉంది. స్వదేశీ, జాతీయవాదం అనే భగవత్ పిలుపు డొల్లతనాన్ని వినిపిస్తున్నది. అది మార్గదర్శనం చేస్తున్న ప్రభుత్వ ఆర్థిక విధానాలు జాతీయ సంపదను కార్పొరేట్ గుత్తాధిపతులకు అప్పగించడం ద్వారా చిన్న పరిశ్రమలు, వ్యవసాయాన్ని డొల్లగా మార్చేసింది. సంఘ్ చెబుతున్న 'స్వీయ ప్రకాశం' అనే భావన ఆశ్రిత పెట్టుబడిదారి విధానానికి మోకరిల్లడంగా మార్చేసింది. దాని 'సాంస్కృతిక జాతీయవాదాన్ని' మతతత్వ ధృవీకరణగా ఆవిష్కరించింది.

వందేళ్లుగా ఆర్ఎస్ఎస్ ధైర్యంతో కాకుండా రాజీపడి మనుగడ సాగిస్తున్నది. స్వాతంత్ర్యోద్యమ సమయంలో బ్రిటీష్‌తో ఘర్షణ పడకుండా తప్పించుకుంది. గాంధీ హత్యానంతరం దానిపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయించుకునేందుకు కాంగ్రెస్‌లోని కొన్ని వర్గాలతో కుమ్మక్కైంది. ఎమర్జెన్సీ సమయంలో ఇదే పద్ధతిని మరోసారి అనుకరించింది. తమ సంస్థపై నిషేధాన్ని తొలగిస్తే సహకరిస్తామని కోరుతూ ప్రభుత్వానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ బాబా సాహెబ్ దేవరస్ ఉత్తరం రాశారు.

కమ్యూనిస్టులు అందుకు భిన్నంగా కార్మికుల హక్కుల కోసం, భూ సంస్కరణల కోసం, విద్య, ఆరోగ్యభద్రత కోసం, ఆధునిక భారతదేశంగా తీర్చిదిద్దడంలో బ్యాంకులు, బొగ్గు జాతీయకరణ వంటి ప్రగతిశీల చట్టం కోసం, కౌలు సంస్కరణలు, కార్మిక రక్షణలు, ప్రజా ఆరోగ్య చర్యల కోసం పోరాటాలు చేశారు. సీపీఐ, ఇతర వామపక్ష శక్తులు గణతంత్రం అనే వివేచనతో లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయంపై అన్ని రకాల దాడులకు వ్యతిరేకంగా నిలబడుతూ పరిరక్షిస్తున్నాయి. అన్ని యుద్ధాలలో, ముఖ్యంగా 1971 లో బంగ్లాదేశ్ విమోచనకు భారతదేశం సహకరించిన సమయంలో అవి దేశం పక్షాన నిలిచాయి. రాజాభరణాల రద్దు, సమాఖ్యవాదం వేళ్లూనుకోవటం, ప్రజాస్వామిక హక్కుల విస్తరణ కోసం కమ్యూనిస్టులు అండగా నిలిచారు. పంజాబ్, ఈశాన్యంలో వేర్పాటువాద శక్తులపై పోరాడడమే కాకుండా, ఖలిస్థాన్ ఉగ్రవాదం చేతుల్లో 300 మంది కామ్రేడ్‌లను కోల్పోయారు. దేశంలో మత సామరస్యాన్ని కాపాడేందుక స్థిరమైన కృషి చేస్తున్నారు. మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్ సమర్థించిన సమానత్వ ఆదర్శాలపట్ల ఆర్ఎస్ఎస్ వ్యతిరేక వైఖరి కలిగి ఉంది. ఆర్ఎస్ఎస్ శత వార్షికోత్సవం సందర్భంగా మోదీ, భగవత్ ఉపన్యాసాలు వందేళ్ల సేవలను ప్రతిబింబించకపోగా, చరిత్రను పునర్లిఖించటం, విభజన, మోసంపై కొనసాగుతున్న సిద్ధాంతానికి ఆమోదయోగ్యత కల్పించే ప్రయత్నాలు కనిపించాయి. వందేళ్ల కాలంలో ఎవరు జాతి అంతరాత్మ కోసం నిజంగా సేవ చేశారు, ఎవరు దానిని విభజించారు అనే కాకుండా న్యాయం పేరుతో ఎవరు దానిని ఐక్యంగా ఉంచారనేది స్పష్టమైంది.

> వందేళ్లుగా ఆర్ఎస్ఎస్ ధైర్యంతో కాకుండా రాజీపడి మనుగడ సాగిస్తున్నది. స్వాతంత్ర్యోద్యమ సమయంలో బ్రిటీష్‌తో ఘర్షణ పడకుండా తప్పించుకుంది. గాంధీ హత్యానంతరం దానిపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయించుకునేందుకు కాంగ్రెస్‌లోని కొన్ని వర్గాలతో కుమ్మక్కైంది. ఎమర్జెన్సీ సమయంలో ఇదే పద్ధతిని మరోసారి అనుకరించింది. తమ సంస్థపై నిషేధాన్ని తొలగిస్తే సహకరిస్తామని కోరుతూ ప్రభుత్వానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ బాబా సాహెబ్ దేవరస్ ఉత్తరం రాశారు. కమ్యూనిస్టులు అందుకు భిన్నంగా కార్మికుల హక్కుల కోసం, భూ సంస్కరణల కోసం, విద్య, ఆరోగ్యభద్రత కోసం, ఆధునిక భారతదేశంగా తీర్చిదిద్దడంలో బ్యాంకులు, బొగ్గు జాతీయకరణ వంటి ప్రగతిశీల చట్టం కోసం, కౌలు సంస్కరణలు, కార్మిక రక్షణలు, ప్రజా ఆరోగ్య చర్యల కోసం పోరాటాలు చేశారు.

దశాబ్దికి కళ్లు తెరిచిన మోదీ

డా॥జ్ఞాన్‌పాఠక్

నేపాల్, బంగ్లాదేశ్ తదితర దేశాలలో నిరుద్యోగంతో తల్లడిల్లుతున్న యువకులు, విద్యార్థులు తిరుగుబాటు చేసి ప్రభుత్వాలను సైతం దించివేసిన ఘటనలు భారతదేశంపై సైతం తీవ్ర ప్రభావం చూపించాయి. మన పాలక ద్వయం నరేంద్రమోదీ, అమిత్‌షా కూడా ఆందోళనకు గురయ్యారు. ఆర్ఎస్ఎస్– బీజేపీ నాయకులు, ప్రధాని నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలన తర్వాత నిరుద్యోగ సమస్య వైపు దృష్టి సారించ తలపెట్టారు. జాతీయ కార్మిక, ఉద్యోగ విధానం "శ్రమ శక్తి నీతి 2025" పథకం ముసాయిదాని రూపొందించడానికి నిర్ణయించారు. నిరుద్యోగులు, ఈ సమస్యకు సంబంధించినవారు, ఆయా సంస్థలు, ప్రజలు తమ అభిప్రాయాలు తెలిపేందుకు గాను ముసాయిదా విధానాన్ని కేంద్ర కార్మిక, ఉద్యోగ మంత్రిత్వశాఖ తన వెబ్‌సైట్లలో ఉంచింది. తమ సూచనలు 2025 అక్టోబరు 27 వ తేదీలోపు పంపాలని మంత్రిత్వ శాఖ కోరింది. 2014లో అధికారం చేపట్టడానికి ముందు ఎన్నికల ప్రచారంలో సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తానని, నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తానని వాగ్దానం చేసిన మోదీ నేటి వరకు నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించనే లేదు. అనేక కేంద్ర ట్రేడ్ యూనియన్లు, ఉద్యోగ సంఘాలు ఈ ముసాయిదాను తీవ్రంగా విమర్శించాయి. కేంద్ర ప్రభుత్వ వాస్తవ ఉద్దేశాన్ని ట్రేడ్ యూనియన్లు శంకిస్తున్నాయి. అయితే తాము చాలా ట్రేడ్ యూనియన్లతోనూ, సంస్థలతోను సంబంధిత వర్గాలతోను లోతుగా చర్చించామని ఇందుకు రుజువులు కూడా ఉన్నాయని కార్మిక మంత్రిత్వ శాఖ చెబుతోంది. తమతో మాట్లాడినట్టుగా చెప్పడం శుద్ధ అబద్ధమని ట్రేడ్ యూనియన్లు స్పష్టం చేశాయి. ప్రభుత్వం ఉన్నత స్థాయి త్రైపాక్షిక సంస్థ (ఐఎల్‌సి) కార్మిక విధానంపై దేశంలో సదస్సు జరపవలసి ఉంది. అనంతరమే ముసాయిదా ఉద్యోగ విధానాన్ని రూపొందించాలి.

ముసాయిదా విధానం దీర్ఘకాలిక ఫ్రేమ్ వర్క్‌ని రూపొందిస్తున్నట్టు కేంద్ర మంత్రిత్వ శాఖ తెలిపింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమలు సామాజిక భాగస్వాముల సమన్వయ కార్యాచరణ ఉంటుందని తెలియజేసింది. ఈ విధానం వల్ల కలిగే ప్రయోజనాలు విస్తృతంగా, సమగ్రంగా చర్చిస్తామని ఆ శాఖ తెలిపింది. కేంద్ర మంత్రిత్వ శాఖ, ఉద్యోగ డైరెక్టర్ జనరల్ (డీజీఈ), నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) సంస్థల వెబ్‌సైట్‌లలో కార్మిక ముసాయిదా విధానాన్ని ఉంచినట్లు మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఈ విధానంలో అనేక మార్పులు చేయాలని వీటి ప్రకారం మార్పులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని విమర్శకులు కోరారు.

కేంద్ర ప్రభుత్వం "క్రమబద్ధ సదుపాయం కల్పించే బాధ్యత తీసుకుని రాష్ట్ర ప్రభుత్వాలకు, మార్కెట్ శక్తులకు సమాచారం పంపాలని విశ్లేషకులు సూచించారు. కార్మికుల విధులు, కార్మికుల హక్కుల నుంచి, కార్మిక చట్టాలలో ముసాయిదా విధానం కోరుకుంటుందని విశ్లేషకులు విమర్శిస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ విధానంపై ఉద్యమం జరిగే అవకాశం ఉంది. కార్మిక సమస్యలపైన ఐఎల్‌సీ 45వ సెషన్ 2013 మే 17-18 తేదీలలో జరిగింది. ఈ సదస్సులో నిరుద్యోగ సమస్యను చర్చించారు. అనంతరం కార్మిక ప్రతినిధులు, యజమానులు, సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య చర్చ జరిగాయి. నిరుద్యోగం, ఉద్యోగాల కల్పన అవకాశాలను పెంపొందించడానికి చర్యలు తీసుకొనే కమిటీ కొన్ని సిఫారసులు చేసింది. జాతీయ ఉద్యోగ విధానానికి ప్రాధాన్యత నిచ్చి తుది రూపమివ్వాలి. 2014 ఎన్నికల ప్రచారంలో ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని వాగ్దానం చేసిన సమయంలో నిరుద్యోగం 4.7 శాతం ఉంది.

ఆనాటి నుంచి కార్మిక మార్కెట్‌లోకి అత్యధిక నిరుద్యోగులు వచ్చారు. మోదీ ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టిన తర్వాత 2 కోట్ల ఉద్యోగాల కల్పన వాగ్దానాన్ని ఇప్పటి వరకు మరిచిపోయారు. ఐఎల్‌సి 45 వ సదస్సు 2015 లో జరిగింది. ఇందులోనూ జాతీయ ఉద్యోగ విధానం (ఎన్ఈపీ) గురించి మరొకసారి ప్రస్తావనకు వచ్చింది. 2017-18 నాటికి 45 సంవత్సరాలలో ఏనాడు లేని గరిష్ట స్థాయికి నిరుద్యోగం 6.1 శాతానికి చేరింది. ఇందుకు సంబంధించి ఎన్ఎస్ఎస్ఓ ఈ రిపోర్టును అణచివేసింది. అయితే ఈ సంస్థ అధిపతి, ఇతర అధికారులు పదవీ విరమణ చేసే దశలో ఈ విషయం లీక్ అయింది. అయినప్పటికీ 2019 ఎన్నికల్లో మోదీ నాయకత్వంలోని బీజేపీ గెలిచింది. అనంతరమే నిరుద్యోగరేటు నివేదికను అధికారికంగా విడుదల చేశారు.

అనంతరం మోదీ నాలుగు వివాదాస్పదమైన కార్మిక కోడ్లను తీసుకువచ్చారు. అవి- 2019 లో వేతన కోడ్, పారిశ్రామిక సంబంధాల కోడ్–2020, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్–2020, సామాజిక భద్రత కోడ్ 2020 రూపొందించారు. జాతీయ ట్రేడ్ యూనియన్లు వీటిని వ్యతిరేకిస్తూ అనేక సార్లు సమ్మెలు, ఆందోళనలు చేసినప్పటికీ కొన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి. ఐఎల్‌సీతో కనీసం చర్చించకుండా దేశానికి జాతీయ ఉద్యోగ విధానం తయారు చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది. 2015 తర్వాత ఐఎల్‌సి సెషన్‌ను ప్రభుత్వం ఇంతవరకు నిర్వహించలేదు. జాతీయ ఉద్యోగ విధానం ముసాయిదాను 2022 లేదా 2023 పార్లమెంటు బడ్జెట్ సెషన్‌లోగాని తీసుకొచ్చే అవకాశం ఉందని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ 2021లో మీడియాతో మాట్లాడుతూ తెలియజేసింది. అయినప్పటికీ మోదీ ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదు. 2022 వర్షాకాల సమావేశాల్లో ఎంపీ బీశెట్టి వెంకటసత్యవతి లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో అడిగిన ప్రశ్నకు జాతీయ ఉద్యోగ విధానాన్ని రూపొందించేందుకు కమిటీ ఏమీలేదని, అసలు అలాంటి ఆలోచనే లేదని సంబంధిత మంత్రిత్వ శాఖ తెలియజేసింది. సత్యవతి అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్మికశాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి ఇలా చెప్పారు. "ప్రస్తుతం ఎన్ఈపీ ముసాయిదాను రూపొందించేందుకు కమిటీ లేదని అన్నారు. అయితే డిమాండ్, సరఫరాపైన సర్వేలను నిర్వహిస్తుందని వెల్లడించారు. 2025 అక్టోబరు 8 వ తేదీన కార్మిక మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేసే పీఐబీ ఒక ప్రకటనలో జాతీయ కార్మిక ఉద్యోగ విధానం- శ్రమశక్తి నీతి 2025 ను ప్రజలతో సంప్రదించేందుకు విడుదల చేసింది." అతి ముఖ్యమైన నిరుద్యోగ సమస్యపై విశాలంగా లోతుగా చర్చించకుండానే ముసాయిదాను రూపొందించిన నేపథ్యంలో భవిష్యత్తులో యువత, ఉన్నత విద్యావంతులు ఆందోళన చేసే అవకాశం లేకపోలేదు.

71 మంది అభ్యర్థులతో బీజేపీ తొలి జాబితా

పట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో ప్రధాన పార్టీలు తమ అభ్యర్థుల జాబితాలను విడుదల చేస్తున్నాయి. ఎన్డీఏ కూటమి నుంచి బీజేపీ 71 మంది అభ్యర్థులతో తొలి జాబితాను మంగళవారం విడుదల చేసింది. ఈ జాబితాలో ఉప ముఖ్యమంత్రులు సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా పేర్లు న్నాయి. ఎన్డీయే కూటమిలో భాగంగా 101 స్థానాల్లో బీజేపీ ఈసారి పోటీ చేస్తున్న సంగతి విదితమే. తారాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సామ్రాట్ చౌదరి, లఖిసరాయ్ నుంచి విజయ్ సిన్హా పోటీ చేయనున్నారు. లఖిసరాయ్ నియోజకవర్గానికి నాలుగుసార్లు విజయ్ సిన్హా ప్రాతినిధ్యం వహించారు. 2005, 2010, 2015, 2020లో ఆయన వరుసగా గెలుస్తూ వచ్చారు. కాగా, టికెట్లు దక్కిన ఇతర ప్రముఖుల్లో మాజీ ఉప ముఖ్యమంత్రి రేణు దేవి (బెట్టియా), తారాకిషోర్ ప్రసాద్ (కతిహార్), మంగళ్ పాండే (సివన్), నితీశ్ మిశ్రా (ఝూన్ఝార్పూర్), నీరజ్ కుమార్ సింగ్ బబ్లూ (చతర్పూర్), విజయ్ కుమార్ మండల్ (సిక్తి), సంజయ్ సరావుగి (దర్భంగా), రాణా రణ్‌ధీర్ సింగ్ (మధుబన్)స సునీల్ కుమార్ పింటు (సీతామర్హి), నితిన్ నబిన్ (బంకీపూర్), డాక్టర్ ప్రేమ్ కుమార్ (గయ టౌన్), సిద్ధార్థ్ సౌరవ్ (బిక్రం) ఉన్నారు. రేణుదేవితో పాటు 8 మంది మహిళా అభ్యరులకు కూడా టిక్కెట్లు దక్కాయి. శ్రేయాసి సింగ్ (జముయి), అరుణా దేవి (వర్సాలిగంజ్), రామ నిషద్ (ఔరైయ), నిషా సింగ్ (ప్రాణ్‌పూర్), కవిత దేవి (కొర్హా), స్వీటీ సింగ్ (కృష్ణ గంజ్), దేవాంతి యాదవ్ (నర్పట్‌గంజ్), గాయత్రి దేవి (పరిహార్) ఉన్నారు. బీహార్ అసెంబ్లీ స్పీకర్ నంద్ కిషోర్ యాదవ్‌కు ఈ సారి టికెట్ దక్కలేదు. 2024 లోకసభ ఎన్నికల్లో పాటలీపుత్ర నియోజకవర్గం నుంచి ఓటమి చవిచూసిన కేంద్ర మాజీ మంత్రి రామ్ కృపాల్ యాదవ్‌కు దానాపూర్ నుంచి టికెట్ లభించింది.

'ఇండియా' సీట్ల సర్దుబాటు కొలిక్కి?

- ఆర్జేడీ-144, కాంగ్రెస్-70 స్థానాల్లో పోటీ
- సీఎం అభ్యర్థిత్వంపై వ్యూహాత్మక మౌనం
- జాతీయ మీడియాలో కథనాలు

న్యూఢిల్లీ: బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఇండియా ఐక్య సంఘటన భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సర్దుబాటు కొలిక్కివచ్చినట్లు వార్తలొస్తున్నాయి. సీట్ల విషయంలో కాంగ్రెస్ కోసం రాష్ట్రీయ జనతా దళ్(ఆర్జేడీ) కాస్త దిగొచ్చినట్లు సమాచారం. కాంగ్రెస్ కోరుకున్న సీట్లకు కేటాయించడంతో ప్రతిపక్ష కూటమిలో సీట్ల కేటాయింపు సస్పెన్స్‌కు దాదాపుగా తెర పడినట్లేనని జాతీయ మీడియా ఛానెల్స్ కథనాలు పేర్కొంటున్నాయి. మొత్తం 243 స్థానాలకుగానూ... ఆర్జేడీ 144 స్థానాలకు పోటీ చేయాలని తొలుత భావించింది. అయితే సర్దుబాటు నేపథ్యంలో ఇప్పుడు 135 స్థానాలకు పోటీ చేయాలని నిర్ణయించుకుంది. అలాగే కాంగ్రెస్ పార్టీ తొలుత 61 స్థానాలను కేటాయిస్తారనే ప్రచారం జరగ్గా... ఇప్పుడు 70 స్థానాల్లో పోటీకి ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. కూటమిలో భాగమైన ముకేశ్ సాహ్నీ వికాస్‌షీల్ ఇన్‌సాన్ పార్టీ(వీఐపీ) కి 16, వామపక్ష కూటమికి 29-31 స్థానాలు కేటాయించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇక ముఖ్యమంత్రి అభ్యర్థిత్వంపై కాంగ్రెస్ వ్యూహాత్మక మౌనం పాటిస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. అయితే మిత్రపక్షాలు మాత్రం ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ అని బహిరంగంగా చెప్పేశాయి. మరోవైపు డిప్యూటీ సీఎం పదవికి సంబంధించిన అంశమేదీ చర్చకు రాలేదని సమాచారం. అంతకు ముందు సీట్ల పంపకంపై కాంగ్రెస్, ఆర్జేడీ మధ్య తీవ్ర చర్చలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ గెలుపు అవకాశాలు ఉన్నాయంటూ 70 స్థానాలు తమకు కేటాయించాలంటూ డిమాండ్ చేస్తూ వచ్చింది. ఒకవైపు రాహుల్ గాంధీ సమక్షంలోనే తాను సీఎం అభ్యర్థినంటూ తేజస్వి యాదవ్ ప్రకటించినా... సీట్ల డిమాండ్‌ను నేరవేర్చుకునేందుకే కాంగ్రెస్ ఆ అంశంపై మౌనంగా ఉంటూ వచ్చింది. ఇంకోవైపు ఇండియా ఐక్యసంఘటనలో సీట్ల పంపకాన్ని ఇరకున పడేసే పరిణామాలు చోటు చేసుకున్నాయి. జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) , ఐపీ గుప్తా నేతృత్వంలోని ఇండియన్ ఇంక్లూజివ్ పార్టీ (ఐఐపీ) వచ్చి చేరడంతో ఎనిమిది పార్టీలకు ఈ కూటమి విస్తరించింది. అదే సమయంలో వీఐపీ పార్టీ అధినేత ముకేశ్ సాహ్ని... 50 స్థానాలు, ఉపముఖ్యమంత్రి డిమాండ్ చేయడంతో సీట్ల పంపకంలో జాప్యం జరిగింది. చివరకు 16 సీట్లకు సాహ్ని ఒప్పుకోగా... ఆర్జేడీ తన కోటా నుంచి జేఎంఎంకు, కాంగ్రెస్ తన కోటా నుంచి ఐఐపీకి స్థానాలు కేటాయించేందుకు అంగీకరించడంతో.. సీట్ల సర్దుబాటు కొలిక్కి వచ్చినట్లయింది.

అర్ధరాత్రి ఎల్లో కవర్ల హైడ్రామా

బీహార్ రాజకీయాల్లో సోమవారం అర్ధరాత్రి జరిగిన పరిణామాలు హైడ్రామాను తలపించాయి. సోమవారం దిల్లీలో ఐఆర్‌సీటీసీ కేసు కోర్టు విచారణ అనంతరం ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబంతో సహా పట్నాకు చేరుకున్నారు. కాసేపటికే ఆర్జేడీ శ్రేణులకు అధిష్టానం నుంచి ఫోన్ కాల్స్ వెళ్లాయి. దీంతో గంటల వ్యవధిలోనే ఆయన నివాసం వద్ద కోలాహలం నెలకొంది. కాసేపటికి లోపలికి వెళ్లిన కొందరు... ఎల్లో కవర్లతో బయటకు వచ్చి తమ వర్గీయులతో కోలాహలంగా అక్కడి నుంచి వెళ్లిపోయారు. అందులో వాళ్ల పార్టీ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసే పత్రాలు ఉన్నట్లు జోరుగా ప్రచారం నడిచింది. అయితే.. కొద్దిసేపటికే లాలూ తనయుడు తేజస్వీయాదవ్, లాలూ నివాసానికి చేరుకున్నారు. ఆ వెంటనే కవర్లు అందుకున్నవాళ్లకు మరోసారి ఫోన్లు వెళ్లాయి. కవర్లు తీసుకెళ్లినవారు అర్ధరాత్రి తిరిగి లాలూ నివాసానికి చేరి వాటిని అప్పగించారు. ఎల్లో కవర్లు అందుకున్నవారిలో జేడీయూ నుంచి తాజాగా ఆర్జేడీలో చేరిన మాజీ ఎమ్మెల్యే నాగేంద్ర కుమార్ సింగ్ అలియాస్ బోగో కూడా ఉన్నారు. అయితే ఇలా ఎందుకు జరిగిందనే దానిపై ఆర్జేడీ నేతలెవరూ స్పష్టత ఇవ్వలేదు. అయితే అష్రాఫ్ ఫాతిమా మాత్రం తాము ఎలాంటి కవర్లు అందుకోలేదని, అవి ఏఐ జనరేటెడ్ ఫొటోలు అని ఆ ప్రచారాన్ని కొట్టిపారేశారు.

బీహార్ ఎన్నికల ప్రచారానికి

ఈసీ కొత్త నిబంధనలు

రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

న్యూదిల్లీ: వచ్చే నెలలో బీహార్‌లో శాసన సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ) రాజకీయ పార్టీలకు కీలక సూచనలు చేసింది. రాజకీయ ప్రచార ప్రకటనలకు పార్టీలు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు రాజకీయ పార్టీలకు, పోటీ చేసే అభ్యర్థులకు ఈసీ మార్గదర్శకాలు జారీ చేసింది. అభ్యర్థులు సోషల్ మీడియాతో సహా ఎలక్ట్రానిక్ లేదా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో అభ్యర్థులు ఏదైనా ప్రకటనలను ప్రచురించడానికి లేదా ప్రసారం చేయడానికి ముందు మీడియా సర్టిఫికేషన్ మోనటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నుంచి ముందస్తు ధ్రువీకరణ పొందడం తప్పనిసరి అని పేర్కొంది.

ఎన్నికల్లో సామాజిక మాధ్యమాల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేసేటప్పుడు వారి అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను అందించాలని ఈసీ ఆదేశించింది. రాజకీయ ప్రకటనల కోసం ముందస్తు ధ్రువీకరణ ప్రక్రియను పర్యవేక్షించడానికి జిల్లా, రాష్ట్రస్థాయిలో వివిధ మీడియా సర్టిఫికేషన్ ఎంసీఎంసీలను ఏర్పాటు చేసినట్లు ఈసీ తెలిపింది. రాజకీయ ప్రచారాల్లో పారదర్శకత, జవాబుదారీత నాన్ని ప్రోత్సహించడం కోసం ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. నిబంధనలను ఉల్లఘించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం, అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన 75 రోజుల్లోపు ప్రచార ఖర్చుల పూర్తి వివరాలను రాజకీయ పార్టీలు సమర్పించాలని సూచించింది. ఖర్చుల నివేదికలో ప్రకటనల కోసం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లకు చేసిన అన్ని చెల్లింపులు, అలాగే కంటెంట్ రూపొందించడం, ప్రచారం, సోషల్ మీడియా ఖాతాల నిర్వహణ కోసం అయ్యే ఖర్చులు తప్పనిసరిగా ఉండాలని రాజకీయ పార్టీలకు ఈసీ స్పష్టం చేసింది.

- ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత 48 గంటల వరకు ఎలాంటి బల్క్ ఎస్ఎంఎస్‌లు, ఆడియో సందేశాలు చేయరాదని ఎన్నికల సంఘం హెచ్చరించింది. అలాగే టీవీ, కేబుల్ నెట్‌వర్క్‌లు, రేడియోల్లో ఎన్నికలకు సంబంధించి రాజకీయ ప్రకటనలు చేయరాదని తెలిపింది. పోలింగ్ ప్రాంతంలో ఆడియో విజువల్ డిస్‌ప్లేలు నిషేధించినట్లు పేర్కొంది. బీహార్‌లో నవంబర్ 6న మొదటి దశ పోలింగ్ ప్రారంభమవుతున్న తరుణంలో ఈసీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.

పహల్గాం తరహా దాడికి పాక్ యత్నం: కటియార్

కశ్మీరు: పహల్గాం తరహాలో పాకిస్థాన్ మరోసారి దాడికి ప్రయత్నించవచ్చని పశ్చిమ సైనిక కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ కుమార్ కటియార్ హెచ్చరించారు. అలాంటి ప్రయత్నాలు జరిగితే భారత్ నుంచి తీవ్ర ప్రతిస్పందన వస్తుందని అన్నారు. కశ్మీరులో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు గట్టి బదులిచ్చాం. కానీ పాక్ ఎప్పటికీ తన బుద్ధి మార్చుకోదు. పహల్గాం తరహాలో మరోదాడికి యత్నించవచ్చు. అందుకే దాని ప్రతి కదలికపై మేం దృష్టిసారించాం. ఈసారి అలాంటి దుశ్చర్యలకు పాల్పడితే... మనం ఇచ్చే సమాధానం మామూలుగా ఉండదు' అని లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ కుమార్ స్పష్టం చేశారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంకు దగ్గర్లో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతం బైసరన్ లోయలో ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు పర్యాటకులను అతి సమీపం నుంచి కాల్చి చంపారు. ఈ ఘటనలో ఓ కశ్మీరీ సహా 26 మంది ప్రాణాలు కోల్పోయారు.

నిందితుడిని పట్టించిన సోదరి

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో ఒడిశాకు చెందిన వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచార ముగ్గురు నిందితులతో పాటు వారికి సహకరించిన మరో యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు పారిపోయేందుకు సహకరించిన మరో యువకుడిని మంగళవారం అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. నిందితుడి సోదరి ఇచ్చిన సమాచారంతోనే పరారీలో ఉన్న అతడిని గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. ఐదో నిందితుడు సఫీక్ దుర్గాపూర్‌లోని అందాల్ వంతెన కింద దాక్కున్నట్లు అతడి సోదరి రోజినా సమాచారం ఇవ్వడంతో అతడిని పట్టుకున్నట్లు తెలిపారు. తన సోదరుడు చేసిన తప్పునకు తగిన శిక్ష అనుభవించాలనే ఉద్దేశంతోనే పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు రోజినా మీడియాకు తెలిపింది.

వాంగ్‌చుక్ అరెస్ట్‌పై విచారణ నేటికి వాయిదా



న్యూదిల్లీ: లద్దాఖ్ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ అరెస్టును సవాలు చేస్తూ ఆయన భార్య గీతాంజలి జె.ఆంగ్మో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు బుధవారానికి వాయిదా వేసింది. సమయం తక్కువగా ఉన్నందున ఈ పిటిషన్‌పై విచారణను మరుసటి రోజుకి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్‌వీ అంజారియాతో కూడిన ధర్మాసనం మంగళవారం పేర్కొంది. అక్టోబర్ 6న విచారణలో భాగంగా సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి, లద్దాఖ్ యంత్రాంగానికి నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే వాంగ్‌చుక్‌ను నిర్బంధించడానికి గల కారణాలు అందించాలని ఆమె చేసిన విజ్ఞప్తిపై ఉత్తర్వులు జారీ చేసేందుకు నిరాకరించింది. లద్దాఖ్ రాష్ట్రహోదా, ఆరవషెడ్యూల్‌లో చేర్చాలన్న డిమాండ్‌పై చేపట్టిన ఆందోళనలపై పోలీసులు జరిపిన కాల్పుల్లో నలుగురు మరణించగా, 90 మందికి గాయాలయ్యాయి. హింసను ప్రేరేపించారని ఆరోపిస్తూ కేంద్ర ప్రభుత్వం వాంగ్‌చుక్‌ను కఠినమైన జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) 1980 కింద ముందస్తుగా అరెస్ట్ చేసింది. ఈ అరెస్టును సవాలు చేస్తూ ఆయన భార్య ఆంగ్మో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన భర్త ఎక్కడ ఉన్నారో అధికారులు స్పష్టం చేయాలని, ఆయనను వెంటనే విడుదల చేయాలని ఆదేశించాలని కోరారు. ఆయనను నిర్బంధించడానికి గల కారణాల గురించి లేదా ఆరోగ్య పరిస్థితి గురించి ఇప్పటివరకు ఎటువంటి సమాచారం అందలేదని పేర్కొన్నారు.

ఉగ్రవాదులకు ఎక్కడా స్థానం లేదు: అమిత్ షా



మానేసర్: ఆపరేషన్ సిందూర్ పాకిస్థాన్‌లోని ఉగ్రవాద గ్రూపుల ప్రధాన కార్యాలయాలు, శిక్షణా కేంద్రాలు, లాంచ్‌ప్యాడ్‌లను ధ్వంసం చేసిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం తెలిపారు. ఉగ్రవాదులకు ఇకపై ఏ ప్రదేశం సురక్షితం కాదని నొక్కి చెప్పారు. ఉగ్రవాద వ్యతిరేక 'బ్లాక్ క్యాట్' కమాండో దళం నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ) 41వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఇక్కడ తన ప్రధాన కార్యాలయంలో ఉద్దేశించి షా మాట్లాడుతూ భారత భద్రతా దళాలు ప్రతి ఉగ్రవాద చర్యను శిక్షించడానికి భూమి లోతుల్లోకి వెళ్లాలని దృఢంగా నిశ్చయించుకున్నాయని అన్నారు. 'ఆపరేషన్ సిందూర్ పాకిస్తాన్ ఉగ్రవాద ప్రధాన కార్యాలయాలు, వారి శిక్షణా కేంద్రాలు, లాంచ్‌ప్యాడ్‌లను ధ్వంసం చేసింది. ఆపరేషన్ మహాదేవ్‌లో, పహల్గామ్‌లో ఉగ్రవాద దాడి చేసిన ఉగ్రవాదులను నిర్మూలించడానికి మన భద్రతా దళాలు కచ్చితమైన చర్యలు తీసుకున్నాయి. ఇది భద్రతా దళాలపై పౌరుల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసింది' అని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం ఉగ్రవాదంపై జీరో-టాలరెన్స్ విధానాన్ని అవలంబించిందని హోం మంత్రి అన్నారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా ఇచ్చిన ఆర్టికల్ 370 రద్దు నుంచి సర్జికల్ స్ట్రైక్, వైమానిక దాడి, ఆపరేషన్ సిందూర్ వరకు ఉగ్రవాదులపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని జాగ్రత్తగా విశ్లేషిస్తే, భద్రతా దళాలు ఉగ్రవాదులు, ఉగ్రవాద గ్రూపుల మూలాలపై దాడి చేశాయని స్పష్టమవుతుందని షా అన్నారు.

ఐపీఎస్ ఆత్మహత్యకు బాధ్యులపై చర్యలు

రాహుల్‌గాంధీ డిమాండ్

చండీగఢ్: హర్యానాలో సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్యకు కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పూరన్ కుమార్ కుటుంబాన్ని కలిశారు. పూరన్‌కు నివాళు లర్పించిన ఆయన... బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు. అనంతరం రాహుల్ విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాధికారిపై ఇలాంటి వివక్ష చోటుచేసుకోవడం విషాదకరమన్నారు. ఈ కేసుకు సంబంధించి స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా విచారణ జరుపుతామని ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ హామీ ఇచ్చారన్నారు. కానీ, రోజులు గడుస్తున్నా... అది నెరవేరటం లేదని విమర్శించారు. తండ్రిని పోగొట్టుకున్న పూరన్‌కుమార్ ఇద్దరు పిల్లలు చాలా ఒత్తిడిలో ఉన్నారన్నారు. పూరన్ కుమార్ కెరీర్‌ను, ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఇతర అధికారులు సంవత్సరాలుగా వివక్ష కొనసాగించినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఇది కేవలం ఒక దళిత కుటుంబానికి సంబంధించినది కాదని, దేశంలోని కోట్లాది మంది దళితులకు సంబంధించినదని రాహుల్ వ్యాఖ్యానించారు. ఐపీఎస్ అధికారిపై జరిగిన వివక్ష దళితులుగా ఎంత విజయం సాధించినా... అణచివేత తప్పదనే తప్పుడు సందేశం వెళ్లేలా చేస్తుందన్నారు. పూరన్ కుమార్ ఆత్మహత్యకు కారకులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ, సీఎంను డిమాండ్ చేశారు. బాధిత కుటుంబంపై ఉన్న ఒత్తిడిని తొలగించాల న్నారు. రాహుల్ వెంట పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు కూడా వెళ్లారు. వారిలో కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ సింగ్, ఆ పార్టీ సీనియర్ నేత గౌరవ్ మూలానా, కేంద్ర మాజీ మంత్రి కుమారి సెల్జా, హర్యానా అసెంబ్లీలో ప్రతిపక్షనేత రావుదాన్ సింగ్ ఉన్నారు. వీరు కూడా ఐపీఎస్ అధికారి మృతికి సంతాపం తెలిపారు. కాగా, ఈ కేసుకు సంబంధించి వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న డీజీపీ శత్రుజీత్ కపూర్‌ను రాష్ట్ర ప్రభుత్వం సెలవుపై పంపించింది. ఈ బాధ్యతలను తాజాగా ఓం ప్రకాశ్ సింగ్‌కు అప్పజెప్పింది.

పోలీసు స్టేషన్‌లో సీసీటీవీ కెమెరాలేవి?

రాజస్థాన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ: పోలీసు స్టేషన్లలో విచారణ గదిలో సీసీటీవీ కెమెరాలు ఎందుకు ఏర్పాటు చేయలేదని సుప్రీం కోర్టు మంగళవారం రాజస్థాన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. పోలీసు స్టేషన్‌లలో సీసీటీవీ కెమెరాలు ఉండాల్సిన 'ప్రధాన ప్రదేశం' విచారణ గది అని న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. 'మీ అఫిడవిట్ ప్రకారం, విచారణ గదిలో కెమెరా లేదు. అది కెమెరాలు ఉండాల్సిన ప్రధాన ప్రదేశం' అని పేర్కొంది. సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల ఖర్చు అవుతుందని, కానీ 'ఇది మానవ హక్కుల ప్రశ్న' అని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. పర్యవేక్షణ యంత్రాంగాన్ని ఎలా ప్రతిపాదిస్తున్నారో కూడా రాష్ట్రాన్ని ప్రశ్నించింది. పోలీసు స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలు పని చేయకపోవడంపై దాఖలయిన పిటిషన్‌ను ధర్మాసనం విచారిస్తోంది. సెప్టెంబరు 4, 2025 మొదటి ఎనిమిది నెలల్లో రాజస్థాన్‌లో 11 మంది పోలీసు కస్టడీలో మరణించారని, వాటిలో ఏడు సంఘటనలు ఉదయపూర్ డివిజన్‌లో జరిగాయని పేర్కొన్న మీడియా నివేదికను సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించింది. మానవ హక్కుల ఉల్లంఘనలను అరికట్టడానికి పోలీసు స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని 2018 లో సుప్రీం కోర్టు ఆదేశించింది. సుమోటు విషయంలో రాజస్థాన్ దాఖలు చేసిన అఫిడవిట్‌ను ధర్మాసనం ప్రస్తావించింది. పోలీసు స్టేషన్ల విచారణ గదిలో ఎలాంటి సీసీటీవీ కెమెరాలు లేవని పేర్కొంది. అమికస్ సమర్పించిన నివేదికకు ప్రతిస్పందనలను దాఖలు చేయాలని కేంద్రం, ఇతర రాష్ట్రాలను కోరింది. విచారణను నవంబరు 24కు వాయిదా వేసింది.

నాకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయి: ఖర్గే

బెంగళూరు: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ సంస్థలలో ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలను ప్రశ్నించినందుకు తనకు, తన కుటుంబానికి బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయని కర్నాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే ఆరోపించారు. 'రెండు రోజులుగా నా ఫోన్ మోగడం ఆగలేదు. బెదిరింపు కాల్స్ వస్తున్నాయి' అని మంగళవారం 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. అయితే తాను భయపడటం లేదా ఆశ్చర్యపోలేదని నొక్కి చెప్పారు. 'ఆర్ఎస్ఎస్ మహాత్మా గాంధీని లేదా బాబాసాహెబ్ అంబేద్కర్‌ను విడిచిపెట్టనప్పుడు, వారు నన్ను ఎందుకు వదిలిపెడతారు?' అని ఆయన అన్నారు. 'వారు (ఆర్ఎస్ఎస్) బెదిరింపులు, వ్యక్తిగత నిందలు నన్ను నిశ్శబ్దం చేస్తాయని అనుకుంటే వారు తప్పుకుంటే భావించినట్లే. ఇది ఇప్పుడే ప్రారంభమయింది' అని తెలిపారు. మరింత సమానమైన, దయగల సమాజం కోసం పిలుపునిస్తూ, 'బుద్ధుడు, బసవన్న, బాబాసాహెబ్ అంబేద్కర్ సూత్రాలపై స్థాపించబడిన సమాజాన్ని, సమానత్వం, హేతుబద్ధత, కరుణతో పాతుకుపోయిన సమాజాన్ని నిర్మించడానికి, దేశంలో అత్యంత ప్రమాదకరమైన వైరస్ నుంచి ప్రక్షాళన చేయడానికి ఇది సరైన సమయం' అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, బహిరంగ ప్రదేశాలలో ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలను నిషేధించాలని అభ్యర్థిస్తూ మంత్రి ఇటీవల ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు లేఖ రాశారు.

ఓటు చోరీపై కాంగ్రెస్ నిరసన

పార్టీ దిల్లీ అధ్యక్షుడు సహా 56 మంది అరెస్ట్

న్యూదిల్లీ : ఓట్ల దొంగతనానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ దిల్లీ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, ఇతర పార్టీ కార్యకర్తలను నైరుతి దిల్లీలోని నజాఫ్‌గఢ్ ప్రాంతంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యాదవ్‌తో సహా 56 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. 'వారు నిరసన తెలుపుతున్నారు. ఆ ప్రాంతంలోని జవహర్ చౌక్ వైపు కదులుతున్నారు. వారికి నిరసన తెలిపేందుకు అనుమతి లేనందున మేము వారిని అదుపులోకి తీసుకున్నాము. వారిని నజాఫ్‌గఢ్ పోలీసు స్టేషన్‌కు తరలించారు' అని పోలీసు ఉన్నతాధికారి ఒకరు పీఐటీకి తెలిపారు. ఇదిలాఉండగా, 'ఓట్ల దొంగతనానికి వ్యతిరేకంగా మేము మా స్వరాన్ని పెంచుతూనే ఉంటాము. పోలీసులు, ప్రభుత్వం మా నైతికతను దెబ్బతీయలేవు' అని కాంగ్రెస్ తెలిపింది.

కోల్డ్‌రిఫ్ మందు నాసిరకం: డబ్ల్యుహెచ్ఓ



న్యూదిల్లీ: కోల్డ్‌రిఫ్ సహా మూడు దగ్గు మందులు నాసిరకమైనవిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) గుర్తించింది. వాటి విక్రయం, వినియోగంపై అన్ని రాష్ట్రాలకు హెచ్చరిక జారీ చేసింది.

కల్తీ దగ్గు మందు కోల్డ్‌రిఫ్ సేవించడంతో మధ్యప్రదేశ్‌లో 22 మంది చిన్నారులు మరణించిన సంగతి తెలిసిందే. దీంతో పాటు రెడ్‌నెక్స్ ఫార్మాస్యూటికల్స్ తయారుచేసిన రెస్పిఫ్రెష్ టీఆర్, షేప్ ఫార్మాకి చెందిన రీలైఫ్‌ను కలుషితమైన, నాసిరకమైన ఉత్పత్తులుగా గుర్తించినట్లు తన తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ సిరప్‌ల్లో విషపూరిత డైథిలిన్ గ్లైకాల్ అనుమతించదగిన పరిమితి కంటే సుమారు 500 రెట్లు ఉన్నట్లు సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) పేర్కొంది. దగ్గు సిరప్ మరణాల గురించి డబ్ల్యుహెచ్ఓకి సీడీఎస్‌సీఓ తెలిపింది. కలుషితమైన మెడిసిన్స్ ఏవీ కూడా ఎగుమతి చేయబడలేదని వెల్లడించింది. నమూనాలు సేకరించిన తర్వాత... కోల్డ్‌రిఫ్ దగ్గు మందులో విషపూరితమైన రసాయ పదార్థం డైథిలిన్ గ్లైకోల్ (డీఈజీ) 8.6 శాతం ఉన్నట్లు గుర్తించింది. ఇది అనుమతించదగిన పరిమితి 0.1 శాతం కంటే చాలా ఎక్కువ. అయితే నిషేధం విధించిన గుజరాత్‌లోని రెడ్‌నెక్స్ ఫార్మాస్యూటికల్స్ తయారు చేసిన రెస్పిఫ్రెష్ టీఆర్‌లో 1.342 శాతం ఉందని, అనుమతించదగిన స్థాయి కంటే చాలా అధికంగా ఉన్నట్లు పేర్కొంది. జనవరి 2025లో తయారు చేయబడిన డిసెంబర్ 2026తో గడువు ముగియనున్న ఈ సిరప్‌ను పరిశోధనా ఫలితాలు వెలువడిన వెంటనే వెనక్కు తీసుకున్నట్లు సీడీఎస్‌సీఓ పేర్కొంది. ఈ ఉత్పత్తి మొత్తాన్ని కేంద్రం నిలిపివేసినట్లు తెలిపింది. మూడవ సిరప్ షేప్ ఫార్మాకిచెందిన రీలైఫ్‌లో కూడా డీఈజీ 0.616 శాతం ఉంది. దీని ఉత్పత్తిని వెంటనే నిలిపివేశారు.

భారతీయ బ్యాంకుల తీరు దారుణం: విజయ్ మాల్యా

న్యూదిల్లీ: బ్యాంకులకు రూ.వేల కోట్లు ఎగవేసి... దేశం నుంచి పారిపోయి బ్రిటన్‌లో తలదాచుకుంటున్న విజయ్ మాల్యా భారత ప్రభుత్వ రంగ బ్యాంకులపై తీవ్ర విమర్శలు చేశారు. తన ఆస్తుల రికవరీల వివరాలను పలు బ్యాంకులు దాచిపెట్టాయని ఆరోపించారు. రికవరీ చేసుకున్న నిధుల వివరాలను అధికారికంగా వెల్లడించలేద న్నారు. రూ.14,100 కోట్ల మేర బ్యాంకులు రికవరీ చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి స్పష్టంచేసినా... బ్యాంకులు మాత్రం ఆ వివరాలు బయటపెట్టక పోవడం సిగ్గుచేటని నిందించారు. బ్యాంకులు పూర్తి రికవరీ వివరాలు వెల్లడించేవరకు తాను బ్రిటన్‌లో ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోనని విజయ్ మాల్యా పేర్కొన్నారు. కాగా కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ కోసం తాను తీసుకున్న రుణాలకు అనేక రెట్లు బ్యాంకులు తన నుంచి వసూలు చేశాయని, అందుకు సంబంధించిన అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలని విజయ్ మాల్యా పలుమార్లు భారత్‌లోని కోర్టులకు తెలియజేశారు. ఆయన తీసుకున్న రుణంలో దాదాపు రూ.10,200 కోట్లు చెల్లించినట్లు రికవరీ అధికారి తెలిపారు. అయితే తాను పూర్తి రుణం చెల్లించినప్పటికీ... ఇంకా రికవరీ ప్రక్రియ కొనసాగుతూనే ఉందని ఆరోపిస్తూ మాల్యా ఆగ్రహం వ్యక్తంచేశారు.

హర్యానాలో మరో పోలీసు అధికారి ఆత్మహత్య



చండీగఢ్: హర్యానాలో సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ బలవన్మరణానికి పాల్పడిన ఘటనను మరువకముందే తాజాగా మరో పోలీసు అధికారి తనను తాను తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడటం చర్చనీయాంశంగా మారింది. పూరన్‌ను లక్ష్యంగా చేసుకుని ఆ అధికారి తన సూసైడ్ నోట్‌లో ఆరోపణలు చేసినట్లు జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. ఏఎస్సై సందీప్‌కుమార్ రోహ్‌తక్ సైబర్ సెల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. పూరన్ కుమార్‌పై ఉన్న ఓ అవినీతి కేసును ఆయన దర్యాప్తు చేస్తున్నారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ పూరన్ కుమార్‌పై తన సూసైడ్ నోట్‌లో ఆరోపణలు చేశారు. నిజాలు వెలుగులోకి రావడం కోసం తన జీవితాన్ని త్యాగం చేస్తున్నట్లు రాశారు. పూరన్ కుమార్ ఇటీవల చండీగఢ్‌లోని తన నివాసంలో రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుల వివక్ష, వేధింపులు, అవమానాలతోనే బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు ఆయన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. ఇందులో ఎనిమిది మంది అధికారుల పేర్లను చేర్చారు. ఈ కేసుకు సంబంధించి వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న డీజీపీ శత్రుజీత్ కపూర్‌ను రాష్ట్ర ప్రభుత్వం సెలవుపై పంపించింది. రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజార్నియాను బదిలీ చేసింది.

విశాలాంధ్ర హైదరాబాద్

ఉన్నత చదువులకు రెడ్డి సేవా సమితి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : సంక్షేమ, సామాజిక సేవలో నిమగ్నమైన పాలమూరు రెడ్డి సేవ సమితి విద్య వైద్య రంగంలో పేద రెడ్లకు అండగా నిలిచి వారికి ఆపన్న హస్తాన్ని అందిస్తూ అగ్రస్థానంలో నిలిచింది. ఇందులో భాగంగా మంగళవారం రాజా బహదూర్ రెడ్డి కన్వెన్షన్ సెంటర్లో విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న ఉజ్జెల్లి గ్రామం, మాగనూరు మండలం, నారాయణపేట జిల్లాకు చెందిన జి. రామక్రిష్ణారెడ్డి కుమార్తె కుమారి జి. విశాల పాలమూరు విశ్వవిద్యాలయం నుంచి యం.కాంలో 2020-2022 విద్యా సంవత్సరం లో ప్రథమ స్థానంలో నిలిచి యూనివర్సిటీ గోల్డ్ మెడల్ సాధించి, 2025 సంవత్సరానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించిన పీహెచ్‌డి ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 11 వ ర్యాంక్ సాధించిన సందర్భంగా జి. విశాల కు రూ. 25,000లు ఆర్థిక సాయం చేశారు. 2025 సంవత్సరంలో ఎన్ టి ఏ నిర్వహించిన యూజీసీ నీట్ నందు అసిస్టెంట్ ప్రొఫెసర్ గా అర్హత సాధించడం జరిగింది. ఈ సందర్భంగా కుమారి విశాలను సేవ సమితి అభినందించింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు తూము ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, ప్రచార కార్యదర్శి సురేందర్ రెడ్డి, కార్యదర్శి కోటేశ్వర్ రెడ్డి, సభ్యులు పరమేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

కుటుంబ పోషణకు కేంద్ర సాయం

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కేంద్ర సహాయం NSAPలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు, వారి కుటుంబ ప్రధాన జీవనాధారదారుడు (మహిళ/పురుషుడు) మరణించిన సందర్భంలో, కుటుంబ పోషణ నిమిత్తం బాధిత కుటుంబానికి ఒకేసారి రూ. 20,000 సహాయంగా అందించబడుతుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుటుంబ ప్రధాన జీవనాధారదారుడి వయస్సు 18 సంవత్సరాలకు మించి 60 సం-త్సరాల లోపు ఉన్న వారు మరణించిన సందర్భంలోఈ పథకం కుటుంబ ప్రధాన జీవనాధారదారుడు పై ఆధారపడి ఉన్న జీవిత భాగస్వామి మైనర్ పిల్లలు, పెళ్లికాని కుమార్తెలు మరియు ఆధారపడిన తల్లిదండ్రులు, మైనర్ సోదరులు/సోదరీమణులు కుటుంబంగా పరిగణిస్తూ బాధిత కుటుంబానికి ఒకేసారి 20 వేలరూపాయలు ఆర్థిక సహాయంగా అందించడం జరుగుతుం దన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న కుటుంబం మాత్రమే NFBS కింద అర్హత కలిగి ఉండి వితంతువు లేదా మైనర్ పిల్లలను ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు చెందిన కుటుంబాలు, మైనర్ పిల్లలు అనాథలుగా ఉన్న కుటుంబాలకు, ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది మైనర్ పిల్లలు వైకల్యంతో ఉన్న కుటుంబాలకు, ఒకే ఒక్క బిడ్డ ఆడపిల్ల అయిన కుటుంబాలకు, ఒకటి లేదా అంతకంటే ఎక్కువ మంది మైనర్ పిల్లలు అందరూ బాలికలే ఉన్న కుటుంబాలకు, ఒకే బిడ్డ ఉన్న కుటుంబాలకు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు, మైనారిటీలు, బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన కుటుంబాలకు ఈ పథకం ద్వారాప్రయోజనం కలుగుతుందని తెలిపారు. అర్హులైన వారు పరిధిలోని మండల తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని కేంద్ర ప్రభుత్వం జాతీయ కుటుంబ ప్రయోజనం పథకం కింద లబ్ధి పొందాలని ప్రకటనలో కలెక్టర్ సూచించారు.

'ఓటు చోరీ సిగ్నేచర్ క్యాంపెయిన్' విజయవతం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆల్కా లాంబా పిలుపు మేరకు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగలి సునీతరావు ఆదేశాల ప్రకారం గత వారం రోజులుగా తెలంగాణ వ్యాప్తంగా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'ఓటు చోరీ సిగ్నేచర్ క్యాంపెయిన్' విజయ వంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం తొలి దశలో జిల్లాల అధ్యక్షులు రాష్ట్ర స్థాయి ఆఫీస్ బేరర్స్ సంతకాల పత్రాలను సమర్పించారు. మంగళవారం వరకు మొత్తం 82,400 పైచిలుకు సంతకాలు సేకరిం చబడి సబ్మిట్ చేయబడ్డాయి. మంగళవారం సబ్మిట్ చేసిన సంతకాల సేకరణలో రంగారెడ్డి జిల్లా 19,869 సంతకాలు చేసి జిల్లా వారిగా టాప్‌లో నిలవగా ఇంకా 13 జిల్లాలు తమ సంతకాల పత్రాలను బుధవారం సమర్పించనుండగా, మొత్తం సంఖ్య ఒక లక్షకుపైగా చేరుకునే అవకాశం ఉందన్నారు. మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాత్రమే ఇంత భారీ ఎత్తున సంతకాల సేకరణ జరగడం పట్ల రాష్ట్ర అధ్యక్షురాలు మొగలి సునీత రావు హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు రక్షణ కోసం మహిళా కాంగ్రెస్ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని, ఈ ఉద్యమం మహిళా శక్తి ఏకమై పని చేస్తే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించగలదని ఆమె స్పష్టం చేశారు.

ఆక్రమణలు తొలగింపు

విశాలాంధ్ర రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో విస్తరించివున్న ఈసా కాలువ బఫర్ జోన్ తో పాటు ఉప్పర్పల్లి జన చైతన్య పేజ్- 2 లోని పార్కులను కబ్జా చేసి నిర్మించిన నిర్మాణాలను మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు నేల మట్టం చేశారు. హిమాయత్ సాగర్ నుంచి అత్తాపూర్ వరకు గల ఈసా కాలువ కు ఇరువైపులా కబ్జాదారులు చిన్న చిన్న నిర్మాణాలు చేపట్టి బఫర్ జోన్ ను కబ్జా చేశారు. ఎక్కువగా జన చైతన్య పేజ్ -2 వద్ద బఫర్ జోన్‌తో పాటు పార్కు స్థలాలను కబ్జా చేసి ప్లాట్లుగా మార్చాలని ప్రయత్నించారు. సమాచారం తెలుసుకున్న రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి.సురేందర్ రెడ్డి ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్, సెక్షన్ ఆఫీసర్ విశాల్ రెడ్డి లు తమ సిబ్బందితో కలసి సుమారు 700ల గజాల స్థలంలో ఉన్న ఆక్రమణలను నేలమట్టం చేశారు. ఈసా కాలువ బఫర్ జోన్ లో కానీ, పార్కు స్థలాలలో ఎలాంటి ఆక్రమణలను ప్రోత్సహించేది లేదన్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడటంలో జీహెచ్‌ఎం సీ ముందుండి పనిచేస్తుందన్నారు.

విద్యారంగంపై ప్రత్యేక దృష్టి

- ప్రతి విద్యార్థి స్కూల్లో ఉండాలి
- జిల్లా కలెక్టర్ల వీసీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజా ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతిష్టాత్మంగా తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బెస్ట్ అవైలబుల్ స్కీం ప్రగతిని సమీక్షించారు. బెస్ట్ అవైలబుల్ స్కీం కింద నిధులకు సంబంధించిన ఒప్పందం పాఠశాల యాజమాన్యాలు, జిల్లా యంత్రాంగం మధ్యన జరిగింది. ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే పాఠశాల యాజమాన్యాలు జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించాలి తప్ప విద్యార్థులను బయటికి పంపడానికి వీలులేదని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు, డీఈవోలు, సంక్షేమ శాఖల అధికారులు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకొని బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఎంపికైన ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండేలా వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యా హక్కు చట్టం, బెస్ట్ అవైలబుల్ స్కీం ఏం చెబుతుంది, పాఠశాల యాజమాన్యాలు, ప్రభుత్వ యంత్రాంగం మధ్య జరిగిన ఒప్పందం లో ఏ ఏ అంశాలు ఉన్నాయో పాఠశాలల యాజమాన్యాలను పిలిచి వివరించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. బెస్ట్ అవైలబుల్ స్కీం కింద పాఠశాలల వారీగా ఉన్న బకాయిల వివరాలను వెంటనే పంపాలని కలెక్టర్లకు సూచించారు. బకాయిల్లో కొంత మొత్తాన్ని వెంటనే విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. విద్యా, వైద్య రంగాలపై జిల్లా కలెక్టర్లు సీరియస్ గా దృష్టి సారించాలని పెండింగ్ బిల్స్ ఏమైనా ఉంటే ఆర్థిక శాఖ దృష్టికి తీసుకురావాలని డిప్యూటీ సీఎం కలెక్టర్లకు సూచించారు. బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులు రాకపోతే కొన్నిచోట్ల పాఠశాలలు మూత వేశారని సమాచారం ఉంది. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిధులు ఎప్పటికప్పుడు రాకపోతే కొన్ని పాఠశాలలు మూసివేసే పరిస్థితి ఉందని అధికారులు నివేదిస్తున్నారు, కేవలం బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులపై ఆధారపడితే అది ప్రముఖ పాఠశాల ఏ విధంగా అవుతుందని జిల్లా కలెక్టర్లను డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. డీఈవో లు వెంటనే అన్ని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ను సందర్శించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎంత ఉంది? ప్రభుత్వ నిబంధనలు సరిగా పాటిస్తున్నారా? లేదా? ఆయా పాఠశాలల్లో వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నాయి? వెంటనే నివేదిక సమర్పించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. గడిచిన ఏడు సంవత్సరాలుగా బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదివిన విద్యార్థుల వివరాలు సేకరించాలని డిప్యూటీ సీఎం సూచించారు. ప్రస్తుతం ఆ విద్యార్థులంతా ఎక్కడ ఉన్నారు, ఏం చేస్తున్నారు, ఉన్నత విద్యకు వెళ్లారా ?లేదా? తదితర వివరాలు సేకరించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, అధికారులు స్వయంగా పర్యవేక్షించి బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కొనసాగుతున్న పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ అధికారులను కోరారు. సమావేశంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితా రానా, సాంఘిక సంక్షేమ శాఖ సెక్రెటరీ బుద్ధ ప్రకాశ్, సాంఘీక సంక్షేమ శాఖ కమిషనర్ క్షితిజ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సక్రమంగా కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : ధాన్యం సేకరణలో అక్రమాలకు తవ్వివకుండా, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా కొనుగోళ్ళు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో వానాకాలం పంట ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి నుండి కొనుగోలు కేంద్రాల అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, మిల్లర్స్, సివిల్ సప్లయ్ అధికారులతో అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత వానాకాలం సీజన్ లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే విషయంలో అక్రమాలకు తావిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఏ దశలోనూ రైతులకు ఇబ్బందులు ఏర్పడకుండా సాఫీగా ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగేలా సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలో 34 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, దాదాపు 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని, జిల్లాలో 6 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పంట విక్రయం విషయంలో రైతులు ఇబ్బందులకు గురికాకుండా, పారదర్శకంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు. అధికారులు, ధాన్యం సేకరణ ప్రక్రియలో బాధ్యతా యుతంగా పని చేయాలన్నారు. అన్ని శాఖలతో పరస్పర సమన్వయం పెంపొందించుకుని వరి ధాన్యం కొనుగోళ్ళు సజావుగా జరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. ఎఫ్.ఏ.క్యూ ప్రమాణాలకు లోబడి బాగా ఆరబెట్టి, శుభ్రపర్చిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా క్షేత్ర స్థాయిలో రైతులను చైతన్యపరచాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని, బాగా ఆరబెట్టిన, శుభ్రపర్చిన ధాన్యం మిల్లులకు పంపాలని అన్నారు. తూకం యంత్రాలు, గ్రెయిన్ క్యాలిపర్స్, తేమ కొలిచే యంత్రాలు వంటివి సరిపడా అందుబాటులో ఉండాలన్నారు. క్రాప్ బుకింగ్, ధాన్యం సేకరణ వివరాలను వెంట వెంటనే నమోదు చేస్తూ, రిజిస్టర్లను జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. ఈ సదస్సులో డీఎస్ఓ వనజాత, సివిల్ సప్లైస్ డీ.ఎం హరీష్, డీసీఓ సుధాకర్, జిల్లా వ్యవసాయ అధికారి ఉష, వ్యవసాయ శాఖ అధికారులు, మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు న్యాయం జరగాలి : కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : అప్పటి బీఆరెస్ పాలనలో అయినా ఇప్పటి కాంగ్రెస్ పాలనలో అయినా సరే విద్యార్థులకు న్యాయం జరగడమే కావాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కోట్లాడి తెచ్చుకున్న స్వరాష్ట్రంలో నిరుద్యోగుల అసలు నెరవేరాలని ఆమె అన్నారు. మంగళవారం గ్రూప్ -1లో జరిగిన అక్రమాలపై విద్యార్థులతో చర్చించేందుకు చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీకి ఆమె వెళ్లారు. ఈ సందర్భంగా లైబ్రరీ వద్ద ఆమెను పోలీసులు అడ్డుకున్నారు. సెంట్రల్ లైబ్రరీ ప్రధాన ద్వారం లోపలికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడకడానికి పోలీసులు అనుమతిని నిరాకరించారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంకు వ్యతిరేకంగా జాగృతి నాయకులు, పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎంతకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో కవితతో కలిసి జాగృతి నాయకులు లైబ్రరీ గేటు వద్ద బైఠాయించారు. అనంతరం గేటు వద్దనే గ్రూప్-1 అభ్యర్థులతో మాట ముచ్చట నిర్వహించిన కవిత అనంతరం మీడియాతో మాట్లాడారు.. గ్రూప్-1లో జరిగిన అక్రమాలపై విద్యార్థులతో మాట్లాడేందుకు ఇక్కడికి వస్తే లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని మండిపడ్డారు. కేసీఆర్ పరిపాలనలో అవకతవకలు జరిగాయని విద్యార్థులు చెప్పారని అయితే ఆనాడైనా, ఈనాడైనా విద్యార్థులకు న్యాయం జరగాలనే నేను కోరుతున్నానని చెప్పారు. విద్యార్థులకు ఉద్యోగాలు రావాలనే తెలంగాణ తెచ్చుకున్నామని కానీ గ్రూప్ -1 లో అక్రమాలు జరిగాయని ప్రతి ఒక్కరూ చెబుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ ఎగ్జామ్‌ను రద్దు చేసి మళ్లీ రీ ఎగ్జామ్ పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పారదర్శకంగా రిక్రూట్ మెంట్లు చేసి ఉంటే రాత్రికి రాత్రే అపాయింట్ మెంట్లు ఇవ్వాల్సిన అవసరమేముందని ప్రశ్నించారు. ర్యాంకర్ల పేపర్లు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎందుకు వెనక్కి పోతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిభ, ధైర్యం ఉన్న విద్యార్థులు ఛాలెంజ్ చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు ముందుకు రావటం లేదని అని ప్రశ్నించారు. అర్హత లేని వారికి ఉద్యోగాలు రావద్దనే మేము కోరుతున్నామని, ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ను తుంగలో తొక్కి నాన్ లోకల్స్ 8 మందికి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. రాహుల్ గాంధీ బీహార్ ఎన్నికల్లో తిరుగుతూ తెలంగాణలో విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నా పట్టించుకోవటం లేదని దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ ఇక్కడకు రావాలని లేదంటే మేము బీహార్ కు వస్తామన్నారు. నేడు కోర్టులో ఈ అంశంపై విచారణ ఉందని, న్యాయమూర్తులు కూడా ఆలోచన చేయాలని ఆమె కోరారు. తెలుగులో పరీక్షలు రాసిన విద్యార్థులకు అన్యాయం చేశారని, గ్రూప్ -1 రాసిన వాళ్లలో పోలీసోళ్ల పిల్లలు కూడా ఉన్నారన్నారు. మీ పిల్లలకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వాన్ని ఎందుకు కాపాడుతున్నారని పోలీసులను నిలదీశారు. 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ పేరు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కానీ పాత 50 వేల ఉద్యోగాలే ఇచ్చారు తప్ప ఒక్క కొత్త నోటిఫికేషన్ వేయలేదని స్పష్టం చేశారు. తెలంగాణలో విద్యార్థులకు జరుగుతున్న అన్యాయం పై పార్లమెంట్ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఎందుకు మాట్లాడటం లేదన్నారు. గ్రూప్-1 విషయంలో డివిజన్ బెంచ్ లో అనుకూలంగా తీర్పు రాకపోతే సుప్రీంకోర్టుకు వెళ్తామన్నారు. జాగృతి నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిని చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

సబ్సిడీపై విత్తనాల పంపిణీ : మంత్రి తుమ్మల

విశాలాంధ్ర - హైదరాబాద్ : రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా 2025-26 సంవత్సరంలో రైతుకు 100 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ జాతీయ నూనే గింజల పథకాన్ని 2025-26 సంవత్సరంలో 66.67 కోట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించుచున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ యాసంగి సీజనులో 45,350 ఎకరాల్లో 38434 క్వింటాళ్ళ వేరుశనగ విత్తనాలను 100 శాతం సబ్సిడీతో రూ. 46.14 కోట్లతో మహబూబ్ నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నారాయణపేట, నాగర్ కర్నూల్, రంగారెడ్డి, వికారాబాద్, నల్గొండ జిల్లాల్లో అమలు పరుచుచున్నట్లు పేర్కొన్నారు. రైతులు అధిక ఆదాయము ఇచ్చే పంటలు అయినటువంటి నూనె గింజలు, ఆయిల్ పామ్ మరియు ఉద్యానవన పంటల వైపు మొగ్గుచూపాలని కోరారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి, సమతుల్య ఎరువుల వాడకాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ లో అంతర పంటలు వేసి తక్కువ విస్తీర్ణంలో అధిక ఆదాయాన్ని పొందే విధంగా వ్యవసాయ ప్రణాళికలు చేసుకోవాలని సూచించారు. రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్న వివిధ జిల్లాల రైతులతో నూనె పంటల సాగులో వారి అనుభవాలను పంచుకొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, అమంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత, రంగారెడ్డి జిల్లా కద్తాల్, తలకొండపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం తరువాత వ్యవసాయశాఖ మాత్యులు చేతుల మీదుగా సెక్రటేరియట్ లో వివిధ జిల్లాల నుండి వచ్చిన పదిమంది రైతులకు విత్తనాలు అందచేసి, వారితో ముచ్చటించారు. అదేవిధంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలో, రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, అర్హులైన రైతులకు వేరుశనగ విత్తనాలను అందచేశారు.

గుర్తింపు లేని కళాశాలలను మూసివేయాలి : ఆర్ కృష్ణయ్య



విశాలాంధ్ర- బషీర్ బాగ్: రాష్ట్ర స్థాయి అల్లైడ్ హెల్త్ కేర్ కౌన్సిల్ ఏర్పాటు చేసి నకిలీ, గుర్తింపు లేని కళాశాలలను వెంటనే మూసివేయాలనీ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో అంతర్జాతీయ అనుబంధ ఆరోగ్య నిపుణుల దినోత్సవం సందర్భంగా రాజ్యసభ సభ్యులు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య ఆరోగ్య నిపుణులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం "ది అనాటమీ ఆఫ్ అవేర్‌నెస్ అనే పుస్తకాన్ని ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. 2021లో ఏర్పడిన ఎన్సిఏహెచ్పి చట్టాన్ని తెలంగాణ రాష్ట్రంలో తక్షణం అమలు చేయాలన్నారు. అల్లైడ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ కోసం ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ప్రైవేట్ రంగంలో కనీస వేతనాలు, ఉద్యోగ భద్రతా చట్టాలు తీసుకురావాలనీ, ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న పారామెడికల్ ఎంప్లాయిస్‌కి 30 వేలు బేసిక్ ఉండేలాగా చర్య తీసుకోవాలన్నారు. పారామెడికల్ విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు తక్షణం విడుదల చేయాలనీ ప్రభుత్వాన్ని కోరారు. డిప్లొమా కాలేజీస్ పెట్టుకోవడానికి గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ పర్మిషన్ ఇవ్వడం జరిగింది. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తుమని అల్లైడ్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఫౌండర్ జనరల్ సెక్రెటరీ కురుమళ్ళ వంశీ ప్రసాద్ అన్నారు. నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయకపోతే ప్రభుత్వంలో ఉన్న అధికారులు కోర్టు బోనులో నిలబడవలసి ఉంటుందని, ఉచితాల మీద ఉన్నంత శ్రద్ధ ప్రభుత్వాలకి విద్యార్థుల మీద లేదన్నారు. విద్యార్థులను గాలికి వదిలేసిన ప్రభుత్వాలు గాల్లోనే కలిసిపోతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ తెలంగాణ కన్వీనర్ డా. సంజీవ్ సింగ్ యాదవ్, తెలంగాణ పారామెడికల్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు యం.శ్రీనివాస్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కరస్పాండెంట్, సెక్రటరీ ప్రశాంత్ కుమార్, తెలంగాణ బీసీ యువజన ప్రధాన కార్యదర్శి శివరాం ప్రసాద్, అల్లైడ్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షులు యం.రాము, కోశాధికారి వై.వెంకటేష్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రజిని, ఉపాధ్యక్షులు అథర్, రాజా గౌడ్, పవన్, సంయుక్త కార్యదర్శులు విశ్వనాథ్,శ్రీకాంత్,సత్యం, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై దాడులు సేవ నిరతికే కళంకం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలకు ఊపిరి పోస్తున్న డాక్టర్లపై వైద్య సిబ్బందిపై దాడులు దౌర్జన్యాలు యావత్ సేవ దృక్పథ నిరతికే తీవ్రమైన కళంకం అని మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రంగా అజ్మీరా అన్నారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఐదవ మహాసభలలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా ఎన్నికైన సత్యనారాయణ రెడ్డి రాష్ట్ర కార్యదర్శి ఎన్నికైన ఎం. మధుసూదన్ రెడ్డిలకు మంగళవారం మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సమావేశ మందిరంలో ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సూపరింటెండెంట్ డాక్టర్ రంగా మాట్లాడుతూ సేవరంగంలోనే అత్యున్నతమైనది వైద్య రంగమని వైద్య రంగం లేకపోతే సమాజ ఆరోగ్య అభివృద్ధి శూన్యమని అన్నారు. వైద్యులపై సిబ్బందిపై భౌతిక దాడులు ఈ మధ్యకాలంలో పెరిగిపోతున్నాయని ఇలాంటి ధోరణి మంచిది కాదని అన్నారు. సత్యనారాయణ రెడ్డి మధుసూదన్ రెడ్డి రాష్ట్రస్థాయిలో ఉన్నత పదవులు పొందడం ఎంతో సంతోషించే విషయ మన్నారు. వామపక్ష భావజాలంతో పనిచేస్తున్న ఏఐటీయూసీ అనుబంధ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నేతృత్వంలో సత్యనారాయణ రెడ్డి మధుసూదన్‌రెడ్డి వైద్య ఉద్యోగుల హక్కులకై పోరాటం చేస్తూ ఉద్యోగుల తలలో నాలిక వలె ఉన్నారని కొనియాడారు. ఒకవైపు ఉద్యోగ బాధ్యత మరోవైపు ఉద్యోగాలు సంక్షేమానికి నిర్విరామంగా కృషి చేయడం అభినందదగ్గ విషయమన్నారు. సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య రంగంలో పనిచేస్తున్న రెగ్యులర్ ఎంప్లాయీస్ కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులు కార్మికుల సంక్షేమానికై ప్రత్యేక సమగ్ర విధానం ప్రకటిం చాలని కోరారు. వైద్య ఉద్యోగులకు సిపిఎస్ విధానం రద్దు చేసి ఓపిఎస్ పాలసీ తీసుకురావాలని అన్నారు. వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు 010 పద్దు ద్వారా వేతనాలు అందించాలని కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ వ్యవస్థను రద్దుచేసి కార్పొరేషన్ తీసుకురావాలని కార్మికులకు 26 వేల కనీస వేతనం అంతే విధంగా కృషి చేయాలని కోరారు. మహబూబ్‌నగర్ ఆసుపత్రిలో 28 సంవత్సరాలు సుదీర్ఘంగా అనేకమంది వైద్యాధికారులతో పనిచేశానని ఇక్కడే సత్కారం జరగడం ఎంతో సంతోషదాయకమన్నారు. జనరల్ ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్, అనస్తీసియా విభాగ హెచ్ ఓ డి డాక్టర్.మాధవి, ఆర్ ఎం ఓ డాక్టర్ ప్రేరణ,నర్సింగ్ సూపర్డెంట్ అల్బిన,సునీత,సుజాత, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు కోటేశ్వర్ రెడ్డి, వెంకటేష్, కిషోర్, భాస్కర్, వరప్రసాద్, సిహెచ్‌ఓ వెంకటేష్, వెంకటేశ్వర రెడ్డి,కురుమయ్య, కర్ణ,సతీష్ రెడ్డి, గోపాల్ నాయక్,సత్యం, చెన్నయ్య, రంగయ్య దేవానంద్, బాలకోటి,అంజి, యాదయ్య, రామకృష్ణ, నైసన్, భీమయ్య,జగ్గా నాయక్, కొండయ్య, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి అలీ మస్కతి, షకీలా రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అలీ మస్కతి, తెలుగుదేశం పార్టీ (టీడీపీ) మాజీ సీనియర్ మహిళా నేత షకీలా రెడ్డి మంగళవారం అధికారికంగా బీఆర్ఎస్‌లో చేరారు. నంది నగర్‌లోని తమ నివాసంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అలీ మస్కతి మాట్లాడుతూ .బీఆర్ఎస్ ఒక సెక్యులర్ పార్టీ అని, అందుకే కేటీఆర్ ఆధ్వర్యంలో తాను పార్టీలో చేరినట్లు తెలిపారు. "ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ పార్టీ కాదు. కేసీఆర్ పాలనలో ముస్లిం మైనారిటీల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీలకు ఏమీ చేయలేదు. కేసీఆర్ నిజమైన సెక్యులర్ నాయకుడు, ఆయన అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారు అని మస్కతి కాంగ్రెస్ పార్టీ వైఖరిపై విమర్శలు గుప్పించారు. షకీలా రెడ్డి మాట్లాడుతూ తాను టీడీపీ పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కేటీఆర్ ఆధ్వర్యంలో పనిచేయడానికి నేను బీఆర్ఎస్‌లో చేరడం జరిగింది. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి తప్ప, ఇప్పుడు అధికారంలో ఉన్నవారు కొత్తగా చేసిందేమీ లేదన్నారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. కేటీఆర్ ఆధ్వర్యంలో కేసీఆర్ పాలన మళ్లీ రాష్ట్రంలో తీసుకురావడం కోసం మేము కృషి చేస్తాం అని ఆమె ఉద్ఘాటించారు. ముఖ్యంగా, రాబోయే జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం తాను అంకితభావంతో పనిచేస్తానని, ఆ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ కచ్చితంగా గెలుస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. యువ నాయకుడు రోహిత్ శర్మ మాట్లాడుతూ యువతకు ఆదర్శంగా నిలిచే కేటీఆర్ నాయకత్వంలో పనిచేయడానికి ఇవాళ పార్టీలో చేరాను అని రోహిత్ శర్మ పేర్కొన్నారు. నాయకుల చేరికతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, వారి సేవలు రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడుతాయని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ స్థలం కాపాడాలని తహశీల్దార్‌కు వినతి

విశాలాంధ్ర, మేడిపల్లి: మేడిపల్లి మండలం పరిధిలో జంట కార్పొరేషన్‌లో ప్రభుత్వ స్థలాఉల కబ్జాల నుంచి రక్షించాలని మేడిపల్లి మండల సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్ మేడిపల్లి మండలం తహసిల్దార్‌కు మంగళవారం ఉదయం వినతిపత్రం ఇవ్వడం జరిగింది. రచ్చ కిషన్ మాట్లాడుతూ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అంబేద్కర్ నగర్ ఫేస్ 3 , బిస్కెట్ గోదాం దగ్గర మరియు డబల్ బెడ్ రూమ్ దగ్గర,, పెట్రోల్ బంక్ వెనకాల ప్రభుత్వ స్థలంలో భూ కబ్జాదారులు అక్రమ నిర్మాణాలు చేయుచున్నారు కావున వీటిని వెంటనే శాఖ చర్యలు తీసుకొని వెంటనే తొలగించాలని మరియు భూకబ్జాలు దారులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని లేనిచో మీ పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

నేడు బీసీ బిల్లు సాధనకై నిరసన

విశాలాంధ్ర, ఎల్.బి.నగర్ : బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సమితి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా మండల పట్టణ కేంద్రాలలో నిరసన కార్యక్రమంలో భాగంగా, బుధవారం ఉదయం 10 గంటలకు ఎల్బీనగర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర బీసీ నాయకులు బొడ్డుపల్లి కృష్ణ, రాయబండి పాండురంగ చారి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ, వివిధ అనుబంధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, బీసీ ఉద్యమకారులు, అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కోరారు.

ప్రాజెక్టు పనులు వేగవతం చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సచివాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని సాగు నీటి ప్రాజెక్టులపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు. సమావేశంలో ములుగు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై చర్చ జరిగింది. ములుగు జిల్లాలో కొనసాగుతున్న ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని మంత్రి సీతక్క కోరారు. ఏటూరు నాగరం, మంగపేట మండలాల్లో గోదావరి నది వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను తక్షణం పూర్తి చేయాలని ఆమె సూచించారు. అలాగే రామప్ప సరస్సుపై పొట్లాపూర్ ఎత్తిపోతల పథకానికి పరిపాలన అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రామప్ప నుండి లక్న వరం వరకు దేవాదుల పైప్‌లైన్ పనులను ప్రారంభించాలని సీతక్క సూచిం చారు. ములుగు నియోజకవర్గానికి గోదావరి జలాలు అందేలా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని మంత్రి సీతక్క కోరారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ములుగు ప్రాంతంలోని పెండింగ్ ప్రాజెక్ట్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్టల పురోగతిపై సమగ్ర నివేదికను సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించారు.

నాకు రక్షణ కల్పించండి

విశాలాంధ్ర , కాప్రా : చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేజ్ 2 లో గల ఆశా ఫోర్జింగ్ పరిశ్రమకు చెందిన 60 గజాల భూమిని పక్కన ఉన్న ఖాళీ స్థలానికి సంబంధించిన యజమాని రాజశేఖర్ రెడ్డి ఆ 60 గజాల భూమి కూడా తనదేనంటూ కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆశా ఫోర్జింగ్ పరిశ్రమ యజమాని రవికుమార్ ఆరోపించారు. గత ఏడాదే ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇద్దరినీ పిలిచి కోర్టుకు వెళ్ళమని సూచించారన్నారు. కోర్టుకు వెళితే ఇద్దరూ కోర్టు తీర్పు వచ్చే వరకు స్థలం వద్దకు వెళ్లవద్దని ఆదేశించింది. ఈ క్రమంలో ఈనెల 6న ఆశా ఫోర్జింగ్ పరిశ్రమ బయట ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను దొంగిలించి రాత్రి 12 గంటల సమయంలో కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో పరిశ్రమపై దాడి చేశారని రవికుమార్ తెలిపారు. రాళ్ళదాడిలో కంపెనీ భవనం అద్దాలు, రెండు కార్ల అద్దాలు పగిలిపోయాయి. అదృష్ట వశాత్తూ అక్కడే సెక్యూరిటీ సిబ్బంది తృటిలో తప్పించుకున్నారని ఆవేదనకు గురయ్యారు. ఈ విషయమై పోలీసులకు పిర్యాదు చేసిన క్రమంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారన్నారు. 11న 2 జేసీబీల సహాయంతో ఆశా ఫోర్జింగ్ పరిశ్రమకు చెందిన మిషనరీని రోడ్డుపై పడేశారని, దీనిపై కూడా పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆశా ఫోర్జింగ్ పరిశ్రమ యజమాని రవికుమార్ తెలిపారు. అంతే కాకుండా కొంతమంది వ్యక్తులు, కార్లు, బైకులపై తాము ఎక్కడికి వెళ్లినా వెంబడిస్తున్నారని భయాందోళనకు గురయ్యారు. నాకు ప్రాణహాని ఉందని వెంటనే పోలీసులు పట్టించుకుని వారిపై కఠిన చర్యలు తీసుకుని

న్యాయం చేయాలని యువకుడు ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-దుండిగల్: మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గండి మైసమ్మ మండలం పరిధి దుండిగల్ తాండా 1 కి చెందిన సిద్దు నాయక్ అనే యువకుడు తహసీల్దార్ సయ్యద్ మతిన్ వారి భూమిని ఇతరులకు అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడని తమకు న్యాయం చేకూర్చాలంటూ కార్యాలయం ముందు కిరోసిన్ తమ వంటిపై పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సమస్యను తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గాగిలాపూర్ గ్రామం సర్వే నెంబర్ 148/ఇ నందు సుమారు 5 గుంటల భూమి,సర్వే నెంబర్ 150/ఇ లోని 2 గుంటలు 1950వ సంవత్సరం నుంచి తమ నాన్న బానోత్ మోహన్,బాబాయ్ బానోత్ రవి,తాత బానోత్ ఫకీరా నుండి ఈ భూమిని వారసత్వంగా పొందారని తెలిపారు. 2006లో ఆర్ఓ ఆర్ ప్రొసీడింగ్ నంబర్ A/2037/06 వారి కుటుంబీకులకు రెవెన్యూ అధికారులు మీ భూమిని బదిలీ చేశారన్నారు. పట్టా నెంబర్ 615 ద్వారా పాస్ బుక్ నెంబర్ 484935, పట్టా నెంబర్ 615 ద్వారా పాస్ బుక్ నెంబర్ 484932 భూధాన్ భూమి పేరుతో పాస్ బుక్‌లు మంజూరు చేశారన్నారు. వారి బాబాయ్ బానోత్ రవి చనిపోయిన తర్వాత ఆయన పేరు పోలికను ఉపయోగించి బిచ్య భార్య లక్ష్మీబాయి అనే మహిళ భూమిని దొంగ పద్ధతిలో అమ్మేసింది. దీనిపై సిద్దు నాయక్ కుటుంబ సభ్యులు 2008లో O.S. No. 489/2008 కేసు వెయ్యగా 2010లో కోర్టు వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చిందని వెల్లడించారు. భూ రికార్డులు 2015లో ఆన్లైన్లోకి వెళ్లిన తర్వాత అధికారులు పేర్లు తొలగించారని నాన్న, బాబాయ్ అనేకసార్లు తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఎటువంటి స్పందన లభించలేదని, పాస్ బుక్కులు ఇవ్వకుండా తమ భూమిని బడనిర్మాణ సంస్థకు కట్టబెట్టేందుకు తహసీల్దార్ ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ భూమి మీద ఆధారపడి వారి కుటుంబ జీవిస్తున్నారని, గతంలో హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు ఆదేశాలతో జిల్లా కలెక్టర్ 2023- 96,2023-97 ప్రొసీడింగ్స్ ప్రకారం భుదాన్ భూమి కాదని తేల్చి చెప్పారన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు 22-ఏ ప్రకారం ప్రొవిషన్ లిస్టులో చేర్చాలన్నారు.గత సంవత్సరం నవంబర్ 6న విరాసత్ దరఖాస్తులు చేసుకున్నప్పుడు లంబాడి జాతిని తక్కువగా మాట్లాడుతూ పెద్దవాళ్లతో గొడవెందుకు అంటూ ఎమ్మార్వో మతిన్ బెదిరించారని, తమకు న్యాయం జరిగే వరకూ ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పోలీసుల సమక్షంలో బాధితుడి సమస్యకు పరిష్కారం

పోలీసుల సమక్షంలో రెండు సంవత్సరాలుగా పరిష్కారానికి నోచుకోని సమస్యకు పరిష్కారం లభించినట్లు అయ్యింది.బాధితుల ఆందోళనను పోలీసులు సమస్యను తహసీల్దారు సయ్యద్ మతిన్ దృష్టికి తీసుకెళ్లగా త్వరలో పాస్ బుక్కులు అందజేస్తానంటూ హామీ ఇచ్చినట్లు సమాచారం

తనకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని రవికుమార్ వేడుకున్నారు.

IN THE COURT OF THE XLI ADDL CITY CIVIL AND SESSION JUDGE AT BENGALURU (CCH-42)
O.S.No. 2479/2018
BETWEEN : Smt. P.Yashoda W/o Narasimha Murthy Aged about 50 years, No. 145, 4th Main Road, Between 8th and 9th Cross, Chamarajpet Bengaluru -560018 ...PLAINTIFF
AND : Sri. H.P. Nanjundappa @ Rajanna And others ...DEFENDANTS
PAPER PUBLICATION AGAINST DEFENDANT NO.13
TO, Sri. Abhay Kumar Dugar S/o Sri.Nortanmal Dugar, Aged about 60 years, Registered office at T.Steel Industries, Plot No.4, Hydarbasti, Secundarabad ...DEFENDANT NO.13
WHEREAS THE ABOVE NAMED PLAINTIFFS HAD FILED THE PRESENT SUIT IN O.S.NO.2479/2018 SUIT FOR PARTITION AND SEPARATE POSESSION AND OTHER CONSEQENTIAL RELIF AGAINST THE DEFENDANTS. THE DEFENDANT NO.13 ARE HEREBY SUIT SUMMON TO APPEAR BEFORE THIS HONB'BLE COURT IN PERSON/PLEADER.
YOU ARE HEREBY SUMMONED TO APPEAR BEFORE THIS COURT ON 23-10-2025 AT 11.A.M IN PERSON OR THROUGH ADVOCATE/ PLEADER TO ANSWER THE QUESTIONS TO THE SAME. FAILING WHICH THE SUIT WILL BE HEARD AND DETERMINED AS EX-PARTE.
SCHEDULE
All that piece and parcel of the property bearing site no. 25 present CMC Khatha No.20 formed out in Sy No. 261/1 and 261/2 converted from the DC vide order no. B.DIS.ALN.SR(S) 162/2002-03 situated at Halagevaderahalli village, Kengeri Hobli, Bengaluru South Taluk, measuring an East to West 30-0 ft and North to South 50 Ft totally measuring 1500 Sq. Ft, bounded on the :
EAST BY : Site No.27, WEST BY : Road
NORTH BY : Road, SOUTH BY : Site No.26
GIVEN UNDER MY HAND AND SEAL OF THIS HONBLE COURT AND THIS 9TH DAY OF OCTOBER 2025.
By Order of the Court
Senior Sheristedar
City Civil Court, Bangalore
Advocate for Plaintiffs : Sampath Kumar. P Advocate
No.143, 1st Floor, 8th Main, 18th Cross, M.C Layout, Vijayanagar, Bengaluru -560072
Mob: 9986895123

'బంద్ ఫర్ జస్టిస్' రాష్ట్ర బంద్‌కు ఏఐవైఎఫ్ సంపూర్ణ మద్దతు

విశాలాంధ్ర, హైదరాబాద్ : బీసీ రిజర్వేషన్ల సాధనకు వివిధ బీసీ సంఘాలతో ఏర్పడిన 'బిసి ఐక్య కార్యాచరణ కమిటీ'-(బిసి జెఎసి) 'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని, బంద్ లో ప్రత్యక్షంగా రాష్ట్ర వ్యాప్తంగా పాల్గొంటామని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర తెలిపారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం హిమాయత్ నగర్ లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు సాగాలని సూచించారు. బీసీ బిల్లులను ఆమోదించి, రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైన ఉందని స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవోతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ మీద నిన్న హైకోర్టు స్టే విధించడంతో, రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయి. దీనికి ప్రధాన కారణం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని. ఇప్పటికైనా రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు,కేంద్ర మంత్రులు నైతిక బాధ్యత వహించి, వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన, సర్వే నిర్వహించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు కేంద్రానికి పంపించినా స్పందించలేదన్నారు. శాసనసభలో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించిన ఆర్డినెన్స్ నేను గవర్నర్ పంపించినా ఆమోదించకపోవడం వల్లే రిజర్వేషన్లు ఆగిపోయా యన్నారు. బీజేపీ కుతంత్ర, మనువాద పార్టీ అయినందున, కుల వ్యవస్థ, అసమానతలు ఉండాలని, మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని కోరుకుంటుందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు రావాల్సిన హక్కులన్నింటినీ కాలరాస్తున్నదని ధ్వజమెత్తారు. బీసీల పట్ల బీజేపీ కి చిత్తశుద్ధి ఉంటే తొమ్మిదవ షెడ్యూలులో చేర్చేందుకు రాజ్యాంగ సవరణ ద్వారా అవసరమైతే కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంటును సమావేశపరిచి, ఆ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. గవర్నర్ వద్ద పెండింగ్ ఉన్న బిల్లులు నిర్దిష్ట కాలపరిమితి లోగా ఆమోదం లభించకపోతే, నోటిఫై చేయవచ్చని తమిళనాడు కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలించాలన్నారు. రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు, మంత్రులు కేంద్రంపై ఒత్తిడి తేవడానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదన్నారు. ఈ సమావేశంలో సీపీఐ పార్టీ శత జయంతి వార్షికోత్సవాల సందర్భంగా డిసెంబర్ నెలలో మూడు రోజుల పాటు హైదరాబాద్ లో రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ నిర్వహించాలని, అన్ని జిల్లాల్లో యువజన సంఘాన్ని బలోపేతం చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యువజన వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బిజ్జ శ్రీనివాసులు, టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, యుగంధర్,చేపూరి కొండల్ పాల్గొన్నారు.

ప్రైవేటు బ్యాంకులను జాతీయకరణ చేయాలి : రాంబాబు

విశాలాంధ్ర, హైదరాబాద్ : దేశ ఆర్థికాభివృద్ధికి, జాతీయ సంపద, ప్రజాధనం పరిరక్షణ కోసం ప్రైవేటు బ్యాంకులన్నింటినీ జాతీయకరణ చేయాలని ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని స్వాంతంత్ర్యం అనంతరం నాటి పాలకులు బ్యాంకులను జాతీయకరణ చేయగా, నేటి పాలకులు జాతీయ బ్యాంకులను ప్రైవేటీకరిస్తూ వారి బినామీలైన కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రూపాయల ప్రజా సంపదను దోచి పెడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్ యూనియన్స్ సెల్ (ఎ.ఐ.బి.ఈ.ఎ) ఇచ్చిన పిలుపు మేరకు ప్రైవేటు బ్యాంకుల ఉద్యోగులు హైదరాబాద్, గన్ ఫౌండ్రి, చిరాగ్ అలీ లైన్ కరూర్ వైశ్యా బ్యాంక్ డివిజనల్ కార్యాలయం వద్ద సామూహిక ప్రదర్శన నిర్వహించారు. ఉద్యోగుల ప్రదర్శనను ఉద్దేశించి బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థను బీజేపి నేతృత్వంలోని ప్రభుత్వం ధ్వంసం చేస్తున్నదని విమర్శించారు. మరోవైపు బ్యాంకులను ప్రైవేటీకరిస్తూ కొంత మంది కార్పొరేట్ శక్తులు, వ్యక్తుల చేతులకు అప్పగిస్తూ వేల కోట్ల రూపాయలను కొల్లగొడుతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ప్రైవేటు బ్యాంకులను జాతీయం చేయాలని, అన్ని బ్యాంకులలో అవసరమైన మేరకు రెగ్యులర్ క్లరికల్, సబ్ స్టాఫ్ కేడర్ నియమించాలని రాంబాబు డిమాండ్ చేశారు. ఫెడరల్ బ్యాంకులో ఉద్యోగులపై వేధింపులను ఆపాలని, సి.ఎస్.బి బ్యాంకులో త్వరితగతిన వేతన సవరణ చేయాలని, అన్ని ప్రైవేటు బ్యాంకులలోని పెన్షనర్లకు ఎక్స్ గ్రేషియా వర్తింపజేయాలని, నైనిటాల్ బ్యాంక్ విక్రయాన్ని వెంటనే నిలుపుదల చేసి, దానిని బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనం చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ)ను కోరారు. ప్రైవేటు బ్యాంకులలో పనిచేస్తున్న సి టు సి ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని, ప్రైవేటు బ్యాంకులలో సి.బి.డి.టి మినహాయింపుతో పెన్షన్ ఫండ్ ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ప్రదర్శనలో ఏపీ&టీఎస్ బ్యాంకు ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు టి. రవీంద్రనాథ్, ఉప ప్రధాన కార్యదర్శి నవాద్ ఖాన్, కార్యదర్శులు శైలేంద్ర, వినోద్, నల్లపు రెడ్డి, ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్ యూనియన్స్ సెల్ ప్రధాన కార్యదర్శి మధుసూదన్, కరూర్ వైశ్యా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సాయి శంకర్, ఫెడరల్ బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కర్ణాటక బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి హరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తికి తూట్లు : కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా, ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కే విధంగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో వ్యవహరిస్తుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్ లో ఓట్ల చోరీ పై ఆయన ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని రకాల కుట్రలు, కుతంత్రాలు చేసినా గెలిచేది మాత్రం భారత రాష్ట్ర సమితినే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఉప ఎన్నికల సందర్భంగా 23 వేల ఓట్లు పెరిగాయని చెప్తున్నారని, వీటితోపాటు 12000 ఓట్లు డిలీట్ అయ్యాయని చెబుతున్నారని తెలిపారు. అసాధారణంగా ఏ విధంగా ఓట్లు పెరిగాయి అన్నది అనేక అనుమానాలకు దారితీస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎంపికైన వ్యక్తి ఎన్నికల కమిషన్ డ్యూటీని తన చేతుల్లోకి తీసుకొని అక్రమంగా ఓటు ఐడీలను పంచారని ఆరోపించారు. మైనర్ బాల బాలికలకు ఓటర్ ఐడీలను కాంగ్రెస్ అభ్యర్థి పంచారని దుయ్యబట్టారు. అసలు ఓటర్ జాబితా పంపిణీకి సంబంధించిన అంశంలో రాష్ట్ర ముఖ్యమంత్రికి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కి ఏం సంబంధం? ఆయన ఫోటోలు పెట్టుకుని మరీ కార్యక్రమాన్ని నిర్వహించారని ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థి చేసిన ఫేక్ ఐడీ కార్డుల పంపిణీ జరిగింది అని ఎన్నికల సంఘం కేసు నమోదు చేసిందని గుర్తు చేశారు. ఇప్పటికే జరిగిన తర్వాతనే మా పార్టీ కార్యకర్తలు, పార్టీ శ్రేణులు మొత్తం వ్యవహారంలో పరిశీలన చేయడం జరిగిందన్నారు. 43 ఓట్లు ఉన్న సాంస్కృతి అపార్ట్మెంట్ వెళ్లి చూశాము. అక్కడ ఉన్న ఓనర్ 'మాకు సంబంధం లేదు' అని చెప్పారు. అక్కడ ఉన్న వాళ్లకు, ఉన్న ఇంటి యజమానులకు, ఈ లిస్టులో ఉన్న వాళ్లకి ఎలాంటి సంబంధం లేదు అని చెప్పారు. బూత్ నంబర్ 125 లో ఒక ఇంట్లో 23 ఓట్లు ఉన్నాయని, 80 గజాలు మాత్రం ఉన్న ఇంట్లో ఎంతో మంది ఎందుకు వచ్చారు మాకు తెలవదని యజమాని చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంలో ఎన్నికల అక్రమాల కోసం కిందిస్థాయి అధికారులను కాంగ్రెస్ పార్టీ ఉపయోగించుకుంటుంది అన్న అనుమానం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ లీడర్లకు సంబంధించిన ఇంట్లో 32 దొంగ ఓట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇక్కడ ఉన్న వ్యక్తులకు ఇతర నియోజకవర్గాల్లో ఓట్లు ఉన్నాయని, ఇట్లా దొంగ ఓట్లు, రెండు మూడు ఓటర్ ఐడీ కార్డులు, ఇతర నియోజకవర్గాల్లో ఓట్లు ఉన్న వారి వివరాలను ఎన్నికల సంఘానికి ఇప్పటికే అందించామని చెప్పుకొచ్చారు. జూబ్లీహిల్స్‌లో ఓటు నమోదు అయిన సిరిసిల్ల నివాసి శ్రీనివాస్ రెడ్డితో మాట్లాడితే తనకు సంబంధం లేకుండానే తన ఓటును జూబ్లీహిల్స్ లో నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. తన పేరుతో దొంగ ఓటు రాయించారని శ్రీనివాస్ రెడ్డి చెప్పారన్నారు. ఒక్కొక్క వ్యక్తికి రెండు మూడు ఎపిక్ కార్డులు ఉన్నాయని, ఓట్లన్నింటిని ఎన్నికల షెడ్యూల్ కింద రాయించారన్నారు. ఇంత దిక్కుమాలిన, సిగ్గులేని చర్యలకు కాంగ్రెస్ పాల్పడిందని మండిపడ్డారు. 42 ఓట్లు ఉన్నాయని ఓటర్ లిస్టులో పేర్కొన్న ఇంటి నెంబర్‌తోని వెతికితే అసలు ఆ ఇల్లే లేకపోవడం గమనించాల్సిన విషయం అన్నారు. ఇంతటి దారుణాలు ఓటర్ జాబితాలో చోటు చేసుకున్నాయని, ఇవన్నీ కూడా ఒకటే రోజు ఓటర్ జాబితాలో నింపింది కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆరోపించారు. సొంతంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ సొంత తమ్ముడి వెంకట్ ప్రవీణ్ యాదవ్‌కు మూడు ఓట్లు ఉన్నాయని విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి సోదరుడికి మూడు ఓట్లు ఉన్నాక స్వేచ్ఛగా ఓట్లు ఎట్లా జరుగుతాయని అని మేము అనుకోవాలని ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంలో ఎన్నికల కమిషన్‌కు కలిసి పార్టీ తరపున లేఖ కూడా ఇచ్చామని, మేము అడిగింది అయితే 24 గంటలు దాటినా ఇప్పటిదాకా ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. ఈ సందర్భంగా ఆయన మరోసారి ఎన్నికల సంఘానికి మూడు ప్రధానమైన డిమాండ్లను ఉంచారు. మొత్తం కొత్తగా వచ్చిన 23 వేల ఓట్ల పైన సంపూర్ణ దర్యాప్తు జరగాలని కోరారు. డూప్లికేట్, నకిలీ ఓట్లను వెంటనే డిలీట్ చేయడంతో పాటు, ఈ ఓట్ల నమోదుకు పాల్పడిన, ఓట్ల అక్రమాలకు పాల్పడిన అధికారుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర ఎన్నికల సంఘం స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.

చందానగర్‌లో వసూళ్ల రాజ్యం!

- టౌన్‌ప్లానింగ్‌లో అవినీతి అల్లకల్లోలం
- ప్రతి స్లాబ్‌కీ లక్షలు, ఏసీపీ మాధ్యస్థంలోనే డీల్స్
- చందానగర్ సర్కిల్‌లో భవనాలే కాదు, అవినీతికే మేడలు

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: జీహెచ్ఎంసీ పరిధిలోని చందానగర్ సర్కిల్-21లో టౌన్‌ప్లానింగ్ విభాగం అవినీతి పరాకాష్టకు చేరింది. "నిర్మాణం అంటే పనుల్లా-అనుమతి అంటే డీల్ అన్న మాట ఇక్కడ అక్షరాలా నిజమవుతోంది. ఏసీపీతో పాటు టౌన్‌ప్లానింగ్ అధికారులు, సెక్షన్ ఇంజనీర్లు బిల్డర్ల వద్ద నుండి భారీ మొత్తాల్లో ముడుపుల వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి స్లాబ్‌కి లక్షల్లో చెల్లించకుంటే అనుమతి ఫైల్ కదలదు!. గతంలో అధికారుల బాటలోనే కొత్త అధికారి నడుస్తున్నాడని స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు. అంతేకాదు, ఏసీపీ ప్రత్యక్షంగా మధ్యవర్తిత్వం చేస్తూ బిల్డర్లు, అధికారుల మధ్య డీల్స్ కుదిరేలా సమన్వయం చేస్తున్నాడన్న సమాచారం అంతర్గతంగా వినిపిస్తోంది. ప్రజావాణి కార్యక్రమంలో ప్రతి సోమవారం టౌన్‌ప్లానింగ్ ఫిర్యాదులే అధికంగా వస్తున్నప్పటికీ, వాటిపై చర్య తీసుకున్న రికార్డు మాత్రం లేదు. "కింది నుంచి పై వరకు అందరూ మాకు రాజులే!" మియాపూర్, చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్లలో నామమాత్రపు అనుమతులు మాత్రమే జారీ అవుతుండగా, అదనపు అంతస్తుల కోసం మాత్రం లక్షల్లో లావాదేవీలు జరుగుతున్నాయి. ఇక మదీనాగూడ్‌లోని అయ్యప్ప సొసైటీ, సర్వే ఆఫ్ ఇండియా, చంద్ర నాయక్ తండాల్లో అసలు అనుమతులే లేకపోయినా ఆకాశాన్ని అంటుతున్న కట్టడాలు ఎగసిపడుతున్నాయి. 'అధికార నిర్లక్ష్యం, అవినీతి బలమే ఈ భవనాల పునాది' అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సర్కిల్‌లోని ఒక సెక్షన్ అధికారి పేరు ఇప్పుడు బిల్డర్లలో భయానకంగా మారింది. గతంలో శేరిలింగంపల్లి సర్కిల్‌లో పనుల్లా వ్యవహారాలతో పేరుపొందిన అతను, బదిలీ అయినా కొద్ది రోజుల్లోనే తిరిగి అదే జోన్‌లో తిష్టవేశాడు. 'ఎక్కడ లాభం ఉంటుందో అక్కడికే లగ్నం' అన్నట్లు తిరిగి కుర్చీ కబ్జా చేసుకున్నాడు. ఇప్పుడు బిల్డర్లతో బహిరంగంగానే మాట్లాడుతూ 'నా కాలంలో రూల్స్ నా చేతిలోనే రాయిస్తా!' అని గర్వంగా చెబుతున్నాడని కొందరు గుసగుసలు. దానికి మద్దతుగానే ఏసీపీ డీల్స్ కుదిరేలా సమన్వయం చేస్తున్నాడన్న చర్చ సర్కిల్ అంతా జోరుగా సాగుతోంది. ఏసీపీ అనేక ఫిర్యాదులు చేరినా చర్యలు మాత్రం గల్లంతవుతున్నాయి. 'చర్యల కంటే షేరింగ్‌కే ప్రాధాన్యం' ఇస్తున్నారన్న విమర్శలు ఉద్యోగుల్లో, బిల్డర్లలో చక్కర్లు కొడుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధికారుల టేబుల్లపై ఫైళ్ల కంటే బిల్డర్ల కవర్లే ఎక్కువగా కనిపిస్తున్నాయట. లీగల్ కంటే ఇల్లీగల్ అనుమతులే ఎక్కువగా జారీ అవుతున్నాయన్న సిగ్గుచేటు అంశాలు జమేకరిగిన సత్యంగా తెలుస్తోంది. ఈ దందా జరిగే కొనసాగితే ప్రజా ప్రయోజనాలు పూర్తిగా నీరుగారిపోతాయని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తక్షణమే చందానగర్ సర్కిల్‌పై దృష్టి సారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. 'నియమాలు రాయాల్సినవారు, నోట్ల కోసం రూల్స్ రాయిస్తుంటే ప్రజల భవిష్యత్తు ఏమిటని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ విజయం తధ్యం

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్ గూడ డివిజన్, వెంగళరావు నగర్ డివిజన్‌కు సంబంధించి ఉప ఎన్నికలలో భాగంగా బూతు స్థాయి మీటింగ్ మెహమూద్ ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ ఏఐసిసి ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసిసి సెక్రటరీ విశ్వనాథన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఎవరు నిల్వరించలేరని అలాగే అందరూ కలిసికట్టుగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మమేకమై కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను, కాంగ్రెస్ సిద్ధాంతాలను, ప్రతి ఓటర్ కి తెలపాలని అలాగే బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్ బలం కనిపించాలని అన్నారు. ఇప్పటికే ప్రజలు కాంగ్రెస్ పాలన తో అభివృద్ధి చెందుతున్నారని ఈ విశ్వాసాన్ని నిలబెట్టడానికి ప్రతి బూత్ స్థాయి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలి. అందరం కలిసికట్టుగా జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ జెండా ఎగర వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర నాయకులు, పెద్ద ఎత్తున బూత్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్‌పై విశ్వాసం ఉంచారు. ఈసారి మన అభ్యర్థి నవీన్ యాదవ్ ని భారీ మెజారిటీతో గెలిపించి, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి అని పిలుపునిచ్చారు.



మీ అందరి బలమే బీఆర్ఎస్ విజయానికి శ్రీకారం

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : యూసఫ్ గూడ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణ నగర్ ఏ-బ్లాక్‌లో జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత, స్థానిక పార్టీ శ్రేణులతో కలిసి మంగళవారం గడప గడపకు ప్రచారం నిర్వహించారు. మీ అందరి బలమే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయానికి శ్రీకారం అని, మీరంతా కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. సునీత మాగంటి గెలుపులో మేము భాగస్వామ్యం అవుతామని బోథన్ మాజీ ఎమ్మెల్యే షకీల్, సతీమణి ఆయేషా, సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ ప్రచారంలో పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజుకుమార్ పటేల్, డివిజన్ అధ్యక్షులు నీలం సంతోష్ ముదిరాజ్, జనరల్ సెక్రటరీ నర్సింగ్ దాస్, స్థానిక నాయకులు, మహిళలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీసీ క్యాండీమన్ అపాన్ ఏ టైమ్ బై క్యాండీమన్

హైదరాబాద్: ఉల్లాసవంతమైన స్ఫూర్తి, ఆకర్షణీయమైన రుచులు, చిలిపి ఆకర్షణ కోసం ప్రసిద్ధి చెందిన మిఠాయి బ్రాండ్ ఐటీసీ క్యాండీమన్ పిల్లల కోసం ఒక విలక్షణమైన కార్యక్రమం 'వన్స్ అపాన్ ఏ టైమ్ బై క్యాండీమన్' ను ప్రారంభించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీసీ లిమిటెడ్ ఫుడ్స్ డివిజన్ హెడ్ అనుజ్ బన్సల్ మాట్లాడుతూ ఈ వినూత్నమైన ప్లాట్ ఫాంతో ఐటీసీ క్యాండీమన్ ప్రయత్నమేమిటంటే, పిల్లల ప్రధానంగా ఉండే బ్రాండ్ అనుభవాలను భారతదేశంలో ప్రారంభం చేసే లక్ష్యాన్ని కలిగి ఉందన్నారు. నేటి వేగవంతమైన, డిజిటల్ సాంకేతికతకు ప్రాధాన్యత గల ప్రపంచంలో, తల్లిదండ్రులు తమ పిల్లలు పాల్గొనేలా చేసే ప్రధానమైన మార్గాలను కనుగొనడంలో తరచూగా సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఈ కార్యక్రమంతో ఈ బ్రాండ్ డిజిటల్ ఆవిష్కరణతో స్వజనాత్మకతను మిళితం చేస్తూ తల్లిదండ్రులు, పిల్లల మధ్య శక్తివంతమైన అనుబంధాన్ని ఏర్పరిచే లక్ష్యాన్ని కలిగి ఉందని చెప్పారు. 'వన్స్ అపాన్ ఏ టైమ్ బై క్యాండీమన్', తమ పిల్లల పేరు, ఫోటో కలిగిన వ్యక్తిగత కథల పుస్తకం తయారు చేయడానికి మరియు ఆనందకరంగా చిత్రీకరించబడిన కథల్లో ప్రధానమైన పాత్రను పోషించే వ్యక్తిగత అవకాశాలను నెరవేర్చే కథల పుస్తకాలను రూపొందించడానికి తల్లిదండ్రులకు అవకాశం ఇస్తోందన్నారు. క్యాండీమన్ క్యూఆర్ వెబ్ సైట్ ద్వారా ప్రతి ఒక్కరికీ ఇది అందుబాటులో ఉంటుందని, ప్రియమైన చిలిపిదనం మరియు పురాణ సాహసాలతో ఉన్న ముందుగా ప్రణాళిక చేయబడిన కథల నుండి తల్లిదండ్రులు ఎంచుకోవచ్చు అన్నారు. కేవలం కొన్ని క్లిక్స్ ద్వారా పిల్లల పేరు మరియు ఫోటో కథలోకి సజావుగా కలిసిపోతాయని, నాణెం పుస్తకంలోని కథానాయకుడిగా మార్చి, ప్రతి పేజీలో వారు లీనమయ్యేలా చేస్తాయన్నారు. 'వన్స్ అపాన్ ఏ టైమ్ బై క్యాండీమన్' తో పిల్లలకు ఊహా శక్తిని కలిగించడం, కథల పుస్తకాలను చదవడం అనేది ఒక ఉత్తేజకరమైన, ఇంటరాక్టివ్ అనుభవంగా మార్చడంలో మా లక్ష్యం అన్నారు. పిల్లలు తరచూగా ఇతరుల హీరోగా నటించడం చూస్తారు. ఈసారి అందరి దృష్టి వారిపై ఉంటుంది. వారి చిన్న సాహసాల కథ అంతటా ఉంటాయని, తమ సొంత కథలో తామే హీరోలుగా పిల్లలు చూసుకోవడం ద్వారా, జీవితాంతం కథలు చెప్పడంలో వారికి ఆసక్తిని కలిగించే శాశ్వతమైన జ్ఞాపకాలను మేము సృష్టించాలని మేము ఆశిస్తున్నామన్నారు. ఈ ప్లాట్ ఫాం యూజర్‌లకు అనుకూలమైనది, సురక్షితమైనది, చదివే సమయం మర్చిపోలేని కుటుంబ సమయంగా మార్చే సహజమైన అనుభవాన్ని అందిస్తుందని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

విశాలాంధ్ర,మేడిపల్లి: పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్న ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...సోమవారం సాయంత్రం సమయంలో మేడిపల్లి పరిధిలోని ప్రశాంత్ నగర్ కాలనీలో నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని తెలిసి అక్కడ ఇంటి పై రైడ్ చేయగా అక్కడ పేకాట ఆడుతున్న నలుగురు (సంతోష్ కుమార్, కె.సంతోష్, వీరన్న మరియు గణేష్,)లను అదుపులోకి తీసుకోవడం జరిగిందని వారి వద్ద నుండి రూ.5000 నగదు, ప్లేయింగ్ కార్డ్స్, ఫోన్లు స్వాధీన చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు సిఐ గోవింద రెడ్డి తెలిపారు.

మిస్సింగ్ కేసుల పర్యవేక్షణకు నోడల్ అధికారులు: సుప్రీం

న్యూదిల్లీ: తప్పిపోయిన పిల్లల(మిస్సింగ్) కేసుల విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. మిస్సింగ్ కేసుల పర్యవేక్షణకు ప్రతి రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నోడల్ అధికారులను నియమించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్రాల్లో పిల్లల మిస్సింగ్, అక్రమ రవాణాపై 'గురియా స్వయం సేవి సంస్థాన్' అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం ఈమేరకు ఆదేశాలిచ్చింది. తప్పిపోయిన పిల్లల కేసులను పర్యవేక్షించడానికి నియమించిన నోడల్ అధికారుల వివరాలను ఆన్‌లైన్ సహా అన్ని మాధ్యమాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఇందుకోసం ఒక పోర్టల్ రూపొందించి... దానిలో అన్ని వివరాలు పొందుపరచాలని ఆదేశించింది. పోర్టల్‌లో అదృశ్యమైన పిల్లల గురించి ఫిర్యాదు అందిన వెంటనే నోడల్ అధికారులు చర్యలు తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది. పోర్టల్‌లో వచ్చే ఫిర్యాదుల ఆధారంగా పిల్లలను కిడ్నాప్ చేసే నేరస్థులపై కేసులు నమోదు చేసి...తగిన చర్యలు తీసుకోవచ్చని సూచించింది.

విశ్వవిద్యాలయాల అభివృద్ధికి చర్యలు

- విద్యార్థులకు మౌలిక సౌకర్యాల కల్పన
- తగిన నిధుల కేటాయింపు
- చంద్రబాబుకు రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల అభివృద్ధికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి కోర్సుల వైపు పయనించకపోవడంతో రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. అత్యున్నతంగా పేరుగాంచి, ఎందరో మహానుభావులను తీర్చిదిద్దిన విశ్వవిద్యాలయాల్లో పీజీలో చేరే విద్యార్థులు నానాటికీ తగ్గిపోతున్నారని, సాంకేతిక విశ్వవిద్యాలయాలు మినహాయిస్తే... మిగతా వాటిల్లో పీజీ చేరే విద్యార్థులు అరకొరగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు మంగళవారం రామకృష్ణ ఒక లేఖ రాశారు. రాయలసీమలో ఒక వెలుగు వెలిగిన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 1981లో ప్రారంభమైందని, గతంలో ఇక్కడ పీజీ సీటు దొరకాలంటే గగనంగా ఉండేదని గుర్తుచేశారు. ఒక్కో కోర్సుకు వేలాది మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసేవారిని, ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలలో 6 వేల పీజీ సీట్లు ఉన్నాయని, ఇందులోని విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో 1,200 సీట్లు ఉండగా రెండవ విడత కౌన్సిలింగ్ సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయి, 281 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారని తెలిపారు. పీజీ సీటు వచ్చిన తర్వాత కూడా చాలామంది విశ్వవిద్యాలయాల్లో చేరడం లేదన్నారు. 1,200 సీట్లున్న విశ్వవిద్యాలయాల్లో కనీసం 25 శాతం సీట్లు భర్తీ కావడం లేదని, విద్యార్థులు లేకపోవడంతో చాలా వసతి గృహాలు మూతపడ్డాయని తెలిపారు. విశ్వవిద్యాలయాల్లో 33 విభాగాలు ఉన్నాయని, అందులో ఆర్ట్స్ విభాగాల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. సైన్సు విభాగాలలో కొన్ని కోర్సులలో విద్యార్థులు చేరుతున్నప్పటికీ మిగతా కొన్ని కోర్సులపై విద్యార్థులు ఆసక్తి చూపడం లేదని అన్నారు. 1981లో విశ్వవిద్యాలయం ప్రారంభం నుంచి ఉన్న కోర్సులే ఉన్నాయని, నూతన కోర్సులు, ఉపాధి సంబంధమైన కోర్సుల వైపు దృష్టి పెట్టడం లేదని పేర్కొన్నారు. పీజీ కోర్సు చేసినా ఉద్యోగాలు లభిస్తాయన్న నమ్మకం లేకపోవడంతో విద్యార్థులు వాటిపై ఆసక్తి చూపడం లేదన్నారు. మరోవైపు డిగ్రీతోనే ఉద్యోగ అవకాశాలు వస్తుండడంతో విద్యార్థులు డిగ్రీతోనే చదువు ముగిస్తున్నారని వివరించారు. ఇంటర్ అనంతరం డిగ్రీలో చేరే విద్యార్థులు చాలా తక్కువగా ఉన్నారని, ఎక్కువ మంది విద్యార్థులు బీటెక్, పాలిటెక్నిక్ వైపు పయనిస్తున్నారని పేర్కొన్నారు. డిగ్రీలో చేరే విద్యార్థులు తక్కువగా ఉండడంతో పీజీ కోర్సులో చేరేవారు తగ్గిపోయారన్నారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో అరకొరగా అధ్యాపకులున్నారని, ఖాళీగా ఉన్న అధ్యాపక, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని, ఉపాధి సంబంధమైన నూతన కోర్సులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాల్లోని వివిధ సమస్యలను పరిష్కరించి, విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, అందుకోసం తగిన నిధులను కేటాయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల అభివృద్ధి కోసం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఇంజనీర్ సుబ్బరాయుడు మృతికి రామకృష్ణ సంతాపం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల రూపకల్పన, నిర్మాణం కోసం కృషి చేసిన విశ్రాంత డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.సుబ్బరాయుడు మరణం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాయలసీమ నీటి పారుదల ప్రాజెక్టుల స్థితిగతులు, తుంగభద్ర నదీ జలాల సద్వినియోగం, వేదవతి ఎత్తిపోతల, గుండ్రేవుల రిజర్వాయరు నిర్మాణాల గురించి సుబ్బారాయుడు ఎంతో ఆలోచించేవారన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేసీ కెనాల్, శ్రీశైలం కుడి బ్రాంచి కాలువ, తెలుగు గంగ ప్రాజెక్టుల పరిధిలో ఇంజనీర్‌గా వివిధ బాధ్యతలను ఆయన అంకితభావంతో నిర్వహించారని వివరించారు. పదవీ విరమణ తర్వాత కూడా ఆయన ఆలోచనలు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చుట్టూనే సాగేవన్నారు. తన వృత్తి పట్ల అంకితభావం, కరవు పీడిత రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కోసం పరితపించిన సుబ్బరాయుడు మరణం బాధాకరమని తెలిపారు. ఇంజనీర్ సుబ్బరాయుడు మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

గ్లోబల్ కనెక్టివిటీ హబ్‌గా విశాఖ

మన్నవ మోహనకృష్ణ ఆకాంక్ష

విశాలాంధ్ర-సచివాలయం: విశాఖపట్నంలో ఒక గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు శుభపరిణామమని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య ఒప్పందం చరిత్రాత్మకమన్నారు. రాబోయే రోజుల్లో గ్లోబల్ కనెక్టివిటీ హబ్‌గా విశాఖ ఉండబోతుందని ఆకాంక్షించారు. విశాఖ నుంచి 12 దేశాలతో సబ్ సీ-కేబుల్ విధానం ద్వారా అనుసంధానం అవుతాయని అన్నారు. అమెరికా వెలుపల గూగుల్ సంస్థ పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టడం ఇదే తొలిసారని, ఈ డేటా సెంటర్ ద్వారా ప్రపంచ స్థాయి ఏఐ నిపుణులు తయారయ్యే అవకాశం ఉందని అన్నారు. గూగుల్ కంపెనీ రాకతో రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు అందుతాయని మన్నవ మోహనకృష్ణ విశ్వాసం వ్యక్తంచేశారు. గూగుల్ టెక్ సంస్థను విశాఖపట్నానికి తేవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కృషి అభినందనీయమన్నారు. పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం, సమర్థ నాయకత్వంతో ఏపీకి గూగుల్, టీసీఎస్, ఆక్సెంచర్ వంటి టెక్ దిగ్గజాలు వస్తున్నాయన్నారు. కూటమి పాలనలో రూ.11.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించారని, పాటు 9.5 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించారని మెచ్చుకున్నారు.

పర్యాటక గమ్యస్థానాలుగా

తిరుపతి, విశాఖ అభివృద్ధి

కేంద్రానికి మంత్రి దుర్గేశ్ వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుపతి, విశాఖ నగరాలను ప్రపంచ పర్యాటక గమ్యస్థానాలుగా తీర్చిదిద్దాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ విజ్ఞప్తి చేశారు. రాజస్థాన్, ఉదయ్‌పూర్‌లో కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అధ్యక్షతన జరుగుతున్న జాతీయ పర్యాటక మంత్రుల సమావేశంలో ఆయన మంగళవారం ఈ అంశాన్ని లేవనెత్తారు. రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధిపై సమగ్ర నివేదికను సమర్పించారు. ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పర్యాటక పటంలో అగ్రస్థానంలో నిలబెట్టాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. మెరైన్ గమ్యస్థానంగా విశాఖపట్నం, ఆధ్యాత్మిక, సాంస్కృతిక గమ్యస్థానంగా తిరుపతిని ప్రపంచ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ వైవిధ్యం, సంసిద్ధత, సాంస్కృతిక సంపదలను ప్రతిబింబించే ఈ ప్రాజెక్టులు రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు తెస్తాయన్నారు. గత 15 నెలల్లో పర్యాటక రంగంలో రూ.12 వేలకోట్ల పెట్టుబడులు ఆకర్షించామని దుర్గేశ్ తెలిపారు. తాజ్, ఐటీసీ, ఒబెరాయ్, హిల్టన్, లెమన్ ట్రీ వంటి ప్రపంచ ప్రఖ్యాత హోటల్ బ్రాండ్లతో కలిసి 21 హోటల్, రిసార్ట్ ప్రాజెక్టులు అమలవుతున్నాయని, సుమారు 18 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కేంద్ర పర్యాటక శాఖ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను ప్రముఖ పర్యాటక రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు. 2030 నాటికి ఆసియాలోనే ఆకర్షణీయమైన గమ్యస్థానాలలో ఒకటిగా నిలుపుతామని మంత్రి దుర్గేశ్ వెల్లడించారు.

మెట్రో టెండర్ల గడువు పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టుకు టెండర్ల గడువు మరో 10 రోజులకు ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ) పొడిగించింది. ఈనెల 24వ తేదీ వరకు అవకాశం కల్పించింది. విజయవాడ కాంట్రాక్టు సంస్థల అభ్యర్థనల మేరకు గడువు పెంచారు. రూ.4,500 కోట్ల వ్యయంతో టెండర్లు ఆహ్వానించనున్నారు. మెట్రో టెండర్ల కోసం ప్రధాన కంపెనీలు ఎదురు చూస్తున్నాయి. ఇప్పటికే ప్రీ-బిడ్డింగ్ మీటింగ్‌లో 10కిపైగా బడా కంపెనీలు పాల్గొన్నాయి. జాయింట్ వెంచర్ విధానంలో పోటీకి రంగంలోకి దిగేందుకు నిర్మాణ దిగ్గజాలు ఆసక్తి చూపుతున్నాయి. టెక్నికల్ బిడ్లు, ఫైనాన్షియల్ బిడ్లు తెరవనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎంపికైన సంస్థలకు టోపోగ్రఫీ, జియోగ్రాఫికల్ సర్వేలు, సాయిల్ టెస్టులు నిర్వహిస్తారు. ఈ సర్వేలకు నాలుగు-ఐదు నెలలు పట్టే అవకాశముంది. కేంద్ర అనుమతులు లభించగానే క్షేత్రస్థాయిలో మెట్రో పనులు ప్రారంభమవుతాయి. మొదటి దశలో గన్నవరం నుంచి పండిట్ నెహ్రూ బస్టాండ్, పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి పెనమలూరుకు 38.40 కిలోమీటర్ల దూరంలో నిర్వహిస్తారు. రూ.11,009 కోట్ల అంచనాలు రూపొందించారు. ఇందులో భూ సేకరణ ఖర్చు రూ.1,152 కోట్లను రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంది. రెండో దశలో పండిట్ నెహ్రూ బస్టాండ్ నుంచి అమరావతి (రిజర్వాయర్ స్టేషన్)కు 27.75 కిలోమీటర్ల దూరంలో నిర్మాణానికి అంచనాలు రూపొందించారు. విజయవాడ మెట్రో టెండర్ల కోసం ప్రముఖ ఇన్‌ఫ్రా కంపెనీలు టెండర్లు వేసేందుకు సిద్ధమవుతున్నాయి.

అమెరికా, చైనా తరువాత భారత్: గడ్కరీ

పుదుచ్చేరి: భారతదేశ ఆటోమొబైల్ పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతోందని, 2014లో రూ.14 లక్షల కోట్లుగా ఉన్న ఈ పరిశ్రమ... 2025 నాటికి రూ.22 లక్షల కోట్లకు చేరిందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ మంగళవారం చెప్పారు. పుదుచ్చేరిలో గ్రేడ్ సెపరేటర్, రోడ్ల విస్తరణ పనులు, కొత్త రోడ్డు ప్రాజెక్టుకు శంకుస్థాపన తర్వాత మంత్రి గడ్కరీ మాట్లాడుతూ జపాన్‌ను అధిగమించి మూడవ అతిపెద్ద ఆటోమొబైల్ మార్కెట్‌గా భారత్ అవతరించిందన్నారు. ఆటోమొబైల్ మార్కెట్ పరిమాణం పరంగా అమెరికా, చైనా తర్వాత భారత్ మూడవ స్థానంలో ఉందని చెప్పారు. ఈ పరిశ్రమ 4.5 కోట్ల ఉద్యోగాలు సృష్టించిందని, ఎగుమతి రంగానికి ఎంతో దోహదపడిందని గడ్కరీ తెలిపారు. దేశంలో లాజిస్టిక్స్ ఖర్చు 16 శాతం నుంచి 10 శాతానికి తగ్గిందని, మెరుగైన రోడ్డు, మౌలిక సదుపాయాల కారణంగా డిసెంబర్ నాటికి ఇది 9 శాతానికి తగ్గుతుందని నితిన్ గడ్కరీ అన్నారు. వివిధ స్థిరమైన పద్ధతులు అవలంబించడం గురించి కేంద్ర మంత్రి మాట్లాడుతూ రోడ్ల నిర్మాణంలో మున్సిపల్ వ్యర్థాలను ఉపయోగిస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు 18 లక్షల టన్నుల మున్సిపల్ వ్యర్థాలు ఉపయోగించామని, రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు వ్యర్థాలను ప్రోత్సహించేలా మంత్రిత్వ శాఖ ప్రణాళిక వేసిందని అన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై ఉన్నతస్థాయి కమిటీ

విశాలాంధ్ర-సచివాలయం: ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు ఉన్నతస్థాయి కమిటీ నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనానికి కమిటీని నియమించింది. కమిటీ ఏర్పాటు సహా తదుపరి చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. కమిటీ ఛైర్‌పర్సన్‌గా ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి నియామకంతోపాటు 13 మందితో కమిటీని నియమిస్తూ ఆదేశాలిచ్చింది. టెక్నికల్, ఇంటర్మీడియట్, స్కూల్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లను సభ్యులుగా నియమించింది.

టికెట్ లేని ప్రయాణికుల నుంచి రైల్వేకు రూ.1.08 కోట్ల ఆదాయం

విశాలాంధ్ర-హైదరాబాద్: దీపావళి, ఛాత్ పండుగల సీజన్ నేపథ్యంలో రైలు ప్రయాణికుల భారీ రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే మంగళవారం ముమ్మరంగా టికెట్ల తనిఖీ కార్యక్రమం చేపట్టింది. దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఇతి పాండే జారీ చేసిన సూచనల మేరకు దక్షిణ మధ్య రైల్వేలోని ఆరు డివిజన్లయిన సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్‌లో తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. టికెట్ తనిఖీ కార్యకలాపాలలో జోన్ ఒకే రోజు అత్యధికంగా రూ.1.08 కోట్ల ఆదాయాన్ని సాధించింది. టికెట్ లేని ప్రయాణం లేదా అనధికారికంగా ప్రయాణించిన వారిపై 16,105 కేసులను నమోదు చేసి, ఆ మొత్తాన్ని వసూలు చేశారు. సాధారణంగా జోన్ సగటున రోజువారీ టికెట్ తనిఖీల్లో దాదాపు 9,500 కేసుల నమోదుతో సుమారుగా రూ.47 లక్షల ఆదాయాన్ని సంపాదిస్తోంది. దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో ఒకే రోజు టికెట్ తనిఖీల్లో ఆదాయం కోటి రూపాయలు దాటడం ఇదే తొలిసారి. ఒకే రోజు అత్యధిక టికెట్ తనిఖీ ఆదాయం కూడా ఇదే. ఈ నెల 6వ తేదీన నిర్వహించిన తనిఖీల్లో అత్యధికంగా రూ.92.4 లక్షలు వచ్చాయి. భారతీయ రైల్వేల అన్ని జోన్లలో కంటే ఈ నెల 13న ఇదే అత్యుత్తమ టికెట్ చెకింగ్ ఆదాయం. విజయవాడ డివిజన్ అత్యధికంగా రూ.36.91 లక్షలు, గుంతకల్ డివిజన్ రూ.28 లక్షలు, సికింద్రాబాద్ డివిజన్ రూ.27.9 లక్షలు, గుంటూరు డివిజన్ రూ.6.46 లక్షలు, హైదరాబాద్ డివిజన్ రూ.4.6 లక్షలు, నాందేడ్ డివిజన్ రూ.4.08 లక్షలు టికెట్ తనిఖీ ఆదాయాన్ని అందించాయి. ఈ టికెట్ తనిఖీ ప్రధాన లక్ష్యం అధీకృత ప్రయాణీకులకు కలిగే అసౌకర్యాన్ని తగ్గించడం, ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని రిజర్వ్‌డ్, అన్‌రిజర్వ్‌డ్ కోచ్‌లలో టికెట్ లేని, అనధికారికంగా ప్రయాణించడాన్ని అరికట్టడమని దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఈ ప్రత్యేక తనిఖీ నిర్వహణపై అన్ని డివిజన్ల వాణిజ్య సిబ్బంది, అధికారులను అభినందించారు. ఈ రకమైన కార్యాచరణ అధీకృత ప్రయాణం గురించి సాధారణ ప్రజలలో అవగాహన పెంచుతుందని, టికెట్ అమ్మకాలను పెంచడంలో కూడా సహాయపడుతుందని ఆయన పేర్కొన్నారు.

హంద్రీనీవాతో రాయలసీమకు జలసిరి

ఇప్పటికే 299 చెరువులు కృష్ణాజలాలతో నింపాం

మంత్రి నిమ్మల రామానాయుడు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: హంద్రీనీవాతోనే రాయలసీమకు జలసిరి వస్తుందని, ఈ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని మొత్తం 517 చెరువులకు గాను 299 చెరువులను కృష్ణాజలాలతో నింపామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. మంగళవారం హంద్రీ నీవా నీటితో చెరువులు నింపే కార్యక్రమానికి సంబంధించి కర్నూలు ఇరిగేషన్ సీఈ కార్యాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు సకాలంలో పూర్తి చేసిన అధికారులందరినీ మంత్రి నిమ్మల అభినందించారు. చివరన ఉన్న కుప్పం వరకు కృష్ణాజలాలు తరలి వెళ్లడంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. రాయలసీమకు గుండెకాయ వంటి హంద్రీనీవా ప్రాజెక్ట్‌ని గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం ఆటకెక్కించిందన్నారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లన్నీ 961 టీఎంసీల సామర్థ్యం ఉంటే 844 టీఎంసీలతో వాటిని నింపగలిగామన్నారు. అంటే 87.86శాతం నీటిని నిల్వ చేయగలిగామన్నారు. రాయలసీమలోని మొత్తం 38 నియోజకవర్గాల పరిధిలో ఉన్న హంద్రీనీవా ప్రాజెక్టు కాలువలకు అనుబంధంగా 517 చెరువులు ఉన్నాయని... వీటిలో 174చెరువులు పూర్తిగా, 125 చెరువులు పాక్షికంగా అంటే మొత్తం 299 చెరువుల్ని నీటితో నింపగలిగామన్నారు. ప్రతిష్ఠాత్మకమైన హంద్రీనీవాకు రూ 3,850 కోట్లు వెచ్చించడమే గాక 738 కిలో మీటర్లు కృష్ణమ్మ జలాలను కుప్పం వరకు తీసుకెళ్లడం ఒక చరిత్రగా మంత్రి అభివర్ణించారు. ప్రతి నియోజకవర్గంలో ఉన్న చెరువులను నింపే బాధ్యతను, పర్యవేక్షణను ఇరిగేషన్ అధికారులతో పాటు, రెవెన్యూ అధికారులకు కూడా అప్పగించినట్లు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ ంలో సినిమా సెట్టింగులు, అద్దె ట్యాంకర్లు, అద్దె గేట్లు, బెంగళూరు నుంచి పూలు తెప్పించి నీటి వనరుల ప్రారంభోత్సవాలు నిర్వహించిన సంగతి తెలిసిందేనని ఎద్దేవా చేశారు. జగన్ హెలికాప్టర్ ఎక్కే సమయానికి ఆ నీరు ఆవిరి అయిపోయిన సంగతి అందరికీ గుర్తుండే ఉంటుందన్నారు. రాయలసీమ ముద్దుబిడ్డనని చెప్పుకునే జగన్ రాయలసీమ ప్రాజెక్టులకు తీరని ద్రోహం చేశాడని మంత్రి విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు చెప్పింది చేస్తున్నారు... చేసిందే చెబుతున్నారని, ఈ ప్రభుత్వ పనితీరు పారదర్శకంగా ఉన్న సంగతి గమనించాలని విజ్ఞప్తి చేశారు. హంద్రీనీవా ప్రాజెక్టు రెండోదశగా మడకశిర బ్రాంచ్ కాలువ పనులు పూర్తి చేసి హిందూపురం,మడకశిర, పెనుగొండ నియోజవర్గాలకు నీరు ఇస్తామన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టుకు సంబంధించి 400 కిలోమీటర్ల నుంచి 554 కిలోమీటర్ల వరకు అంటే అడివిపల్లి రిజర్వాయర్ నుంచి నీవా, అక్కడ నుంచి తిరుపతి కళ్యాణి డ్యామ్ వరకు అతి త్వరలో నీరు తీసుకెళ్లాలనేది ముఖ్య మంత్రి ఆశయమని స్పష్టం చేశారు. తద్వారా రాయలసీమను రతనాల సీమ చేయాలని కూటమిలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ కృత నిశ్చయంతో ఉన్నట్లు మంత్రి తెలిపారు. ఈసమీక్ష సమావేశంలో ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, ప్రాజెక్టు సీఈలు కబీర్ బాషా, నాగరాజు, ఎస్‌ఈలు, ఈఈలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

'నకిలీ మద్యం'పై కఠిన చర్యలు: కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నకిలీ మద్యం ఆరోపణలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. ఆయన మంగళవారం ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా, డైరెక్టర్ చామకూరి శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ తదితర అధికారులు వర్చువల్‌గా సమావేశమయ్యారు. డీసీల నుంచి స్టేషన్ హౌస్ ఆఫీసర్ల వరకు ఫీల్డ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎక్సైజ్ చట్టాల అమలులో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించమన్నారు. బెల్ట్ షాపులు లేదా అక్రమంగా మద్యం విక్రయించే కేంద్రాలు రాష్ట్రంలో ఉండరాదని, వాటిపై కచ్చితమైన పర్యవేక్షణ ఉండాలని కొల్లు రవీంద్ర ఆదేశించారు. 'ఏపీ ఎక్సైజ్ సురక్ష' యాప్ పనితీరును పరిశీలించారు. ఎక్సైజ్ కమిషనర్‌తో కలిసి విజయవాడలోని సీతారామపురం, సంబమూర్తి రోడ్డులోని మద్యం షాపును సందర్శించారు. యాప్ వినియోగం గురంచి తెలుసుకున్నారు. షాపులో మద్యం సీసాలు స్కాన్ చేసి, యాప్ ద్వారా వివరాలు పరిశీంచిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. చదువులేని వినియోగదారుల సౌకర్యార్థం కొత్త విధానం రూపొందించేందుకు కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. 'బాటిల్ స్కాన్ చేస్తే మద్యం నకిలీదైతే ఎరుపు లేదంటే పచ్చ లైట్ చూపించేలా అభివృద్ధి చేయాలని, దీనిని మరో 45 రోజుల్లో అమల్లోకి తేవాలని అధికారులకు మంత్రి సూచించారు.

ఇమామ్ బెయిల్ పిటిషన్ ఉపసంహరణ

న్యూదిల్లీ: జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ స్కాలర్ షర్జిల్ ఇమామ్ మధ్యంతర బెయిల్ కోసం దిల్లీ కోర్టులో చేసుకున్న దరఖాస్తును మంగళవారం ఉపసంహరించుకున్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బహదూర్‌గంజ్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడం కోసం ఈనెల 15 నుంచి 29వ తేదీ వరకు 14 రోజుల మధ్యంతర బెయిల్‌ను కోరుతూ ఆయన పిటిషన్ దాఖలు చేశారు. అయితే సాంకేతిక, విధానపరమైన సమస్యల ఉన్నాయంటూ పిటిషన్ వెనక్కి తీసుకునేందుకు కోర్టు అనుమతిని ఇమాం తరపు న్యాయవాది అహ్మద్ ఇబ్రహీం కోరారు. ఈ కేసులో సాధారణ బెయిల్ కోసం పిటిషన్ సుప్రీంకోర్టులో పెండింగ్ ఉండటంతో ఉపసమనం పొందేందుకు సరైన ఫోరాన్ని ఆశ్రయిస్తామన్నారు. అదనపు సెషన్స్ జడ్జి సమీర్ బాజ్‌పేయి అనుమతితో పిటిషన్ వెనక్కి తీసుకున్నారు. 'షర్జిల్ ఇమామ్ జుడిషియల్ కస్టడీ, ఆపై వరుసగా ఐదేళ్లకుపైగా నిర్బంధంలో ఉన్నారు. ఆయనకు ఎప్పుడు తాత్కాలిక బెయిల్ కూడా ఇవ్వలేదు. రాజకీయ ఖైదీ, విద్యార్థి నాయకుడు కావడంతో తన స్వరాష్ట్రం బీహార్ అసెంబ్లీకి స్వతంత్రంగా పోటీ చేయాలని భావించారు. ఆయనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదు. స్వతంత్ర అభ్యర్థి కావడంతో నామినేషన్, ఎన్నికల ప్రచారం కోసం ఏర్పాట్లు చేసేందుకు ఎవరూ లేరు. ఇమామ్ తమ్ముడు తమ కుటుంబ బాధ్యతలు, అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిని చూసుకుంటున్నారు' అని పిటిషన్ పేర్కొంది. యూఏపీఏ చట్టం కింద ఐదేళ్ల రెండు నెలల నుంచి తీహార్ జైల్లో షర్జిల్ ఇమామ్ ఉన్నారు. సీఏఏ, ఎన్ఆర్‌సీ వ్యతిరేక ఆందోళనల సమయంలో దిల్లీ, అలీగఢ్, అసన్‌సోల్, చక్‌బంద్‌లో ప్రసంగాల నేపథ్యంలో ఆయనపై కేసు ఉంది. 2020 జనవరిలో అరెస్టయ్యారు. ఆయనకు సాధారణ బెయిల్ ఇచ్చేందుకు దిల్లీ హైకోర్టు సెప్టెంబరు 2న నిరాకరించింది. సహ నిందితులు ఉమర్ ఖాలిద్, మరో ఏడుగురి పిటిషన్లు తిరస్కరించింది.

మోదీ! ఇదేం స్నేహం?

మునీర్, షరీఫ్‌పై ట్రంప్ ప్రశంసలతో కాంగ్రెస్ ప్రశ్న

న్యూదిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీకి ఉన్న స్నేహం ఏ రకమైనదని కాంగ్రెస్ మంగళవారం ప్రశ్నించింది. పాకిస్థాన్ సైన్యాధికారి అసీం మునీర్, ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌పై ట్రంప్ ప్రశంసలతో స్పందించింది. ఈజిప్టులో జరిగిన గజా శాంతి సదస్సు సందర్భంగా మునీర్, షరీఫ్‌ను ట్రంప్ మెచ్చుకున్నారు. వారికి ప్రత్యేక స్థానమిచ్చారు. షరీఫ్ కూడా ట్రంప్‌ను శాంతిని కోరుకునే వ్యక్తిగా పొగిడారు. ఈ పరిణామాల క్రమంలో మోదీతో ట్రంప్ స్నేహబంధాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో ప్రశ్నించారు. 'మీ స్నేహం ఏకరమైనది? జూన్ 18న ఫీల్డ్ మార్షల్ అసీం మునీర్ కోసం శ్వేతసౌధంలో ట్రంప్ ప్రత్యేకంగా విందు ఏర్పాటు చేశారు. ఇదే ఫీల్డ్ మార్షల్ చేసిన విద్వేష వ్యాఖ్యలే ఏప్రిల్‌లో పహల్గాం దాడికి దారితీశాయి. ఇప్పుడు ఈజిప్టు సదస్సులో అసీం మునీర్‌ను తనకు ఇష్టమైన ఫీల్డ్ మార్షల్‌గా ట్రంప్ మెచ్చుకున్నారు. తనను ప్రశన్నం చేసేందుకు మోదీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాగానీ ఇలాంటి ప్రవర్తనతో భారత్‌కు అమెరికా అధ్యక్షుడు ఎలాంటి సంకేతమిస్తున్నారు?' అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది కూడా షరీఫ్‌ను ట్రంప్ ప్రశంసించే వీడియోను సామాజిక మాధ్యమంలో పెట్టారు. 'ఆయనకు దాసోహం అవ్వడానికి అడుగు దూరంలో ఉన్నారంతే' అని దుయ్యబట్టారు. భారత్, పాకిస్థాన్ మధ్య శాంతికి తానే కారణమని ట్రంప్ పదేపదే చెప్పుకుంటుంటే ప్రధాని ఎందుకు మౌనం వహిస్తున్నారని కూడా జైరాం రమేశ్ నిలదీశారు. 'అబ్ కీ బార్ 50 పార్' అంటూ ఎద్దేవా చేశారు. 'ఆపరేషన్ సిందూర్‌ను ఆపానని, సుంకాల ద్వారా భారత్‌పై ఒత్తిడి తెచ్చానని ట్రంప్ ఇప్పటికే 51సార్లు చెప్పారు. మన ప్రధాని మాత్రం మౌనంగా ఉంటూ... గజాలో శాంతి కోసం ట్రంప్‌ను పొగుడుతున్నారు' అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.